# కబీర్ ఖడా బజార్ మే

## ఇందులో

| | | |
|---|---|---|
| కబీరు | | |
| నూరా | – | కబీరు తండ్రి |
| నీమా | – | కబీరు తల్లి |
| కొత్వాల్ | – | కాశీ పట్టణ కొత్వాలు |
| కాయస్థ్ | | |
| మహంత్ | | |
| మౌల్వీ | | |
| గుడ్డి బిచ్చగాడు | | |
| బిచ్చగాడి తల్లి | | |
| రైదాస్ | – | కబీరు స్నేహితుడు |
| సీనా | – | కబీరు స్నేహితుడు |
| పీసా | – | కబీరు స్నేహితుడు |
| బీషీరా | – | కబీరు స్నేహితుడు |
| లోఈ | – | కబీరు భార్య |
| సికిందర్ లోడీ | – | ఢిల్లీ చక్రవర్తి |

ఇంకా సాధువులు, సాలెవారు, పిల్లవాడు, పురజనులు, ఓ మనిషి, స్త్రీలు, సిపాయిలు వగైరా……

# <u>కబీర్ ఖడా బజార్ మే</u>

## మొదటి దృశ్యం

(సాలెల పల్లె, చిన్న చిన్న గుడిసెలు. నూలు వడుకుతూ, నేస్తూ వుంటారు. ఒక గుడిసె ఎదురుగా నూరా నూలు ఉడకబెడుతూ ఉంటాడు. ఓ సాలెవాడు పక్కనుంచి బుజం మీద ఓ తాను పెట్టుకొచ్చి నూరా దగ్గర ఆగుతాడు)

నూరా: చాలా తొందరగా వచ్చేశావే బజారు నుంచి.

సాలెవాడు: తీసుకున్న సరుకు అమ్ముడు పోలేదు, ఇంకా నీ దగ్గర నించి సరుకు తీసుకుని ఏం చేస్తాం అన్నారు దుకాణాలవాళ్ళు.

నూరా: పదో పరకో తెచ్చే వుంటావులే!

సాలెవాడు: ఎర్రని ఏగానీ దొరకలా. ఏమన్నా అడుగుదామంటే "నువ్వు ఇచ్చింది ఇచ్చినట్టే ఉంది, మేము అమ్మలేం తీసుకుపో" అంటారు. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి.

నూరా: కబీరేమన్నా కలిశాడా? వాడి సరుకేమన్నా అమ్ముడు పోయిందా లేదా? పొద్దుననగా వెళ్ళాడు.

సాలెవాడు: ఈ తాను మీదే కబీరు ఇచ్చిందే!

నూరా: కబీరా? కబీరు నీ కెందుకు ఇచ్చాడు? పొద్దున అమ్ముదామనేగా తీసుకెళ్ళాడు.

సాలెవాడు: ఏమో! ఇది ఇంటిదగ్గర ఇచ్చెయి. నే వచ్చేసరికి సాయంకాలం అవుతుందని చెప్పమన్నాడు.

నూరా: ఎక్కడ కనిపించాడు?

సాలెవాడు: కొత్వాలు ఇంటి దగ్గర. చాలామంది చుట్టూ మూగి ఉన్నారు. పెద్ద మాట్టాడే మొగాడు బైలుదేరాడు. బజార్లో అమ్ముకోటానికి వెళ్లినవాణ్ణి అమ్ముకు రమ్మను – అని అన్నారు.

నూరా: ఏమిటి ఏమయింది మళ్ళీ.

సాలెవాడు: మర్వాడీ వీధిచంబ మసీదు వైపు వెడుతూవుండగా కలిశాడు. అతని వెనకనే పెద్ద గుంపు వుంది.

నూరా: ఏమన్నావ్?

సాలెవాడు: రోజూ ఉండేదా! కబీరు చెప్పే మాటలంటే కొంతమందికి ఇష్టం. మరికొంతమందికి అయిష్టం. ఎవరో కొతవాల్‌లో ఫిర్యాదు చేసివుంటారు. ఎవరికో ఏదో సలహా చెప్పబోయుంటాడు; ఫలితం అనుభవించాలిగా మరి!

నూరా: నువ్వేదో దాస్తున్నావు. కబీరు ఏం చేస్తున్నాడో నిజం చెప్పు.

సాలెవాడు: మహంతుగారి పల్లకి వెడుతుంటే, మహంతు మనుష్యులు ఎవరినో బెత్తం పెట్టి కొట్టారు. మధ్యలో కబీరు వెళ్ళాడు. వాళ్ళు కొట్టే వాళ్ళని వదలి కబీరు మీద పడ్డారు. అంతకు మునుపే మౌల్వీల్ వాదం పెట్టుకున్నాట్ట!

(కబీరు తల్లి దర్వాణ దగ్గరకి వచ్చి కూర్చుంటుంది)

కాలం ఎట్టా మారిపోతుందో చూశావా?

నూరా: (భార్య నీమాతో) విన్నావా నీ కొడుకు చేసిన నిర్వాకం?

సాలెవాడు: కొత్వాలు సజీవ సమాధి చేయించే మనిషి. మునుపుండే కొత్వాలు చాలా మంచివాడు. బట్టలు పెట్టుకోడానికి పెట్టె అవీ ఇచ్చేవాడు. ఈ కొత్వాలూ ఉన్నాడు, ఎందుకు. పైగా ఈయన తాత తైమూల్ సీన నించి వచ్చాట్ట. ఢిల్లీలో జరిగిన అరాచకాల్లో ఆయనకీ చెయ్యి వుందట.

నూరా: ఈ పనికిమాలిన వాడితో వేడగం కష్టంగా ఉంటోంది.

సాలెవాడు: నన్నడిగితే వాడితో మీరూ అమ్మకాలకి వెళ్ళండి. బజారులో పనిపూర్తి చేసుకోడం, రావడం. అసలు వాడికి పెళ్లిచేస్తే పోలా! కాళ్లకి బంధం వేసినట్టే! ఇష్టమొచ్చినట్టు రోడ్డు పట్టకుండా ఇంటి పట్టునపడి వుంటాడు.

నూరా: మేం చెప్పింది వింటాడా? అదేమంటే ఇల్లు వదిలి పారిపోతాడు. ఇప్పటికే రెండు సార్లయింది భాగోతం. ఓసారి హరిద్వార్ దగ్గర దొరికాడు. నిజానికి నాకైతే వెళ్ళాలని లేదు కాని ఈవిడ చిక్కి సగమైతే వెళ్ళొచ్చా. ఇరవై నాలుగు గంటలూ ఏడ్పువెవడు భరిస్తాడు. ఊరూవాడా వెతికి బుజ్జగించి పట్టుకొస్తే మళ్ళీ ఏడు నెలలు తర్వాత పరార్. తాళ్ళతో కట్టి పడెయ్యలేం గదా! లేకపోతే బందీల దొడ్డిలాంటి ఊళ్ళో పడెయ్యాలి.

నీమా: ఏం జరిగినా మేం భయపడి పిసుక్కు చావల్సిందే గాని వాడ్ని ఏం అనం. అంటే పారిపోతాడని భయం. ఈసారి పారిపోతే నే గంగలో పడిచస్తా.

నూరా: (కోపంగా) బెదిరిస్తావా? అసలు నువ్వు గాదు! వాడిని పాడుచేసింది.

సాలెవాడు: నా మాట విని వాడికి పెళ్ళిచెయ్యండి. వాడే బాగుపడతాడు. లేకపోతే కొరివితో తలగోక్కోడం అవుతుంది. సరే, నే వస్తా. ఆ తాను జాగ్రత్త.

(సాలెవాడు వెళ్ళగానే)

నూరా: ఇంట్లో తిండికి గింజల్లేవు. వీడు చూస్తే ఆకతాయిగా తిరగడం తప్ప ఏమీ చెయ్యడం లేదు.

నీమా: కాస్త తమాయించుకో. ఏం మాటలవి.

నూరా: ఎవడ్ని ఎత్తుకొచ్చావో ఏమో. అప్పుడేమో ఒళ్ళుపై తెలియక తెచ్చావు. చేసినదానికి అనుభవించు. పాముని పెంచినట్టే. వాడివల్ల ఏమీ ప్రయోజనం అవదు.

నీమా: ఎందుకు వాడినా అలా తిడతావు. వాడేమో నిన్ను నెత్తిన పెట్టుకుంటాడు. నువ్వేమో.....

నూరా: ఈసారి బైటకెళ్లనీ చెపుతా. మడమ విరిక్కొట్టి కూర్చోబెడతా. ఇంక ఇల్లు కదలనివ్వను.

నీమా: (ఏడుస్తుంది) ఎప్పుడూ తిడుతూనే వుంటారు. వాడంటూనే ఉన్నాడు. నామూలంగా మీరెందుకు దెబ్బలాడుకుంటారు నేనే వెళ్ళిపోతానని.

నూరా: నువ్వు వాణ్ణి తెచ్చేప్పుడే నా ఎడం కన్ను అదిరింది. అయినా వాడ్ని తేనిచ్చాను. అదే నా పొరపాటు. నా నెత్తిన ఎక్కి ఇప్పుడిద్దరూ సవారి చేస్తున్నారు.

నీమా: నన్నంటావు దేనికి? వాడ్ని తెచ్చేటప్పుడు నువ్వూ నా వెంట వచ్చావుగా!

నూరా: నీమాట కాదనలేక వచ్చా. పరాయి బిడ్డ కన్నబిడ్డ అవుతాడా?

నీమా: భగవంతుడు ఇచ్చిన వాడిని గురించి ఇంకో పొల్లుమాట మాట్లాడితే నే ఊరుకోను.

నూరా: వీడిని తీసుకురాకుండా ఉంటే నేనింకో పెళ్ళిచేసుకునేవాణ్ణేమో! నా అన్న పిల్లలుండేవారు. వీడిని పెంచినందుకు బాగానే అనుభవిస్తున్నాం. ప్రాణాలకి నెమ్మది లేకుండా చేస్తున్నాడు. గుండెల మీద కుంపటయ్యాడు.

నీమా: చాల్చాల్లే. దివిటీ పెట్టి వెతికినా అట్టాంటి కొడుకు దొరకడు. పల్లెత్తి మాట్లాడడు నా బిడ్డ.

నూరా: ఆ మరే. వాడికి నోట్లో నాలికుంటేగా! ఊళ్ళో ఊసులన్నీ మాత్రం వీడికే కావాలి. ఏదో బట్టలు నేసి బతికేవాళ్ళం. మన బతుకేదో మనం బతకాలి కాని. ఇంట్లోంచి బట్టలు తీసుకుపోతాడు. ఎందుకూ పనికిమాలిన వెధవలతో అడ్డమైన కబుర్లు చెబుతూ కూర్చుంటాడు.

నీమా: సావాసగాళ్ళతో కూర్చుంటే తప్పేంటి? భంగు-గింగు ఏం తాగడం లేదుగా! జూదం ఆడడు.

నూరా: శాస్త్రాలు చెబుతాడు చాలదూ! లారీలు పుచ్చుకుని జనం వెంటపడతారు.

నీమా: శాస్త్రాలు చెపుతున్నాడు. భంగు తాగడం లేదులే!

నూరా: చెప్పిందే చెప్పి ఎన్ని సార్లు చెపుతావ్? భంగు కంటె శాస్త్రాలే మత్తులో ముంచుతాయి. నన్నడుగు నే చెబుతా. శాస్త్రాల పిచ్చి పట్టిందంటే ఒకంతట పోదు. ఇల్లు నాశనమయినా సరే. ఎవడో తల చితగొగ్గడితే గాని –

నీమా: చాల్లే! ఏమిటి మాటలు.

నూరా: నేనివాళ కుండబద్దలు కొట్టినట్లు ఉన్నదున్నట్లు చెప్పదలుచుకున్నా.

నీమా: (గాభరా పడిపోతుంది) చూడు, వాడితో అడ్డదొడ్డం మాట్లాడితే....వాడొక వేళ మళ్ళీ పారిపోతే –

నూరా: పోతే పోనీ వెధవను. వాడికి మన్ని గురించి ఏ మాత్రం ఆలోచన ఉన్నా. వాడిట్లా చేస్తాడా?

నీమా: (ఎక్కిరిస్తున్నట్లుగా) నాకు తెలియదా నీ సంగతి! వాడు ఇల్లొదిలి పారిపోయినప్పుడు నుంచున్నవాడివి నుంచున్న పళంగా పరిగెత్తలా? ఇంట్లో కూర్చోగలిగావా?

నూరా: ఈసారి చూస్తావుగా?

నీమా: వెళ్ళవూ? ఎట్లా వెళ్ళవో చూస్తా? వాడు లేకుండా నువ్వు....అమ్మపుట్టిల్లు మేనమామ దగ్గరా?

నూరా: మనషి తిన్నగా ఉంటే అనుకోవచ్చు. అయినా నీ పిచ్చిగానీ ఎంతైనా కన్నబిడ్డవుతాడా?

(కబీరు అలిసిపోయి వస్తాడు)

నీమా: వచ్చావా? రా! (కబీరువైపుగా అడుగేస్తుంది)

కబీరు: ఆ!

నీమా: ఇటురా, ఇక్కడ కూర్చో. నేనిప్పుడే గంజి తెస్తా (లోపలికి వెడుతుంది)

నూరా: మూడు తాన్లు అమ్ముడు పోయాయా? బజారు చాలా మందంగా ఉందని మన వాడొకడు చెప్పాడులే! వాడేం అమ్మలేకపోయాట్ట.

కబీరు: లేదు (గాభరాగా) ఏం? నేం పంపిన మూట ఎవ్వరూ తేలేదా?

నూరా: మూట నువ్వు తీసుకెళ్ళావు కదా?

కబీరు: లేదు. బజారులో కనిపించిన మనవాడికి ఇచ్చి పంపాను ఇంట్లో ఇమ్మని. ఇచ్చివంటాడనుకున్నాను.

నూరా: చాలా బాగా చేస్తావు వ్యాపారం. అమ్ముకురారా అమటే ఎవడికో ఇచ్చి వచ్చావా? ఎవడు వాడు.

కబీరు: మన బస్తీ వాడే తేలేదా?

నూరా: ఎక్కడిచ్చావు?

కబీరు: తెస్తాడయ్యా. బెంగపడక్కర్లేదు. షరాఫ్ బజారులో బన్‌వాలీ దుకాణం దగ్గర వుంటే ఇచ్చాను.

నూరా: నీకేం బెంగలేదులే. ఇహనుంచి నేనే వెడతా. అమ్ముకు రమ్మని చెప్పినందుకు బలే బుద్ధి చెప్పావు.

(కొంచెం ఆగి)

ఎవడికిచ్చావ్ కూడా తెలియదన్నమాట. కరహదన్ పట్టుకువచ్చాడు. తాను ఎవడికిచ్చావో కూడా గుర్తులేదన్నమాట. చచ్చిన చావుఅవుతోంది నీతో! (వెళ్ళిపోతాడు)

నీమా: (వస్తూ) రా! గంజితాగు!

కబీరు: నా కోసం ఎవరన్నా వచ్చారా అమ్మా! రైదాసు, పీపా, సీనా.....

నీమా: (విన్పించుకోనట్టుగా) ఎవ్వళ్ళతోనూ పెట్టుకోవద్దంటే వినవేరా? ఎవరి జోలికీ వెళ్ళకు ఇంకా!

కబీరు: ఏమయిందిప్పుడు?

నీమా: ఇవాళ బజారులో గొడవ పడ్డావుట!

కబీరు: (నవ్వుతాడు) ఏం లేదమ్మా. తాను అమ్ముదామని దుకాణానికి వెడితే అక్కడి సీర్‌ని నిద్రపోతుంటే బయటికి వచ్చా. ఇంతలో ఇద్దరు కసాయి వాళ్ళు ఆవుని తోలుకెడుతున్నారు. వెనక దూడ దీనంగా తల్లి వంక చూస్తూ వెడుతుంటే నాకు బాధ అనిపించింది.

నీమా: అయితే...?

కబీరు: నేను వాళ్ళని ఏమనలా! కాని నా నోటంట ఓ చరణం అనుకోకుండా వచ్చేసింది. దాన్నే చెప్పాను. అంతే.

నీమా: జనానికి కోపం తెప్పించే కవిత్వాలెందుకు చెప్పు. ఇంతకీ ఏం చెప్పావు?

కబీరు: అదా! అది – "రోజంతా ఉపవాసం ఉంటారు. సాయంకాలం అవుతూనే ఆవును చంపుతారు. ఇటువంటి హింసాత్మక పనులతో భగవంతుడు సంతోషిస్తాడా? పరప్రాణి జీవంకాదా? హింసిస్తు ఏ దేవుడు హర్షిస్తాడు" అన్నాను.

నీమా: ఇటువంటి కవిత్వం చెప్పాలంటే మసీదు ముందే చెప్పాలా?

కబీరు: అక్కడ చెప్పలేదమ్మా? చెప్పింతర్వాత అక్కడికి వెళ్ళాను. అయినా (నవ్వి) నన్నెవరో ఏదో అన్నారని నీకెవరు చెప్పారు?

నీమా: ఇవాళంటే ఇది. ఇహ రానురాను ఎక్కువైతే! అయినా మౌల్వీలని ప్రశ్నలడిగేంత వాడివా? వాళ్లక్కోపం వస్తుంది. మన తిండి గింజలు వాళ్లచేతిలో ఉన్నయ్యని మర్చిపోకు. చూస్తూ, చూస్తూ తల్లిదండ్రుల్ని పస్తులు పెడతావా?

కబీరు: నేనేమన్నాను అమ్మా?

నీమా: కాస్త వెనకా ముందూ ఆలోచించి మాట్లాడాలిరా. ఇది కాశీ. హిందువులకి పవిత్రమైన స్థలం. కొత్వాలేమో ముసల్మాను. ఏకోశానా దయాదాక్షిణ్యం లేనివాడని విన్నాను. సజీవ సమాధి చేస్తాడు. అందరిలో నువ్వు విరోధం పెట్టుకుంటే బతికేదెట్టాగురా?

కబీరు: (లేచి నుంచుంటాడు) చూడమ్మా నేనో మాట అడగనా?

నీమా: ఏంటది?

కబీరు: నిజంచెబూవా?

నీమా: పొదుపు కథల్లాగా ఏంటది?

కబీరు: నా మీద ఒట్టేసి నిజం చెప్పాలి.

నీమా: చెప్పగలిగిందయితే చెపుతాను. నే ఒట్టెయ్యను. ఏమడగాలనుకుంటున్నావో అడుగు.

కబీరు: నేను బయటనుంచి వచ్చేసరికి నాయన ఏమంటున్నాడు.

నీమా: ఏమనలేదే?

కబీరు: ఎంతయినా మనవాడు అవుతాడా అని అంటున్నాడే! ఎవర్నిగురించి?

నీమా: (గాభరా పడుతుంది) ఏం లేదు. ఏం లేదే! ఏదో బజారు వాళ్ళని గురించి – రోజులు ఎవర్నీ నమ్మేట్టుగా లేవుగా!

కబీరు: ఇది వరకోసారి విన్నాను. నువ్వు వీడిని తీసుకురాకపోతే మళ్లీ పెళ్ళి చేసుకునేవాణ్ణి అని మనం పామును పెంచుతున్నాం అని అన్నాడు. నాయన ఏ ఉద్దేశ్యంతో అన్నాడు ఇట్లా.

నీమా: ఏం లేదే!

కబీరు: నిజాన్ని కప్పెట్టకు. (తల్లికి దగ్గరగా వచ్చి) నువ్వు నన్ను ఎక్కడినించో తెచ్చావు. నేను మీ కొడుకును కాదు కదా!

నీమా: (ఓ క్షణం తర్వాత) నువ్వు నా ప్రాణానివి. అంతకు మించి నేనేం చెప్పలేను. ఇంకేమన్నా అడిగావంటేనా?

కబీరు: నిజం చెప్పు అమ్మా, వాళ్ళెవరు?

నీమా: ఎవరు?

కబీరు: నా కన్న తల్లీ – తండ్రి

నీమా: అట్లా అనడానికి నీకు సిగ్గెయ్యడంలా. నిన్నేమన్నా సవితి కొడుకల్లే పెంచానా? నీకు పెట్టిగాని నేను తినలేదే.

కబీరు: నేనట్లా అనడం లేదు గాని....

నీమా: ఎవరి ఒళ్ళో పెరిగి పెద్దవాడయ్యావో ఆమే నీ తల్లి.

కబీరు: కాదనడం లేదు. నాక్కావలసిందల్లా నన్నే కన్నవాళ్ళు ఎవరో అని.

నీమా: (ఏడుస్తుంది) నిజంగా నువ్వు పరాయివాడివేననిపిస్తోంది. లేకపోతే తల్లితో ఇట్లాగేనా మాట్లాడేది.

కబీరు: (తల్లిని కావలించుకుంటాడు) కోపం వచ్చిందా అమ్మా!

నీమా: అయితే మాత్రం నీకేరా? అయినా నిన్ను నా ఒళ్ళో పడేసిపోయింది. నాకంతకంటే ఏం కావాలనుకున్నాను కాని.....

కబీరు: అదీ సంగతి. నిజం నీ అంతట నువ్వే చెప్పావు చూశావా? నేననుకున్నది అవునన్నమాట.

నీమా: (కళ్ళు తుడుచుకుని కబీరుని చూసి నవ్వి తల నిమురుతుంది)

కబీరు: ఇప్పుడు చెప్పు ఆవిడ ఎవరో?

నీమా: మళ్ళీ అదేమాట?

కబీరు: చెప్పమ్మా, తెలియకపోతే అది వేరే సంగతి, ఇప్పుడు తెలిసింది కదా!

నీమా: (క్షణమాగి) ఎవరో దురదృష్టవంతురాలు.

కబీరు: నీకంటే ఎవరైనా దురదృష్టవంతులుంటారా అమ్మా.

నీమా: ఏమిటా వాగుడు. తండ్రీ, కొడుకులకి నోటికెంత వస్తే అంత.

కబీరు: నీకావిడ తెలుసా?

నీమా: నువ్విట్లా తరచి తరచి అడగడం నాకు నచ్చలా. నువ్వే నా సర్వస్వమని చెప్పానా?

కబీరు: సరే నేనింక ఎప్పుడూ అడగను. ఈ ఒక్కసారికీ చెప్పెయి. నన్నెందుకు నీ ఒళ్ళో పడేసి పోయింది? లేకపోలే నువ్వెక్కడనుంచన్నా తెచ్చావా? అదీకాకపోతే ఏ పెంటకుప్పమీదనో పడివుంటే నాయన నన్ను తెచ్చాడా? నేను నీ దగ్గరకి వచ్చేసరికి నా వయసెంత?

నీమా: (కళ్ళు తుడుచుకుంటూ) నువ్వేనాడన్నా ఈ ప్రశ్న అడుగుతావని అనుకున్నానా? పుడుతూనే నా ఒళ్ళోకి వచ్చావు.

కబీరు: కనిపారేసిందా? ఎవరావిడ ఎప్పుడైనా మళ్ళీ నిన్ను కలిసిందా? (నీమా ఊరుకుండడం చూసి) చెప్పవు కదూ?

నీమా: నువ్వు నాకు దొరికిన రోజున నేను పెళ్ళికూతురుగా నీ తండ్రి ఇంటికి పల్లకిలో వస్తున్నా. గంగ దాటి సాలెవాళ్ళ పల్లెవైపుకు వెడుతున్నాం. నీళ్ళుతాగుదామని ఒక్కసారి దిగి నీళ్ళ వైపుకు వెళ్ళాను. నువ్వు అక్కడ పడి వున్నావు. నీ తల్లి ఇచ్చిన పాల తడి ఆరనే లేదు. నిన్నే తదేకంగా చూస్తున్న నన్ను మీ నాన్నచూశాడు. పెళ్ళయిన రోజే నా కడుపు పండిందనుకున్నాను.

కబీరు: నే ఛస్తాగదా అని ఆవిడ పారేసిపోతే మీరు నన్ను బ్రతికించారన్నమాట.

నీమా: చాలా అసహాయ స్థితిలో ఉండవచ్చురా. లేకపోతే చూస్తూ చూస్తూ ఎవరు అలా కన్నబిడ్డని పడేసి పోతారు.

కబీరు: నీకావిడ తెలుసా? ఎప్పుడన్నా చూశావా?

నీమా: కన్పించింది. నిన్ను నేనె తెచ్చుకున్నానని తెలసి వచ్చింది. ఓ ఇంటి చుట్టూ తిరిగేది, దొంగతనంగా కిటికీలోంచి తొంగి చూసేది. చాలాసార్లు ఇలా చేసేది. అది గమనించి నేను ఓ రోజు నిలేసి అడిగితే తెలిసింది. ఆవిడ మీ తల్లేనని.

కబీరు: ఎవరావిడ.

నీమా: బ్రాహ్మణి. విధవరాలు.

కబీరు: విధవారాలా?

నీమా: దురదృష్టవంతురాలు.

కబీరు: అయితే నేను గొప్ప కులస్థులవాణ్ణన్నమాట. (నవ్వి) విధవరాలికి పుట్టిన నీచుణ్ణన్నమాట. నేనేం అల్లాటప్పాలాంటి వాణ్ణికాదు. (కాస్తలగి) ఆవిడెక్కడుంటుందో చెప్పుతావా?

నీమా: ఎవరు?

కబీరు: అదే....నన్ను....కని....పారేసినావిడ.

నీమా: ఆవిడ్ని చూడక చాలా ఏళ్ళాయే. అయినా ఊరికే అడిగిందే అడుగుతావే. నాకేం తెలియదంటే

వినవు.

కబీరు: (ఏదో ఆలోచన వచ్చి తల్లిని ఏదో అడగబోయి).....ఏం లేదులే.

నీమా: నీజాతేదో నీకు తెలిసింది కనుక ఆవిడ దగ్గరకి వెళ్ళాలనుకుంటూన్నావా? నీకావిడ కనిపిస్తే, వెళ్ళిపోయి అక్కడే ఉండరా! మేము తక్కువ జాతి వాళ్ళంగా!

కబీరు: నన్ను ఇంటినుండి వెళ్ళకొట్టాలనుకుంటున్నావా అమ్మా! పెంచిన కొడుకుని ఎవరైనా వెళ్ళకొడతారా? (నవ్వి తల్లిని కావలించుకుంటాడు)

నీమా: నిన్ను ప్రేమగా పెంచుకుంది వెళ్ళకొట్టేందుకా కబీరా. నిన్ను చూసుకునే కదరా మేం బతికేది.

(కబీరు వీపు నిమరబోగా చేతికి తడి తగులుతుంది. చేతికి రక్తం అంటుకుంటుంది. చేతులు ఇవతలికి తీసుకుని)

ఇదేమిటి? ఏమిటీ రక్తం. నీ చొక్కా తడిగి ఉంది. నీ చొక్కాకి రక్తం ఎలా అయింది.

కబీరు: ఏం లేదమ్మా.

(నీమా వణికిపోతుంది.)

నీమా: ఎవరన్నా నిన్ను కొరడాతో కొట్లారా.

కబీరు: ఏం లేదులే. అసలు నేనాసంగతే మర్చిపోయాను.

(నీమా పరుగులాంటి నడకతో లోపలికి వెళ్ళి నూనె పసుపు కలిపి తెస్తుంది.

నీమా: ఏదీ ఆ చొక్కా విప్పెయ్యి. (కబీరు చొక్కా విప్పగానే వీపు మీద నూనె రాస్తుంది) చేతుల్లో శక్తి ఉన్న మనుషులకి హృదయంలో దయ ఉండదురా. నువ్వొక చోట ఉండవాయే. నా మనస్సెంత బాధపడుతుందో. నీ స్థితి ఏమిటో తెలుసుకుని మసలుకోవాలి. ఎవరాన్న ఏమన్నా అనుకున్నా వినీ విననట్టు ఊరుకోవాలిరా! ఎదురు చెప్పేంత బతుకులా మనవి.....ఏం బాగా నెప్పిగా ఉందా?

కబీరు: ఏం లేదులేవే! ఊరికే ప్రతిదానికీ బాధపడిపోతావు. మర్చిపోయానని చెబితే వినవు.

నీమా: లే పద. పడుకుందువుగాని. మంచమేస్తా రా!

(నీమా మంచం వాల్చగానే కబీరు వెళ్ళిపడుకుంటాడు)

కబీరు: నా మనస్సునిండా ప్రశ్నలే! అయినా ఎవ్వరినీ అడక్కూడదా? మనస్సులో అల్లిబిల్లిగా ఉన్న ఈ ప్రశ్నల్ని అలాగే అణచెయ్యాలా?

నీమా: పెద్ద పెద్ద ముల్లా- మౌల్వీలు, శాస్తుర్లు, పండితులకి అర్థంకాని ప్రశ్నలెన్నో ఉంటాయి. నువ్వేమన్నా చదివావా పెట్టావా? నీ పనేదో నువ్వు చూసుకోక, ఆ ప్రశ్నల సంగతెందుకు అంట.

కబీరు: నువ్వు చెప్పేది బాగానే ఉందికాని. సమాధానం దొరకని ప్రశ్నలతో మనస్సుకి విశ్రాంతి అనేది లేకుండా పోతుంది.

నీమా: అయితే నీవీపంతా జల్లెడలా చిల్లులు పడాల్సిందే. అయినా ఏ కసాయి వాడ్రా నిన్ను కొట్టింది.

కబీరు: దెబ్బలు తిని తిని వీపుగట్టి పడ్డదిలే! ఇప్పుడేమంత కష్టమనిపించట్లా.

నీమా: ఇదిగో చూడు. ఎవరన్నా నీ జాతి మతాల గురించి అడిగితే నేను బ్రాహ్మణకుర్రాణ్ణని నిర్భయంగా చెప్పు. తెలిసిందా! అది నిజమే కాని అబద్ధం ఏం కాదుగా!

కబీరు: (నవ్వి) హిందువులెవరన్నా అడిగితే బ్రాహ్మణి కొడుకునని, ముసల్మానులడిగితే ముస్లిం నీమా

కొడుకునని చెప్పనా? అంతేగా నువ్వు చెప్పేది. అట్లా చెబితే ఎవ్వరూ కొరడా దెబ్బలు కొట్టరు. అదేగా నీకు కావాల్సింది.

నీమా: అట్లా అంటే నేనేం చెప్పేది రా! నువ్వు మాత్రం ఇద్దరితోను విరోధం కొనితెచ్చుకుంటున్నావు. (కాస్త ఆగి) ఓ మాట చెప్పనా!

కబీరు: ఏమిటమ్మా అది.

నీమా: నువ్విక్కణ్ణుంచి వెళ్ళినా సరే! వెళ్ళి వేరే ఉండుపో. మేమేం బెంగ పెట్టుకోంలే. నువ్వు మాత్రం ఎవ్వరితోను దెబ్బలు తినకుండా ఉంటే చాలు.

కబీరు: (నవ్వి) అడవుల్లోకెళ్లిపోనా.

నీమా: అడవుల్లోకెందుకురా. ఏదన్నా పట్నం పొమ్మంటే.

కబీరు: అక్కడ మాత్రం హిందువులు, ముసల్మానులు ఉండరనా అమ్మా!

నీమా: ఇది యాత్రా స్థలం. ధర్మానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారిక్కడ. నువ్వు చెప్పేమాటలా నచ్చవు ఇక్కడి వాళ్ళకి. అడుగడుగునా గుళ్ళు-మసీదులాయే!

కబీరు: నువ్వు కావాలని ఇంటినుంచి నన్ను తరిమేస్తున్నావ్ అమ్మ!

నీమా: తరమటం కాదురా! వేరే చోటన్నా సుఖంగా ఉంటావని. ఇక్కడి నించి పోతే దెబ్బలు తినక్కరలేదుగా! నీ బతుకు నువ్వు బతకొచ్చు. పెళ్ళిచేసుకుని పెళ్ళాన్ని తీసుకుపో నిన్ను చూడాలనిపించినప్పుడు మేమే వస్తాం.

కబీరు: (నవ్వి) అక్కడికెడితే మాత్రం మనస్సులోకి ప్రశ్నలేం రావా?

నీమా: నీ మంచికోసమే చెపుతాన్నా. నీ పనేదో నువ్వు చేసుకుపో. బట్టలు నెయ్యి. పెళ్లిచేసుకో. వాళ్ళలో-వీళ్ళలో మాటలెందుకు పడాలి అంటున్నా.

కబీరు: బట్టలు ఇప్పుడు నెయ్యడం లేదా?

నీమా: సరే! నీ పని నువ్వు చేసుకుంటుంటే నీతో ఎవ్వరు పోట్లాడుతారు. మీ నాన్న తన పనేదో తను చేసుకుపోతాడు గనకే ఆయన జోలికి ఎవరూ రారు.

కబీరు: నేనెవర్ని ఏమంటున్నాను.

నీమా: ప్రతీదీ నీకే కావాలి. అన్నింటిలో చిక్కుకుంటావు. పండితులు చెపితే నోరుమూసుకుంటారు గాని నువ్వు చెబితే ఎవరు వింటార్రా? నువ్వు ఏదో ఒకటి చెప్పగానే వాళ్ళకి కోపం.

కబీరు: నువ్వు చెప్పేది నిజమే అనుకో!

(నూరా బయటినుంచి వస్తున్న చప్పుడు. నీమా లేచి నుంచుంటుంది)

నీమా: నే పోతున్నా. మీ నాన్నొచ్చాడు. ఆయనేమన్నా అంటే అలగకు. ఏం చెప్పినా నీ మంచికోరేగా!

(నీమా వెళ్ళిపోతుంది. కబీరు గోడవారగా ఎటో చూస్తూ నుంచుంటాడు)

కబీరు: చీకటి పడుతోంది. ఇంకో రోజు అయిపోయిందన్నమాట. నేనేదో ప్రజల్ని అవిశ్రాంతుల్ని చేస్తున్నాననుకుంటుంది అమ్మ. అమ్మ నా వీపు మీద పడ్డ దెబ్బలైతే గమనించగలిగింది కాని నేనెంత మథన పడుతున్నానో - ఆమేకాదు - ఎవరూ తెలుసుకోలేరు. అందరి దృష్టిలో నేనో ఆవారాగాణ్ణి, తిరుగుబోతుని. అందరితో వాదులాడేవాడ్ని. ఈ నా అన్వేషణకు అంతమెప్పుడో

ప్రభూ! మళ్లీ అడవికిపోతే! నాక్కావల్సింది శాంతి కాదు. ఈ చీకట్లో చిరువెలుగు. మనం చూస్తున్నదంతా అబద్దమైతే మరి నిజమేమిటి? ఇదే ప్రశ్న నన్ను తినేస్తుంది. నేను కూడా నీవాడినేగా ప్రభూ! మరి నా స్థానమేది?

రాయిరప్పలెన్ని చూసినా
కనుపోవునట్టు ఏడ్చినా
లేశమాత్రమైన
నీ ఉనికిని చూడలేకపోయానే
రోజులెన్ని గడిచినా కనుగొనలేకపోయానే
జగం సుఖం – నిద్ర సుఖం
కాని నాకు మాత్రం
సుఖం లేదు – నిద్ర రాదు
మిగిలింది దుఃఖం.

(దూరంనుంచి గుడిగంటలు వినిపిస్తాయి. మసీదులో నమాజు చేస్తున్న ధ్వని)

**(తెర)**

# రెండవ దృశ్యం

(స్టేజ్‌కి ఎడంపక్కన కొత్వాలు కూర్చునే 12 దర్వాజాలు కల గదిలోని కొంత భాగం. కాశీలో ఉండే ఒకతనితో కొత్వాలు మాట్లాడుతూ వుంటాడు. ఎదురుగా రాజమార్గం కన్పిస్తూంటుంది. జనం అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. వెనక కాశీలో ఉండే గుళ్లు కన్పిస్తూ వుంటాయి. దూరంగా ఉన్న గుడి నుంచి శివ మహిమ స్తోత్రం వినిపిస్తూ వుంటుంది.)

కొత్వాలు: మఠంనుంచి మఠాదీశుడు కాశీ వచ్చాడనా?

కాయిస్థీ: వచ్చారు దొరా! మేళతాళాలతో వస్తోంది ఆయన సవారీ. కాశీ పురానికి ఇప్పుడే వేంచేశారు.

కొత్వా: చాలా విద్వత్తు ఉన్న ఆయన అని పేరు. ఎక్కడ్నించి వచ్చాడో?

కాయి: ఈయన మఠం అయితే కురుక్షేత్రంలో ఉంది. అక్కడినుంచే ఏడాదికోసారి కాశీ కొస్తాడనుకుంటా.

కొత్వా: ఊరంతా అలంకరించార్త....! (కాస్త ఆగి) ఈయనే మతంట?

కాయి: ఆ లెక్కకొస్తే అందరూ హిందువులే దొరా! కాని దాన్లో కూడా చాలా భేదాలు, ఎన్నో సంప్రదాయాలు... మీకెలా చెప్పాలి....ఆ! ఈయన శివుణ్ణి పూజిస్తాడు. శైవమతావలంబి.

కొత్వా: మీకు ఎన్నో మతాలు, గుళ్ళూ, గోపురాలును. జాతి, మత భేదాలు. మాకు ఇవ్వేవి తెలియవు.

కాయి: చాలా ఉన్నయి. ఒక్క బ్రాహ్మణుల్లోనే 108 భేదాలున్నాయి. ఒక్కొక్క శాఖ-ఉపశాఖ. అబ్బో! చాలా ఉన్నయి లెండి.

కొత్వా: వీటి లెక్కాడొక్కా ఎవరు చూస్తారు? (నవ్వి) మేమిక్కడకి వచ్చి నెలైంది. వీటిల్లో దేన్ని గురించి తెలుసుకోలేకపోయాం.

కాయి: మీరడగండి – నే చెబుతాను.

(ఎదురుగా ఓ సాధువు వెడుతూ కన్పిస్తాడు. నుదుటి మీద తెల్లని నామం ఉంది)

కొత్వా: ఈ సాధువు తెల్లరంగు బొట్టు పెట్టాడు కదా! మరికొంతమంది ఎరుపు – ఇంకా కొంతమంది ఎరుపు-తెలుపు రెండూ కలిసి పెట్టుకుంటారు. దీనర్థం ఏమిటి?

కాయి: తెల్లబొట్టు వాళ్లు వైష్ణవులు. ఎర్రబొట్టు వాళ్ళు దేవీ ఉపాసకులు. వాళ్ళని శాక్తేయులంటారు.

కొత్వా: కాని కొంతమంది పొడవుగాను, ఇంకొంతమంది అడ్డంగాను. మధ్యలో కుంకుమ బొట్టు పెట్టుకుంటారేం?

కాయి: అడ్డంగా మూడు రేఖలుండి మధ్యన కుంకుమ పెట్టుకునే వాళ్ళు శైవులు.

కొత్వా: కొంతమంది ఒకటి, రెండు, మూడు రేఖలు పెట్టుకుంటారు. మరి వాళ్ళో?

కాయి: ఒక్క రేఖ పెట్టుకునే వాళ్ళు బ్రహ్మమొక్కటే అని నమ్మేవాళ్ళు. రెండు పెట్టుకునే వాళ్ళు జీవాత్మా -పరమాత్మని నమ్మేవాళ్ళు. మూడు రేఖల వాళ్లు బ్రహ్మము, జీవుడు, ప్రకృతి ఈ మూడింటిని నమ్మేవాళ్ళు.

కొత్వా: బొట్టు పెట్టుకోనివారు, నామం పెట్టుకోని వారు వుంటారా?

కాయి: బ్రాహ్మణుల్లో అయితే అట్లా పెట్టుకోని వారిని ఛండాలునితో పోలుస్తారు.

కొత్వా: అంటే మేం ఛండాలురమన్నమాట.

కాయి: మీరు కొత్వాలు కదా ప్రభూ! నేను బ్రాహ్మణుల మాట చెపుతున్నాను.

కొత్వా: అయినా ఛండాలురమనే అనొచ్చు. (నవ్వు) మ్లేచ్ఛులు కూడా మనల్ని అలాగే అంటారు.

కాయి: శక్తి యుక్తులున్నవారి జాతి-మతాల గురించి ఎవరూ పట్టించుకోరు. వాళ్ళ పేరు ప్రతిష్టలే జనానికి ముఖ్యం. అయినా మీరు కొత్వాలాయే.

కొత్వా: ఈ నామం ఎలా తయారు చేస్తారు?

కాయి: దాన్ని తిలకం అంటారు ప్రభూ! వైష్ణవులు చందనంతోనూ, శైవులు విభూతితోను పెట్టుకుంటారు.

కొత్వా: విభూతి అంటే?

కాయి: యజ్ఞంలో హోమం చేయగా వచ్చిన బూడిద. తిలకం పసుపు, కుంకుమ కలపగా వచ్చే పదార్థం. ఒక్కొక్కప్పుడు చనిపోయిన శవం బూడిద నుంచి కూడా తయారు చేస్తారు.

కొత్వా: మరి ఎర్రనిబొట్టు.

కాయి: పారాణితో కాని, రక్తంతో కాని పెట్టుకుంటారు.

(దూరం నుంచి శంఖం పూరించిన ధ్వని. నగారాల తప్పళ్ళు నెమ్మదిగా వినిపిస్తూ వుంటాయి.)

సవారి వచ్చేసినట్టుంది. ఇంకొంచెం సేపట్లో ఇటుగా వస్తుంది.

(రాను రాను మఠాధిపతి వస్తున్నట్టుగా మేళతాళాల చప్పళ్ళు ఎక్కువవుతాయి. ప్రజలంతా శ్రద్ధగా అటు ఇటుగా నుంచుని ఉంటారు. స్టేజిమీద ఓ పక్కగా శ్రద్ధగా భక్తులు వలయాకారంగా ఉంటారు)

కాయి: సవారీ రానే వచ్చేసింది. కొత్త మఠానికి పునాది వేయడానికి పెద్దగుళ్ళో విగ్రహ ప్రతిష్ట చేయడానికి వచ్చినట్టున్నారు స్వాములవారు.

కొత్వా: గుళ్ళో ప్రతిష్టించే విగ్రహాలని ముసల్మానులు చెక్కుతారని విన్నాను!

కాయి: ఆ మాట నిజమే కాని విగ్రహాలని ప్రతిష్టించే ముందు గంగాజలంతో శుభ్రంగా కడుగుతారు. అలా పవిత్రమైన విగ్రహాలను ప్రాణ-ప్రతిష్ట చేస్తారు. ప్రాణ-ప్రతిష్ట తర్వాత విగ్రహం దేవతామూర్తిగా మారుతుంది. అంతకమునుపు అదీ రాయే!

(స్వాములవారు వస్తూ వున్నదిక్కుగా ఇద్దరు ముగ్గురు స్త్రీలు తలలు వంచి నమస్కారాలు చేస్తారు. ఇంతలో ఒక జటాధారి అయిన సాధువు చేతొలో కొరడా పట్టుకుని వస్తాడు)

కొత్వా: ఇదెందుకు?

కాయి: దోవలో అంటరాని వాళ్ళెవరన్నా కనిపిస్తే ఝుళిపించడానికి – స్వాముల వారు వస్తున్న దరిదాపుల్లో వాళ్ళ నీడకూడా పడకూడదని!

(సాధువు గాలిలోకి కొరడా ఝుళిపిస్తూ వెడుతూ వుంటాడు. వెనక ఇద్దరు సేవకులు ప్రవేశం. వాళ్లు రోడ్లు ఊడుస్తూ వెడుతూ వుంటారు. భజనలు, పాటలు, నగారాల ధ్వని అంతకంతకు ఎక్కువ అవుతుంది. ఓ పెద్ద వెండి పాత్ర పుచ్చుకుని ఇంకో సాధువు ప్రవేశం. దాన్లో నుంచి నీళ్ళు కాబోలు తీసి ఇటు అటూ జల్లుతూ వస్తాడు. మంత్రాలు చదువుతూ వెళ్ళిపోతాడు)

కొత్వా: ఎన్ని నీళ్లని ఇట్టా జల్లుకుంటూ పోతాడు?

కాయి: ఎన్నో అక్కర్లేదు. పవిత్ర గంగాజలం కదా ఓ బొట్టు జల్లినా చాలు!

కొత్వా: ఇహ మనం ఇక్కడ ఉండొద్దు.

కాయి: మీరు వాళ్ళకి కన్పించరు ప్రభూ!

కొత్వా: అందుక్కాదు. అసలు ఇక్కడ ఉండకూడదు. ఉంటే ఎవళ్ళతోనన్నా జగడం వస్తుందని కాదు.

కాయి: వచ్చినా రావచ్చునండీ. ఈ మఠం వాళ్ళకి వచ్చేవాళ్లతో పూర్వపు విరోధాలేవో ఉన్నాయి. పోయిన సారయితే తుపాకులు కాల్చాల్సొచ్చింది.

కొత్వా: అలాంటి వేమన్నా వుంటే చెప్పు.

(బల్లీలు, కత్తులు పట్టుకుని శిష్యుల ప్రవేశం. నెమ్మదిగా ముందుకు జరిగిపోతుంటారు. ఆ తర్వాత భజనలు, పాటలు, తప్పెళ్ళతో స్త్రీ, పురుషులు వస్తారు. చిత్ర విచిత్రమైన వస్త్రధారణ, చిడతలు వాయిస్తూ ముందుకు పోతుంటారు. వెనకగా ఆరుగురు సాధువులు మోస్తున్న వెండి పల్లకి, గొడుగులతో మెరిసిపోతూ వస్తుంది. దాన్లో ఉల్లిరంగు బట్టలతో, లావుపాటి స్వాములవారు, జాటాజూటధారియై, త్రిపుండకం పెట్టుకువస్తారు. పెద్దబొజ్జ, మెళ్ళోమాలలు, కళ్ళల్లో నన్ను మించిన వాడు లేడన్న విశ్వాసం కొట్టొచ్చినట్టు కన్పించే స్వాములవారు భక్తజనం చుట్టిముట్టి రాగా, స్త్రీలు వింజామర వీస్తుండగా, పల్లకి నెమ్మదిగా వస్తుంది. సరిగ్గా స్టేజి మధ్యలోకి రాగానే పల్లకి ఆగిపోతుంది. స్వాములవారు నోట్లోకి వెండి పాత్రలోని నీళ్ళు తీసుకుని పుక్కిలించి ఎదురుగా, చూడవచ్చిన వారికి దగ్గరగా ఉమ్మేస్తాడు. ఆ ఉమ్మితో తడిసిన నేలభాగాన్ని వేలితో తీసి బొట్టుపెట్టుకునేందుకు అందరూ కోలాహలంగా తోసుకుంటారు. అలా చేసేవాళ్ళల్లో ఎక్కువమంది స్త్రీలే. ఒక సాధువు స్వాముల వారి పాదాలు ఎత్తి పట్టగానే అందరూ పాదాభివందనం కోసం ఎగబడతారు. ఆయన కాళ్లు కడగగా వచ్చిన నీళ్ళని తాగడానికి దోసిలి పడతారు అందరూ ఆత్రంగా. నెత్తిమీద జల్లు కుంటారు. స్వాములవారి మీద పూవుల వాన కురిపిస్తూండగా యాత్ర మళ్లీ మొదలవుతుంది.)

మొదటి పౌరుడు: (పక్కవాడితో) ఇక్కడికంటే వెండి పల్లకిలో వచ్చారుకానీ కుంభోత్సవం జరిగేటప్పుడు బంగారు పల్లకీలో వస్తారు తెలుసా!

రెం.పౌ: తినడం కూడా బంగారు పళ్ళెంలోనేట. పూజార్చనలు కూడా బంగారు పాత్రలతోనే చేస్తార్ట. మఠంలో పదిమేనువందల ఏనుగులున్నాయిట.

మొ.పౌ: ఆయన కళ్ళల్లో వెలుగు చూశావా? మొహం బ్రహ్మ తేజస్సుతో వెలిగిపోతుంది.

రెం.పౌ: ఎవళ్ళనన్నా గుర్రుగా చూశాడంటే మాడి మసైపోవాల్సిందే! ముల్లోకాల గురించి, మూడు కాలాల గురించి ఈయనకి బాగా తెలుసు.

మూ.పౌ: ఒకసారి ఆయన సింహాసనం మీద ఎవరిదో అంటరాని వాడి నీడ పడిందట. ఎవరువారు అని గద్దించగానే వాడు పారిపోబోయాడుట. అప్పుడు వాడివంక ఈయన తీక్షణంగా చూసేసరికి భస్మమైపోయాట్ట.

రెం.పౌ: సర్వశక్తి సంపన్నులు. ఏమైనా చేస్తారు.

మూ.పౌ: నిజంగా చాలా మహాత్ములు. ఈయనకి తెలియంది లేదు. మొదటి స్వాములవారు పరమ పదించగానే తర్వాత ఎవరూ? అన్న ప్రశ్న వచ్చింది, కొట్లాటలు కూడా అయ్యాయి దాన్ని గురించి. ఎందుకంటే ఓ బ్రహ్మజ్ఞాని, ఓ దివ్యజ్ఞాని, ఓ యోగిపుంగవుడు ముగ్గురున్నారు. ముగ్గురి మధ్యలో పోటీవచ్చింది. మిగతా వాళ్ళిద్దర్నీ ఓడించి ఈయన తన దివ్యశక్తులతో ఈ పీఠాన్ని అధిష్టించారు. ఆ యిద్దరిలో

ఒకాయన చనిపోయాడు. మరో ఆయన అడవుల్లోకి పోయాడు. తపస్సు చేసుకొస్తాన్నట్ట. ఇంతవరకూ అదుపూ, అనవాలూ లేదు.

మొ.పౌ: వందలాది స్త్రీలతో సంబంధం ఉండికూడా అస్ఖలిత బ్రహ్మచారిగా ఉన్నాడంటే.....

మూ.పౌ: నాయనా వీర్యంతోనే దివ్యజ్యోతి ప్రాప్తి. నలభై గ్రాసాల భోజనంతో ఒక రక్త బిందువు తయారు అవుతుంది. నలభై రక్తబిందువులతో ప్రవాహం. అటువంటి నలభై ప్రవాహాలతో వీర్యం తయారవుతుంది. చూశావా మానవుడి వీర్యం తయారవాలంటే ఎంత లెక్కో.

రెం.పౌ: కత్రపుచ్చుకున్న సాధువును చూశావా? బల్లేలు, కత్తులూ కూడా తెచ్చారు. పోట్లాటలు ఏమన్నా అవుతాయనేమన్నా అంటావా?

మూ.పౌ: ఏమో! వేరే మతం వాళ్ళు కూడా చాలామంది సాధువులు బయటికొచ్చారు.

మొ.పౌ: నేను శంఖారావ, తూర్యనాదాలు అవీ విని ఎవరో వ్యాపారస్థులు వచ్చారనుకున్నాను.

రె.పౌ: ఇదేం అంతకంటే తీసిపోలేదులే! పోయిన సారి నీకు గుర్తుందా? తుపాకీలు కూడా పేల్చాల్సొచ్చింది. అయిదు రోజులు రెండు మతాల మధ్య యుద్ధం జరగలా!

(నేపథ్యంలో గోలగా ఉంటుంది)

మొ.పౌ: ఏమిటీగోల – మళ్ళీ పోట్లాట కాదు కదా?

(వెనకనుంచి "ఒదలండి ఇతన్ని. ఈ అమాయకుణ్ణెందుకు కొడతారు.", "నువ్వెవరు మధ్యలో కలగచేసుకోడానికి", "ఒదలండి ఈ పిల్లవాడ్ని" – అన్న మాటలు వినిపిస్తాయి.) (కబీరు వస్తాడు. చేతిలో ఓ చిన్నపిల్లవాడు ఉన్నాడు.)

కబీరు: చంపేస్తారో ఏమో వీడ్ని!

రె.పౌ: అరె కబీరు నువ్వా? (ఇంతలో ఓ సాధువు కొరడా తీసుకుని ఇద్దరు పండాలతో వస్తాడు)

సాధు: నువ్వెడివిరా మధ్యలో?

కబీరు: మేం ఎవరైతే ఏంలే. కాని ఈ చిన్నపిల్లవాడ్ని కొరడాతో కొట్టనివ్వం. (పిల్లవాడితో) నువ్వెళ్ళిపోరా. పో...పారిపో (పిల్లవాడు వెళ్ళిపోతాడు)

మొ.పౌ: వదిలెయ్యరా కబీర్. నీకెందుకు మధ్యలో. వీడితో (సాధువుతో) ఎందుకు పెట్టుకుంటావు?

రె.పౌ: (మధ్యలో కలగచేసుకుని) ఆ పదండయ్య. ఎందుకొచ్చిన పోట్లాటలుగానీ పదండి, పదండి.

సాధు: మాదే మతమో తెలుసుకునే మాట్లాడుతున్నావా? మిమ్మల్ని ఇక్కడే పాతిపెట్టినా అడిగేవాడెవ్వడూ లేదు.

కబీరు: అంత వీరుడవైతే, సాదువ్వికూడానూ – పిల్లాడి మీదా నీ ప్రతాపం.

(పండాలు వెనకగా వచ్చి కబీరుని పట్టుకుంటారు)

సాధు: పట్టుకోండి వెధవని. చర్మ వలిస్తేగాని దిగిరాడు.

మొ.పౌ: వాడే చేశాడు? వదిలెయ్యండి కబీరుని. (కబీరుని తన్నుకుంటూ తీసుకెడతారు. వెనక గోలగా ఉంటుంది) కొట్లాటలు, ఘర్షణలు జరుగుతయ్యని చెప్పానా, లేదా?

మూ.పౌ: రెండో మతం వాళ్ళు కూడా తగిన జాగ్రత్తలోనే ఉన్నారు. బల్లేలు అవీ పెట్టుక్కూర్చున్నారు.

మొ.పౌ: ఇక్కడ కొత్త మతాన్ని రానివ్వరు చూస్తుండు.

(ఫిరంగులు మోగిన చప్పుడు. వెనకనుంచి ఇద్దరు జటాధారులు పరిగెత్తుకుంటూ వస్తారు స్టేజిమీదకి. వెనకకి రాళ్ళు విసురుకుంటారు..నీ....నీ......దూరంగా శైవ మఠం నుంచి శివతాండవం మంద్ర స్థాయిలోను, ఒక్కొక్కప్పుడు బిగ్గరగానూ విన్పిస్తుంది.

**(తెర)**

# మూడవ దృశ్యం

(కొత్వాలు కొలువు. ఇద్దరు ముగ్గురు కూర్చుని వుంటారు. మఠాధిపతి కూడా అక్కడే వున్నాడు.)

మఠా: మీరు చాలా దయగా మేము చెప్పిందంతా విన్నందుకు చాలా కృతజ్ఞతలు.

కొత్వా: మీరు పెద్ద మఠానికి అధిపతి. మీకున్న పేరుప్రతిష్టలు విన్నాం. మాలాంటి బీదల దగ్గరకి మీరు రావడమే మాకు సంతోషం.

మఠా: మరో చిన్న ప్రార్థన.

కొత్వా: చెప్పండి.

మఠా: మఠం పేరున ఉన్న భూమి మాపేర మారిందనుకోండి. వెంటనే అక్కడ నిర్మాణం ప్రారంభించాలని–కాని మఠానికి తిన్నగా ఎదురుగా........

కొత్వా: చెప్పండి.

మఠా: సరిగ్గా ఎదురుగా అంటరానివాళ్ళ బస్తీ ఉంది. మీ వాళ్ళు ఈ తేడాని సహించరని మీకు తెలుసుగా!

కొత్వా: ఇంతకీ మీకేం కావాలి? వాళ్ళెవరో శూద్రులనేగా? (నవ్వుతాడు)

మఠా: శూద్రులే అనుకోండి. మాల–మాదిగ....

కొత్వా: వాళ్ళని అక్కడనుంచి పంపెయ్యాలని మీ ఉద్దేశ్యమా?

మఠా: “ఊ”..

కొత్వా: (చోబుదారుతో) శీఖ్‌సాహెబ్‌ని పిలు (చోబుదారు వెడతాడు)

మఠా: కాశీకి వచ్చిన దగ్గరనుంచి మీ దర్శనం చేసుకోవాలని సంకల్పం. (మఠాధిపతి కొత్వాల్ మనిషికి లంచం ఇవ్వబోతాడు) (శీఖ్ వస్తాడు)

కొత్వా: శేఖ్‌సాహెబ్ మఠాధిపతిగారి భూమికి ఎదురుగా ఉన్న భూమిలో ఎవరు ఉండేది?

శీఖ్: తెలుసు సాబ్. మాదిగలు. చాలా రోజులుగా ఇక్కడే ఉన్నారు. బెంగాల్లో అల్లర్లు చెలరేగినప్పుడు వీళ్ళంతా ఇక్కడిఇ వలస వచ్చారు.

కొత్వా: మహంతుగారు వచ్చేసరికి మనం ఏదో ఒకటి చెయ్యాలి దీన్ని గురించి.

శీఖ్: (గుసగుస లాడుతున్నట్లుగా) ఇందులో చాలా మంది నిరాశ్రయులమని, దరిద్రులమని చెప్పుకుంటున్నారు.

కొత్వా: (మహంతు వైపు తిరిగి) మీరు చెప్పిన దాన్ని గురించి ఆలోచించవల్సి వస్తోంది. మీరు కాశీ మహీరాజ్‌తో మాట్లాడారా?

మహం: ఆయన ఆజ్ఞాపించిన తర్వాతే నేను మీ వద్దకు రావడమైంది.

కొత్వా: సరే! మేము ఆలోచించి చెపుతాము. దీనిలోగల మంచి చెడులను గురించి ఆలోచించాక కాని ఏ సంగతి చెప్పలేము.

(మౌల్వీ వస్తాడు. కొంచెం కోపంగా ఉన్నాడు)

మౌల్వీ: సమస్కారం (ఆదాబ్‌అర్జ్)

కొత్వా: రండి, రండి మౌల్వీగారూ! చెప్పండి – మీరేదో అశాంతిగా ఉన్నట్లు అనిపిస్తోంది.

(మహంతుని పరిచయం చేస్తూ)

ఈయన కుర్చేటా మహంతు – ఈ మధ్యే కాశీవిచ్చేశారు. (మహంతుతో) మీరు వెళ్ళిరండి. మహంతుగారూ. మేము ఏ సంగతి ఆలోచించి చెపుతాము.

మహం: మరీమంచిది. మీరు చెప్పినట్లే కానివ్వండి. (వెళ్ళిపోతాడు)

మౌల్వీ: నాకంతా గందరగోళంగా ఉంది కొత్వాల్. దీపం కింద చీకటిలాగా పట్టణానికి కొత్వాలుగా ఉండి కూడా మీరు నిమ్మకు నీరెత్తినట్టున్నారు.

కొత్వా: ఏమిటి ఏమయింది మిమ్మల్ని ఎవరైరా అవమానించారా?

మౌల్వీ: నన్నుకాదు. నా మతాన్ని ఇవాళకాదు ఎప్పటినుంచో అదే కాదు ఇంకా –

కొత్వా: వివరంగా చెప్పండి.

మౌల్వీ: కబీరు, ఆడే – ఆ సాలెవాణ్ణి గురించి విన్నారా మీరు?

కొత్వా: ఏదో పదాలల్లుతూ, కవిత చెప్పుతూ తిరుగుతాడు వాడా? ఏం వాగుతున్నాడు....వాగనివ్వండి.

మౌల్వీ: వెదవన్నర వెధవ....మసీదు మెట్ల మీద కూర్చుని నోటికొచ్చినట్లు కూస్తున్నాడు. మీ పాలనలో ఇటువంటి విపత్తు జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటారా?

కొత్వా: ఏదో పిచ్చివాడు పోనిద్దురూ!

మౌల్వీ: పిచ్చివాడా–వాడా? మా మతాన్ని ఎగతాళి చేసే కాఫిల్. వాడి నోరు మూయించకపోతే ప్రజలు మిమ్మల్ని, వాడి పిచ్చితనానికి భయపడ్డవారిగా చిత్రీకరిస్తారు. మీరుండగానే వాడు మన ధర్మాన్ని నిందించడమా! అవమానించడమా? మీరు కేవలం ఢిల్లీ చక్రవర్తుల ప్రతినిధిగా, పాలనా ప్రతినిధిగా మాత్రమే కదా ధర్మాన్ని రక్షించాల్సిన కర్తవ్యం కూడా మీదే! అలా కిని పక్షంలో మీరు హిందువులు కనుక, పరధర్మాన్ని గురించి పట్టించుకోవడం లేదని అంతా నిందిస్తారు. ఆ కబీరు చెప్పే కవితల పాటలు ప్రజల నోళ్లల్లో నానయ్యంటే – వాడెక్కడుంటే అక్కడ ప్రజలు గుమిగూడతోంది. వాళ్ళమీద వీడి పాటలు ప్రభావం పడుతోంది.

కొత్వా: (అలాగా అన్నట్లు తల ఊపి చిరునవ్వు నవ్వి) మాకీ సంగతులేవీ తెలియవని మీ ఉద్దేశ్యమా? (నెమ్మదిగా) ధర్మాన్ని రక్షించే భారం మౌల్వీలు కంటే పాలకుల మీదే ఉందని తెలుసుకోండి. (మౌల్వీని పట్టించుకోనట్టుగా ఇంకెవరితోనో మాట్లాడుతూ ఉంటాడు కొత్వాలు) పాలకులెప్పుడూ ముందు వెనుక ఆలోచించి తాము చెయ్యవలసింది చేస్తారు.

ముసాహిబ్: చిత్తం.

కొత్వా: నేటి పధ్నాలు వందల సంవత్సరాలకు పూర్వం క్రైస్తవ మతం ప్రారంభింపబడి దాన్ని గురించి చాలా విస్తృతంగా ప్రచారం కూడా జరిగింది. దాన్ని ఎవరు వ్యాపింపచేశారో మీరు తెలుసా?

మౌల్వీ: మతమంటే ప్రాణమిచ్చే వాళ్ళు ఎన్నో త్యాగాలు చేస్తారు ఇట్లా. వాకిలి వదిలి దాని కోసం పాటు పడతారు. బహుశా అటువంటి వాళ్లే అయి ఉండాలి.

కొత్వా: తిరుగుతారు. ప్రచారం చేస్తారు. నిజమే! (నవ్వి) కాని మతమనేది వరి కోసమే అన్నట్లుగా ఉండే మాత్రం వృద్ధి చెందదు. వ్యాప్తి చెందదు. మతం పేరిట రాజ్యాలు, రాజ్యాల నీడన మతాలు

మనగలడం మనం చూస్తూనే ఉన్నాం. పాలకుల కత్తి మతాన్ని, ధర్మాన్ని రక్షించడం తన కర్తవ్యంగా భావిస్తుంది. అదీ సంగతి – తెలిసిందా. ఇదేం పనికి మాలిన మాటకాదు.

మౌల్వీ: చిత్తం.

కొత్వా: శ్రాసకుడికి, ధర్మగురువులకి ఇంకో తేడా ఉంది – చాలా పెద్ద తేడా.

మౌల్వీ: అదేమిటో సెలవిస్తారా?

కొత్వా: మౌల్వీలు మర్యాద గురించి మాట్లాడతారు. ఆ ప్రవాహంలో కొట్టుకుపోతారు. పాలించే వాడు తన బుద్ధి కుశలతను ఉపయోగిస్తాడు. తన మేధస్సులో పని చేస్తాడు.

ముసా: ఆ (ఊ కొట్టడం)

కొత్వా: పాలకుడు తన ప్రాణంకంటే ప్రియమైన వ్యక్తిని కూడా ఉరికంబం ఎక్కిస్తాడు. అప్సరసల్లాంటి అందగత్తె నయినా సజీవ సమాధి చేస్తాడు.

ముసా: ఆ...

కొత్వా: అట్లా చెయ్యలేకపోతే పరిపాలించే వాడు యుద్ధమేం చేస్తాడు?

ముసా: (తల ఊపుతాడు) చెయ్యలేడు)

కొత్వా: అందుకే పాలకుడు మర్యాదా అవీ చూడడు. వీటన్నింటికీ అతీతంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. సునిశితంగా పరిశీలించిన మీదకాని ఏమీ చెయ్యడు.

ముసా: చిత్తం.

కొత్వా: అట్లా చేసిన వాడు మహాపురుషుడౌతాడు.

ముసా: చిత్తం.

కొత్వా: అందుకని మతాన్ని – ధర్మాన్ని, జాతిని రక్షించేది పాలకుడని తెలుసుకో. సరే ఇప్పుడు చెప్పు ఆ కబీరు ఎవరో?

మౌల్వీ: ఆలయాల్లోకి వెళ్ళొద్దు, మసీదులోకి వెళ్ళొద్దు అని చెప్పడమే కాక మౌల్వీలని, పండితుల్ని కూడా దుయ్యబడుతున్నాడు.

కొత్వా: పండితుల్ని, పూజారుల్ని కూడా తిడుతున్నాడా. భేష్. కాని మా మతాన్ని మాత్రం తిట్టకుండా ఉంటే చాలు. ఇంకా – ఇంకా ఏమంటున్నాడు.

మౌల్వీ: ధర్మాన్ని గేలి చేస్తున్నాడు. వెక్కిరిస్తున్నాడు.

కొత్వా: (నవ్వి) మతానికి ధర్మానికి విరుద్ధంగా మాట్లాడే మనిషి ఇంకెట్టా మాట్లాడతాడు. అంతే అనుకోవాలి మరి. ఈ మాటలు ఆ మాటలు చెప్పి ఏమీ తెలియని అమాయకుల్ని చేరదీసి సర్కస్ వేయిస్తున్నట్లున్నాడు నిజమేనా? అతని వెంట ఉండే ఆ జనం ఎవరో చెప్పగలరా?

మౌల్వీ: ఎక్కువమంది ఏం లేదుకాని ఉన్న నలుగురైదుగురు అతని వలనే కవిత్వం చెప్పగలిగిన వారు. మిగతావాళ్ళు హిందువులు ముస్లింలు. తక్కువ జాతి వాళ్ళు – వాళ్లే ఎక్కువగా కబీరు చెప్పేవి వింటారు.

(బయటినుంచి ఎవరో బిచ్చగాడు కబీరు భజనపాట పాడుకుంటూ వెడుతున్నాడు.)

బిచ్చగాడు: ధర్మాలు ....నాకెన్నో ఉన్నాయి

ప్రాత: స్నానం పూజా పునస్కారం
మరిపిస్తాయని తీర్థాస్థానం.
ధర్మ గురువులను చూశాను.
అందుకే అయ్యాను వారి శిష్యుణ్ణి.
కాని వారికే భగవంతుడి జాడ తెలియలేదు.

కొత్వా: వీడెవడు?

ముసా: బయటి వీధిలో అడుక్కుంటూ పాడుకుంటున్నాడు (కిటికీ గుండా చూస్తాడు)

(మళ్ళీ బిచ్చగాడి పాట వినిపిస్తుంది)

దేవుడ్ని వెతికేవాడా పూజించే వాడా ఎవడు పిచ్చివాడో
చెప్పండి మీరే జనులారా?

కొత్వా: వీడు కబీరా?

మౌల్వీ: (కిటికీ వైపు వెడతాడు) వీడు కబీరుదాసు కాదు మహారాజ్. వాడ్ని నేను చూశాను. వీడెవడో గుడ్డివాడు. అడుక్కు తినేవాడు. కాని కబీరు పాట పాడుతున్నాడు. (కొత్వాలు నవ్వుతాడు) మా యింటి ఎదురుగానే! (బోబుదారుతో) వాడ్ని లోపలికి తీసుకురా.

(చోబుదారు బయటికి వెడతాడు)

ముసా: కబీరు కవిత్వాలే కాదు. వాడి స్నేహితులు రాసిన కవిత్వాలను కూడా చాలామంది పాడుతూ ఉంటారు.

(బిచ్చగాడితో చోబుదారు వస్తాడు)

కొత్వా: ఏం పాడుతున్నావు నువ్వు?

బిచ్చ: ఏల్ కవిత్వం బాబూ – అదే పాడుతున్నాను.

కొత్వా: ఎవరు నేర్పారు నీకిది?

బిచ్చ: ఎవరో నేర్పలేదు. ఒకటి రెండుసార్లు కబీరు పాడగా విన్నాను. అంతే! కంఠతా వచ్చేసింది.

కొత్వా: నీకు కబీరుదాసు పాటలు ఇంకా తెలుసా?

బిచ్చ: ఏవో రెండు తెలుసు నాయనా, అంతకంటే ఎక్కువ రావు.

కొత్వా: ఇంకేటదన్నా పాడు విందాం.

బిచ్చ: (ఉత్సాహంగా) మంచిది –

ఈశుడు – మహాత్ముడు – బ్రహ్మ ఒకడే
భూమి మీద ఉండే మనుషులంతా ఒక్కటే
ఎవడు హిందూ, ఎవడు ముస్లిము, ఎందుకీ భేదం
వేదం చదివినా పండితుడు
ఖురాను చదివిన ముల్లా
భోగి అన్నా, యోగి అన్నా ఒక మట్టితో చేసిన
వేరు వేరు కుండలు. కాని వారు మరిచారీ సంగతి....

కొత్వా: (మధ్యలో ఆపి) చాలు. చాలు. (ఒక వెండి నాణెం తీసి బిచ్చగాడివైపు విసురుతాడు)

బిచ్చ: దీముడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు బాబూ (నాణెం తీసి కళ్ళకద్దుకుంటాడు)

కొత్వా: నువ్వొక్కడివేనా, ఇంకా ఎవరైనా కబీరు పాటలు పాడే వాళ్ళున్నారా?

బిచ్చ: బహుశా పాడుతూ వుండొచ్చు - అయినా నాకేం తెలుసు ఆ సంగతి?

కొత్వా: నువ్వు కబీరును ఎరుగుదువా?

బిచ్చ: ఆ! రెండు మూడుసార్లు మా గుడిసెకొచ్చాడు దొరా!

కొత్వా: సరే! మంచిది వెళ్లు.

బిచ్చ: చిత్తం దొరా! (వెళ్ళిపోతాడు) (బయటికి వెళ్ళాక)

సాధువులలో ఉండేది ఒకటే
ఆలోచించిన అవగతమవును
లేదు లేదు మరొకడు
ఒకటే ధర్మం రకం ఒకటే
వాడికి లేదు బ్రాహ్మణ-శూద్ర భేదం.

కొత్వా: (చోబుదారుతో) వీడికి నాలుగు కొరడా దెబ్బలు శిక్ష. మరోసారి కబీరు పాటలు పాడితే చర్మం వలిచేస్తామని చెప్పు. చూడు - ఆ కొట్టేదేదో బయటికి తీసుకెళ్లు. ఇక్కడకాదు.

చోబు: చిత్తం (వెళ్ళిపోతాడు)

కొత్వా: (చలా దర్పంగా) ఇప్పుడయినా నీకు తెలిసిందా? కబీరుదాసుని ఎందుకు పట్టుకోలేదో? ఈ బిచ్చగాణ్ణి ఎందుకు శిక్షిస్తున్నామో?

ముసా: లేదండి.

కొత్వా: ఏది చేసినా యుక్తిగా చేస్తాం మేము. ఇప్పుడీ బిచ్చగాడికి నాలుగు కొరడా దెబ్బలు తగిలిస్తే ముందు ముందు మరెవ్వరూ కబీరు పాటలు పాడడానికి సాహసించరు.

మౌల్వీ: నిజమే కాని - కబీరు దాసు నోరు మూయించనంత కాలం ఈ రోగానికి మందులేదే!

కొత్వా: ఇదిగో ఇటువిను మౌల్వీ! ఈ ఊరు హిందువులకు పురాతనమైనది. పవిత్రమైనది అని మర్చిపోకు. ఇక్కడి రాజు హిందువు. ఆయన లోడీ చక్రవర్తికి పన్ను కడతాడు. మతం పేరిట ఈ మనిషిని ఏమన్నా అంటే కొంతమందికి నచ్చకపోవచ్చు.

మౌల్వీ: ఎవ్వరూ ఏమీ అనుకోరు. హిందువులకు కూడా అతనంటే విసుగ్గానే ఉంది. వాళ్ళ మతంలో ఉన్న మంచి చెడ్డలని గురించి కూడా విమర్శిస్తున్నాడు. చాలా సార్లు వాళ్ళంతా ఇతనికి బుద్ధి చెప్పారు కూడాను.

కొత్వా: నీకు నే చెప్పింది బుర్రకెక్కలా.....(నవ్వి) కబీరును శిక్షించడం మాకేమంత పెద్ద పని కాదు....కాని. ఎవరీ కబీరు? ఏ రాజుకన్న కొడుకా?

ముసా: కాదు.

కొత్వా: లేకపోతే ధనవంతుడా? జమిందారా? ఎన్ని భవనాలున్నాయేం? ఎన్ని గుర్రాలు, ఏనుగులు ఉన్నాయి?

ముసా: మీరు కబీరు విషయం నవ్వులాటగా తీసుకుంటున్నారు. (నవ్వి) సాలెవాడిదగ్గర అవన్నీ ఎక్కడుంటయ్యండీ?

కొత్వా: నిన్న ఎంతమందిని బహిరంగంగా ఏనుగులతో తొక్కించామా?

ముసా: ముగ్గురు బందిపోట్లను దొరా!

కొత్వా: వాళ్ళలో ప్రాణాలతో ఎవరన్నా ఉన్నారా?

ముసా: అదెలా సంభవం – ఇప్పటికే ముగ్గురి శవాలు ఆకూడలిలో పడివున్నాయి.

కొత్వా: ఇప్పుడు చెప్పండి. సాలె కబీరుని చంపడం అసాధ్యమా?

ముసా: మీకేదీ అసాధ్యమనేదే లేదు! కనుసైగ చేస్తే చాలు.

కొత్వా: అయినా మేము అటువంటి ఆజ్ఞ ఇవ్వలేదంటే దానికో కారణం ఉండి ఉండాలి అవునా?

ముసా: ఆ కారణమేమిటో మీరు వేసే శిక్షకంటే మిన్న అయిందిగా ఉండి ఉంటుంది!

కొత్వా: కబీరుని శిక్షించాల్సిన అవసరం లేదు అతని బోధనలు వినేవాళ్ళ మనసులలో భయం పుట్టిస్తే చాలు. కబీరుని ఏమన్నా చేస్తే కబీరంటే ఇష్టమైనవాళ్ళకి కష్టం కలగవచ్చు. అందుకని యుక్తిగా ఈ పన్నాగం పన్నాం.

(మౌల్వీ, ముసాహిబ్ ముక్త కంఠంతో "నిస్సందేహంగా మీరు చెప్పింది ముమ్మాటికీ నిజం" అని అంటారు)

(చోబుదారు హడావుడిగా లోపలికి వస్తాడు)

కొత్వా: ఏమిటి ఏమయింది? ఆ బిచ్చగాడికి కొరడా దెబ్బలు తగిలించారా?

చోబు: చిత్తం! కాని వాడు అక్కడికక్కడే ఊపిరి వదిలాడు.

కొత్వా: పోయాడా? అంటే అంతగట్టిగా కొట్టావన్నామాట! (చోబుదారు తలవంచుకుంటాడు. అవునన్నట్టుగా తలవూపుతాడు.) (కొత్వాలు ఓ నిమిషం ఆలోచించి) వాడి శవమెక్కడ?

చోబు: కొత్వాలు ఆవరణలోనే ఉంది.

కొత్వా: ఏం ఫర్వాలేదు. వాడింటికి శవాన్ని చేర్చేయి – పరిస్థితి గురించి నాకెప్పటికప్పుడు కబురు చేయి.

చోబు: చిత్తం. దొరా. ఇదిగో (బిచ్చగాడికిచ్చిన నాణెం తెచ్చి అక్కడ స్టూల్‌మీద పెడతాడు)

కొత్వా: ఏమిటిది?

చోబు: మీరు బిచ్చగాడికిచ్చిన నాణెం.

కొత్వా: దీంతో అందరికీ తెలుస్తుంది. ప్రభుత్వపు నౌకరు వీధి వీధినా వాడి శవాన్ని తిప్పి తీసుకెడితే భయమంటే ఏమిటో ప్రజలకి బాగా తెలుస్తుంది. ఇంక మీరంతా వెళ్ళవచ్చు.

(కొత్వాలు కిటికీ దగ్గరికి వెడతాడు. చేతులు వెనక్కి పెట్టి బయటికి చూస్తుంటాడు. మౌల్వీ – మూసాహిబ్ నమస్కారం చేసి వెళ్ళిపోతారు)

**(తెర)**

# నాలుగవ దృశ్యం

(తెర లేచేసరికి కబీరు గుడిసె ముందు. మగ్గం ముందు నుంచుని మగ్గంతో పాటు లయగా)

మిల మిల మెరిసే దుప్పటి
పడుగు పేకల కలయిక దుప్పటి
ఇంగ్లా-పింగ్లా-పడుగు పేక
సుషుమ్న నాడితో నేసిన దుప్పటి
సుర-ముని-నరులందరు కప్పుకునే దుప్పటి
మలినమైన దుప్పటిని కప్పుకున్న కబీరు
ప్రయత్నము చేసి ఆ దుప్పటి కప్పుకున్నాడు.
ఎట్లా ఉన్నది అట్లా కప్పుకున్నాడు కబీరు.

(రైదాసు, పీపా వాళ్ళు వస్తారు)

కబీరు: రండి, రండి. మగ్గంతో పాటు మనసులో లయ-తాళాలు స్వరం కలుపు తున్నాయి. ఆ తాళంతో పాటు పాడుతుంటే ఆనందానికి అవధుల్లేవు.

రైదా: నిన్న నువ్వు ఎవరిని కలవడానికి వెళ్ళావు కబీర్?

కబీరు: దక్షిణ దేశం నుంచి ఒక మహాత్ముడు వచ్చాడు అక్కడికి.

చైతన్యం ముప్పిరిగొన్న వాడిలా)

మొదట్లో నేను ఏదో వింటూ ఉండేవాణ్ణి. కాని రాను రాను ఆయన చెప్పేవి చాలా నచ్చుతున్నాయి. ఆయన మాటలు వింటుంటే నా మనసులోని ప్రశ్నల - చిక్కుముళ్లు - సులభంగా విడిపోతున్నట్లు అనిపిస్తున్నది. వ్రతాలు - ఉపవాసాలు, పూజాది కర్మలు, ఉచ్ఛ-నీచ భేదాలు లేని ప్రేమను గురించి ఆయన చెపుతుంటే ...ఓహ్...ఆయన అందరినీ సమంగా ప్రేమిస్తాడు - ఆయనకి భగవంతుడిమీద ఉన్న భక్తి అపారం. (కొంచెం ఆగి) మొదటిసారిగా ఆయన ఉపదేశం విని రాత్రంతా నిద్రపోలేదు. అప్పుడే అంధకారంలోంచి ఓ కిరణం ఉత్పన్నమయినట్లు అనిపించింది. అప్పుడనుకున్నాను - "కబీర్ నువ్వు చదువురాని వాడివైతేనేమిరా, నీకు కావాల్సింది తెలుసుకున్నావ్" అని. జీవితానికి కావలసిన మహామంత్రాన్ని పొందాను. తోటిమనిషిని ప్రేమించడమే భగవంతుడికి మనం చేసే ఆరాధన పూజ అని అప్పుడనిపించింది. వెంటనే నా నోటి వెంట -

చదువులు చదివి చదివి చచ్చే ఈ ప్రపంచంలో
కాలేదెవ్వడూ పండితుడు.
రాదు అనే రెండక్షరాలను చదివినవాడే పండితుడీ ప్రపంచంలో

ఆయన్ని చూస్తే నాకు సరియైన గురువు లభించాడనిపిస్తోంది. రైదాస్ ఆయనొక్కడే నా హృదయపు లోలోతుల్ని కనుగొన్నాడనిపిస్తోంది.

(కబీరు పాట మొదలు పెట్టగానే అందరూ అందుకుంటారు)

నే మరిచిన జగత్తుని గురువు
చూపించాడు తన మహత్తుతో
తపస్సు చేసినా దేహాన్ని ఉపవసింప చేసినా
పంచేంద్రియాలను అదుపులోనుంచినా
దయే ధర్మంగా పాటించి దీనుల కాపాడినవాడు
తనను సర్వభూతములయందు కన్నవాడు
అందని వాడిని పొందగలము అవినాశుణ్ణి అందగలము.

(సీనా పరిగెత్తుకుంటూ వస్తాడు. కబీరా–కబీరా అంటూ పిలుపులు వినవస్తాయి)

కబీరు: ఏమటి ఏమయింది సీనా? అంత కంగారు పడుతున్నావెందుకు?

సీనా: ఇది విన్నారా మీరందరూ! ఒక గుడ్డి బిచ్చగాడి గుడిసెకు నువ్వు వెళ్ళావు చూడు కబీర్....?

కబీర్: ఆకాశం నుండి వెన్నెల జాలువారినట్లుగా తియ్యగా మధురంగా ఉండేది అతని కంఠం...అతనేనా?

సీనా: వాడి శవాన్ని తెస్తున్నారు. (ముగ్గురూ నిశ్శబ్దంగా ఉంటారు) కొత్వాల్ ఎదురుగా నీ పాట పాడాట్ట. కొత్వాలు కొరడాలతో మూడు దెబ్బలు వేయించాడు. నాలుగో దెబ్బకల్లా ఊపిరి వదిలాట్ట.

(వెంటనే చావుమేళం వినిపిస్తుంది. చేతిలో బల్లెంతో ఒక సిపాయి ముందుగా ఉంటాడు. నలుగురు వ్యక్తులు గుడ్డి బిచ్చగాడి శవాన్ని మోసుకొస్తారు. వెనుకగా మరో భటుడు. చావుమేళం బాగా దగ్గరగా వినిపిస్తుంది)

కబీర్: అతని తల్లికూడా గుడ్డిదే! ఆమె గతేమికాను ఇప్పుడు? "నీ పాటలు మా అబ్బాయి పాడుతుంటే జనం గుమిగూడి వింటున్నారు. అప్పటినుంచీ మా ఇంట్లో పొయిలో నిప్పేసుకుంటున్నాం బాబూ" అనేది. ఇప్పుడు ఆ పాటలే అతని ప్రాణం తీసాయి అని తెలిస్తే ఎంతగా తల్లడిల్లిపోతుందో? రైదాస్ జీ.....

రైదాస్: చెప్పు...

కబీరు: రైదాస్‌జీ...ఇతనే కాదు ఇంకా ఎంతోమంది నా పదాలు పాడుతూ తిరుగుతున్నారు (చాలా బాధగాను ఉదాసీనంగాను) వాళ్ళెంతో ఉత్సాహంతో మన దగ్గరికి వస్తున్నారు. వాళ్ళు కూడా....వాళ్ళు కూడా ఈ గుడ్డి బిచ్చగాడిలా.....వాళ్ళని మాత్రం మౌల్వీ మనుషులు, కొత్వాల్ మనుషులు ఒదిలి పెడతారంటారా?

సీనా: వాళ్ళని సందుగొందుల్లో కూడా పదాలు పాడొద్దు అంటే సరి. ఏ ప్రమాదమూ ఉండదు.

కబీర్: (ఆలోచనలో మునిగిపోతాడు) కాదు.....దానికి నివారణ అది కాదు....మనం స్వయంగా వెళ్ళి కలిసి మాట్లాడదాం. పండితులు – మౌల్వీలు...ఆఖరికి కొత్వాలుకు కూడా ఒకే కోరిక – వాళ్ళందరికీ కావాల్సింది ఒక్కటే – అదే మనం పాడకుండా ఉండడం. మనం నోళ్ళు మూసుకోడం...అది మాత్రం జరగని పని. పదండి మనం అందరం కలిసి పాడదాం – అందరిని కూడగట్టుకుందాం. సత్సాంగత్యం నెలకొల్పుదాం. (చాలా విషాదంగా) కాని ఆ తల్లి సంగతి తల్చుకుంటే గుండె బద్దలవుతుంది. దుఃఖమే జీవితంగా గడపాల్సి వచ్చింది ఆమెకు. అదే నా బాధ.

రైదాస్: నువ్వు చెప్పింది చాలా బాగుంది కబీర్. మనం సత్సాంగత్యపు సమావేశాన్ని ఎక్కడ జరుపుదాం?

సీనా: ఎక్కడ జరపాలన్నది ప్రశ్నే!....

కబీరు: ఎక్కడైతేనేం....ఎక్కడైనా సరే...మాట వరసకి...ఆ రోడ్డు వారగా కూర్చోవచ్చు.....లేదా ఇక్కడే... ఈ అరుగుమీదే కూర్చోవచ్చు....వీధి వీధినా సందుసందునా పాడుకుంటూ వెడదాం.

(గుడ్డి బిచ్చగాడి తల్లి ఏడుస్తూ వస్తుంది. ఒక చిన్న కుర్రవాడి బుజాల మీద చేతులు వేసుగు)

గుడ్డి తల్లి: (ఏడుస్తూ) కబీరా – అరె ఓ కబీరా...నా నందు కళ్ళు మూసాడు చూశావా...నువ్వెక్కడున్నావు నాయనా?

కబీరు: ఇక్కడున్నానమ్మా....విన్నానమ్మా.......జరిగిన విషాద సంఘటన గురించి నాకిప్పుడే తెలిసింది.

తల్లి: అసలే ఒంటి ఊపిరివాడు. కొరడా దెబ్బలు తినే ఓపిక కూడా లేని వాణ్ణి పట్టుకుని చావబాదారు నాయనా.

కబీరు: ఇంట్లో వంట సామాగ్రి అవీ ఉన్నాయా అమ్మా!

తల్లి: (ఏడుస్తూ చాలా జాలికలిగేట్టు) ఆ! ఆ! సంపాదించి పెట్టిపోయాడుగా నాయనా. తను తిన్నా తినకున్నా నా కోసం దాచిపెట్టి వాడు వెళ్ళిపోయాడు బాబూ. (చాలా వ్యాకులంగా) నందూ నాన్నా.....తండ్రీ. నేను కూడా నువ్వు పాడిన పదమే పాడుతాను రా. నీకు మల్లెనే సందు సందునా తిరిగి పాడతానయ్యా.

రైదాస్: ఎందుకమ్మా అనవసరంగా.....ఆ పదాలు పాడకు. నీక్కూడా కొరడా దెబ్బలు తగుల్తాయి.... అప్పుడు నువ్వు కూడా....

తల్లి: నందు వీపు మీద పడిన వాటికంటేనా? వాడి మీద పడ్డ ప్రతి దెబ్బా నా గుండెకి తగిలింది నాయనా. అయినా నేను ఇంకా బతికే వున్నాను. కాని నందూ పోయాడు. నేనా దెబ్బలని ఓర్చుకుంటాను కబీరా. నా బిడ్డ పోయాడన్న బాధని దిగమింగుతున్న నాకు ఆ దెబ్బలు ఓ లెక్కలోకి రావు. తిరుగుతాను. సందలుగొందులు తిరిగి నీ పదాలు పాడుతాను. వినేవాళ్లు వింటారు. వాడు....నందు...వాడెక్కడున్నా వాడూ వింటాడు. వింటాడు కదా కబీరా. (వెళ్ళబోతుంది)

కబీరు: ఆ! తప్పకుండా వింటాడమ్మా....(వెళ్లబోతున్న ఆమెను ఆపి) ఎక్కడికమ్మా వెడుతున్నావు. నువ్వు మాతో ఉండిపో.

తల్లి: నేనెక్కడికి వెడతానయ్యా. నందూ దగ్గరికేగా! వెధవలు...నా కొడుకుని కొట్టిచంపేశారు.

కబీరు: అయితే మేమూ నీ వెంట వస్తాం.

సీనా: నువ్వు ఇక్కడే ఉండు కబీర్‌దాస్. మేము అమ్మని దింపివస్తాం.

తల్లి: నేను వెళ్ళిపోగలను రా...(సీనా, బషీరా, తల్లి వెంట వెడతారు)

పీపా: చూడు కబీర్. సత్సంగాలు పెట్టుకుంటే పండితులూ, ముల్లాలు ఊరుకుంటారంటావా? రాజావారికి కూడా ఇష్టం ఉండకపోవచ్చు.

కబీరు: అయితే....?

పీపా: మనం జనాన్ని పోగుచేస్తే మన మూలంగా అనవసరంగా వాళ్లకి బాధలెందుకూ అని!

కబీరు: ఎవరినని ఆపగలవు నువ్వు. పీడితులందరూ మనపక్కే. మన మాట–పాట నచ్చినవాళ్లే ఇక్కడికి వస్తారు. వాళ్ళని ఆపలేవు. నచ్చనివాళ్లు నువ్వు పిలిచినా రారు. కవితలు రాసేది మీరు నేను అయినా, భావనాబలం వల్ల ఆ పదాలు వాళ్ళల్లో సంచలనం కలిగిస్తాయి.

రైదాస్: అయితే మనం అందరం ఈ రోడ్డు పక్కన కలవడం తథ్యం.

కబీరు: ఆ! ఉదయాన్నే ఆ కార్యక్రమం మొదలు పెడదాం. పొద్దెక్కిందంటే అందరూ ఎవరి పని మీద వాళ్ళు వెళ్ళిపోతారు.

రైదాస్: ఇక్కడినుంచే చాలామంది గంగా స్నానానికి వెడతారు.

కబీరు: అది ఇంకా బావుంది.

రైదాస్: కాని నిమ్నజాతుల వాళ్లు ఇక్కడ కూర్చున్నారని తెలిస్తే, బ్రాహ్మణులు ఈదోవంట స్నానానికి రారేమో?

కబీరు: అట్టాంటిది ఏదో ఒకటి జరగకమానదు. అయినా సరే! ఆ! మీరు మీమీ స్నేహితులకి చెప్పండి. నేను మా బస్తీలో చెబుతాను.

పీపా: బాగా ఆలోచించుకుని అడుగు ముందుగు వెయ్యి కబీర్. ఇది చాలా సాహసంతోను, అపాయంతోను కూడుకున్న పని.

కబీరు: (నవ్వి)

మనసులో ఉన్న ప్రియుడిని
ప్రేమిస్తూ ఏడ్చేదెందుకని
కబీరు చెప్పే ప్రేమమార్గం ఇదే ఇదే
ప్రేమకోసం త్యాగాలు చేసే ప్రేమికుడా
త్యాగం చెయ్యి నీ ఏడుపుని ప్రేమపథికుడా.

**(తెర)**

# అయిదవ దృశ్యం

(ప్రభాతవేళ. కాశీ పట్టణం. సీనా మరి ఇద్దరు ముగ్గురు నుంచుని మాట్లాడుకుంటున్నారు.)

ఒకడు: మన ఊళ్ళోకి సాధువులొచ్చారు. చాలా తెలిసిన వాళ్లుట. మనకి తెలియనివెన్నో తెలుసుకోవచ్చునని వెళ్ళాం. మేం చేతులు కట్టుకుని ఆయన్ని "యోగసాధన చెయ్యాలంటే ఇల్లు-ఇల్లాలు ఉండొచ్చునా" అని అడిగాం. నావంక చూసి ఆయన "నీదే జాతి" అని అడిగాడు. "అయ్యా నేను మీ సేవకుణ్ణి" అన్నాను. ఆయన కోపంతో మళ్ళీ అడిగాడు "నీదేజాతి" అని! అప్పుడు మేమంతా "తక్కువ కులం – మాదిగకులం" అన్నాం. అంతే! ఆ సాధువు కర్రుచ్చుకున్నాడు. అదిచూసిన మేము కొడతాడేమోనని పారొచ్చాం.

(బషీరా ప్రవేశం. వెంట తోలు సంచి ఉంది)

రా! రా! బషీరా. (సీనాతో) బషీరా ఇవాళ సత్సంగం ఉంటుందని చెప్పాలే నేను. ఇతను కూడా మీరు పాడే పదాలు విన్నాట్ట. అందుకని మీ దగ్గరికి వస్తానన్నాడు. సరే రా! అని చెప్పి వచ్చాను.

బషీరా: అందరూ కలుద్దామనుకున్నది ఇక్కడేగా! ఇట్నించిటే పనికి వెళ్ళిపోవచ్చుననుకుని వచ్చా.

సీనా: నువ్వు కూడా కాశీలోనే ఉంటావాల బషీరా?

బషీరా: అదేమంత పెద్దగొప్పలే! మంచి ప్రశ్నే వేశావు. చెబుతానుండు.

సీనా: చెపు. చెప్పు.

బషీరా: ఎక్కడనుంచి మొదలు పెట్టను? తాతనుంచా – ముత్తాతనుంచా? ఎక్కడ్నించో చెప్పు.

సీనా: ఎక్కడినుంచి మొదలుపెట్టాలనుంటే అక్కడినుంచి.

బషీరా: అయితే విను. మా ముత్తాతలు అయిదుగురన్నదమ్ములు. వాళ్ళంతా ఢిల్లీలో ఉండేవారు. మహమ్మద్ బిన్ తుగ్లక్ రాజ్యంలో అమలుదారీగా ఉండేవాడు. తర్వాత ఏలినవారు దౌలతాబాదుకు పద అన్నారు. మళ్ళీ అయిదుగురు అన్నదమ్ములు దౌలతాబాదుకు పయనమయ్యారు.

సీనా: తర్వాత?

బషీరా: ఇద్దరు దోవలోనే టపాకట్టేశారు. మిగిలిన వాళ్ళు వెళ్లారక్కడికి.

సీనా: ఊ! ఆ తర్వాత?

బషీరా: తర్వాత ఏముంది మళ్లీ రాజావారు "ఛలో ఢిల్లీ" అన్నారు.

సీనా: ఊ! అయితే?

బషీరా: మళ్ళీ మామూలే! ఇద్దరు దోవలోనే ఇహలోక యాత్ర చాలించారు. ఉన్న దొక్కడు. ఆయనే మా ముత్తాత! అప్పుడే ఏమయింది. ముందు కథ విను.

ఒకడు: దౌలతాబాద్ వెళ్ళగలిగిన వాళ్ళల్లో మీ వాడొకడున్నాడంటే చెప్పుకోదగ్గ విషయమే!

బషీరా: ఆయన మా ముత్తాత పినతండ్రి కొడుకుట.

ఒకడు: అదెలా సంభవమైంది?

బషీరా: ఆయనసలు అక్కడికి వెళ్లాలనుకోలేదుట. రాజసేన ఆయన్ని ఈడ్చుకుపోయిందట. దాంతో ఆయన

ఒక్కొక్క డేరా దగ్గర ఒక్కొక్క అవయవాన్ని పొగొట్టుకొని దౌలతాబాద్ వెళ్ళేసరికి ఓ తొడ మాత్రం మిగిలిందట. అది మాత్రం దౌలతాబాద్‌కి క్షేమంగా చేరిందట.

సీనా: ఆ!

బషీరా: తుగ్లక్ దౌలతాబాద్ చేరగానే బహుమతులు పంచిపెడుతుంటే ఓ సైనికుడు వెళ్ళి ఈ మొండికాలు ఇచ్చి బహుమతి పొందాట్ట. ఒకటా రెండా వంద దినారులు. అంతేకాదు ఆ కాలు చూపించిన వాణ్ణి సుబేదారుగా చేసాట్ట.

సీనా: ఆహాహా! ఏం గొప్ప పనిచేసాడండీ!

బషీరా: మా ముత్తాతకి కూడా నలుగురు కొడుకులు. చాలా పొగరుబోతుగా ఉండేవాళ్ళుట. చాలా అందగాళ్ళు కూడాట!

సీనా: ఊ!

బషీరా: తైమూర్ ఢిల్లీకి వచ్చినప్పుడు ఇద్దరు చచ్చారు.

సీనా: తర్వాత మళ్లీ?

బషీరా: చెపుతా వినుమరి. తైమూర్‌కి మతపిచ్చి ఎక్కువ. అల్లాపేరు చెప్పి కత్తిఎత్తి ఓ లక్షమందిని పరలోకానికి పంపేశాడు.

సీనా: ఆ!

బషీరా: ఈ పని పూర్తవగానే చచ్చినవాళ్ళ పేరిట ఓ మసీదు కట్టాలనుకున్నాడు. దానిమీద ఓ గోళాకారపు కట్టడం ఇంతవరకు ఎక్కడా ఎవరూ కట్టనంత ఎత్తుగా కట్టించాలనుకున్నాడు. చాలా పట్టుదలగల వాడులే! ఈ మసీదు కట్టించడానికి ఢిల్లీనుంచి పనివాళ్ళని పిలిపించాలనుకున్నాడు.

సీనా: భేష్! తర్వాత?

బషీరా: కాని ఢిల్లీలో ఎవడన్నా బతికుంటేనా? ఓ లక్షమందిని యమలోకాని పంపాడు కదా! మా తాతలు ముగ్గురు మాత్రం నానా తంటాలు పడి తలదక్కించుకున్నారు. అప్పట్లో తైమూరు సేనలో మదించిన సిపాయిలు ఇళ్లుకొల్లగొట్టే వారు. ఆడవాళ్ళని ఎత్తుకు పోయేవారు. ఓ సారేమయిందంటే ఆ సిపాయిలు మా తాతలండే సందులో జొరబడ్డారని తెలుస్తూనే వాళ్ళ భార్యలు రహస్య గృహంలోకి పోయి దాక్కున్నారు.

సీనా: వినసొంపుగా ఉందే చెప్పు చెప్పు.

బషీరా: నిజానికి వాళ్ళొచ్చింది ఆడాళ్లని ఎత్తుకుపోవడానికి కాదు. మా తాతలని మసీదు కట్టడానికి తీసుకుపోదామని వచ్చారట. ఇద్దరిని ఆ పనిమీద తీసుకెళ్ళారట!

సీనా: ఆ తర్వాత – మరి మిగిలిన ఇంకో ఆయన?

బషీరా: ఆయనే మా తండ్రి. సిపాయిలు వచ్చే సమయానికి ఇంట్లో లేడు. తైమూరు వచ్చిన దానికంటే వెళ్లేప్పుడే బలే హుషారుగా వెళ్ళాడు. వచ్చేప్పుడు గుర్రాలమీదా, వెళ్ళేటప్పుడు ఏనుగుల మీదా. వచ్చేటప్పుడు సైనికులు తప్ప మరెవరూ లేరు. వెళ్ళేటప్పుడు మాత్రం ఆడమళయాళం ఎక్కువై పోయింది. తాపీ మేస్త్రీలు, పనివాళ్ళు – మా బాబాయిలిద్దరు. అంతేకాదు తైమూరు మసీదు కోసం స్వయంగా గీసిన ప్లాన్ కూడా తీసుకెళ్ళాడు.

సీనా: బలే చేశాడులే! మరి మీ నాన్న సంగతేమయింది?

బషీరా: ఏమయ్యేదేముంది ఆయనకి మళ్ళీ మేమయిదుగురు కొడుకులం. తైమూరు వెళ్ళాక ఢిల్లీలో కరువొచ్చిపడింది. అప్పుడిద్దరు పోయారు. తర్వాత మహమ్మారి మూలంగా మరో ఇద్దరు పోతే మిగిలింది మనం (తన వైపు చూపిస్తూ) వంశపు దీపాన్ని!

సీనా: అదన్నమాట నీ కథ!

బషీరా: అంచేత మీకిప్పటికయినా తెలిసుండాలి నేను ఢిల్లీ వాస్తవ్యుణ్ణి. అంతేకాదు నాకు కూడా అయిదుగురు కొడుకులే!

(రైదాస్ వస్తాడు)

సీనా: వచ్చారా రండి రండి. మాకేమో తొందరగా రండి అని చెప్పి మీరే ఇంత ఆలస్యంగా రావడమా?

రైదాస్: (బాక్సు కింద పెడుతూ) ఆలస్యమయిపోయింది.

సీనా: దీన్ని కూడా తెచ్చారెందుకు?

రైదాస్: ఎక్కడ పెట్టను మరి – వెంట తెచ్చాను.

ఒకడు: అసలు మనకి ఠికాణా ఏది ఇప్పుడు?

బషీరా: మాతోనే ఉందురుగాని. బనారస్‌లో రెండువందల సందులు, ఒక వంద రేవులు ఉన్నాయి. మనకి చోటే దొరక్కపోతుందా?

(ముగ్గురు నలుగురు మనుషులు ఒక్కసారిగా వస్తారు. చాలా మురికిగా ఉన్న బట్టలు వేసుకున్నారు. చాలా చితికినట్టుగా కన్పిస్తారు. బుజాలమీద సంచులు వేసుకున్నారు)

సీనా: ఇంకా జనం వస్తున్నారు చూడండి.

రైదాస్: ఇంతకీ ఎక్కడ కూర్చుందామని?

సీనా: ఈ రోడ్డువారగా కూర్చుందాం.

రైదాస్: ఒకసారి ఓ గుంపుగా చేరి మనమంతా కూడా మంటే ఈ కబురు దానంతటదే అందరికీ తెలిసి వాళ్ళే వస్తారు. ఎక్కువమంది రావడం లేదని. చింత అక్కర్లేదు.

(కబీరు వస్తాడు)

కబీరు: ఓహో! ఇక్కడ అప్పుడే భక్తులు పోగయ్యారే! నాదే ఆలస్యం అల్లే ఉంది.

(ఏకతారా తీసుకుని కబీరు కూర్చుంటాడు)

ఇక్కడ డేరా కూడా వేసారా? అఛ్ఛా. ఇక్కడికి దగ్గర ఉన్న ఆ స్థలంలోనే నాకు గురువుగారు దీక్ష ఇచ్చాడు.

రైదాస్: ఎక్కడా?

కబీరు: దగ్గరే! పంచగంగా ఘాట్‌లో. ఈ ఘాట్‌లోనే మెట్లమీద గురు దీక్ష పొందాను. ఇలాగే ప్రభాతవేళ.

రైదాస్: ఏమంటున్నావు? రాత్రిపూటా? ఘాట్ మెట్లమీదా? అటువంటి గురుదీక్షను గురించి నేనెక్కడా వినలేదు.

కబీరు: (నవ్వి) నే తిన్నగా చెపుతానుండు. గురువుగారు సూర్యోదయానికి మునుపే ఇక్కడికి స్నానానికి వస్తారని నాకెవరో చెప్పారు. మంచి అవకాశం దొరికిందనుకున్నాను. ఓ రాత్రివేళ అక్కడికి

చేరుకున్నాను. ఆ పంచగంగా ఘాట్‌లో మెట్లు చాలా సన్నగా, ఇరుకుగా ఉంటాయి. అప్పుడు నాకో ఆలోచన తట్టింది. గురువుగారు ఇదే మెట్లమీంచి పైకి వెళ్ళాలి – కిందకి దిగాలి. ఎలాగైనా నన్ను దాటి పోలేరు. ఆయన పాదాలు నన్నంటుతాయి. చాలు. అంతటితో గురుదీక్ష లభించినట్టే అనుకున్నాను.

రైదాస్: తర్వాత.

కబీరు: తర్వాతేముంది. అనుకున్నట్టే అయింది. గురువుగారి పాదాలు నా మీద పడ్డాయి. కబీరనే సాలెవాడికి తను దీక్ష ఇచ్చినట్టుగా కూడా ఆయనకి తెలియదు. నేను దూరంగా వెళ్ళిపోయాను. వెంటనే అక్కడినుంచే ఆయన్ని చూసి నమస్కరించాను. ఆయన కాంతులీనే ముఖాన్ని చూసి –

భగవంతుడి వెలుగును చూద్దామని వెళ్ళిన నేను
ఎక్కడపడితే అక్కడ ఆ వెలుగే అయ్యాడని తాను
వెలుగు చూద్దామనుకున్న నేను అయ్యాను నేనే ఓ వెలుగు.

రైదాస్: ఎక్కడైనా కూర్చుందాం పట్టు. లేకపోతే ఇంకాసేపు ఎవరైనా వస్తారేమోనని చూద్దామా?

కబీరు: లేదులే కూర్చో. చాలా ఆలస్యమైంది.

రైదాస్: భంగీ (పాకీవాళ్ళు) బస్తీనుంచి కూడా కొంతమంది రావల్సిన వాళ్ళున్నారా?

(ఇంకిద్దరు ముగ్గురు వస్తారు. వాళ్ళవెంట నందూ గుడ్డి తల్లి కూడా ఉంటుంది. ఒకతను అటుగా వెడుతూ ఆగి కబీరుదాసు సమావేశం ఏర్పాటు చేసింది "ఇక్కడేనా?" అని అడుగుతాడు.)

రైదాస్: ఆ! ఇక్కడేరా! కూర్చో.

కబీరు: రా తమ్ముడూ రా! (గుడ్డి తల్లి వైపు చూసి) అమ్మా నువ్వు కూడా వచ్చావా? రా కూర్చో.

తల్లి: వచ్చాను రా కబీరా!

(ఒకడు చీపురు తీసుకుని స్థలం శుభ్రం చేస్తాడు. దూరంగా కోవెల గంటలు వినవస్తాయి. సూర్యోదయం అవుతున్నట్లు ఉదయిస్తున్న సూర్యుడు. జనం చెప్పులు విప్పి కూర్చోబోతూ వుంటారు. ఒకడి చేతిలో హుక్కా కూడా ఉంది)

ఒక భక్తుడు: కబీరా భజన చేస్తావా? కోవెల్లోకి మల్లె గంట వాయిస్తావా?

సీనా: ఇక్కడ గంటవాయించడం ఎందుకు. ఇక్కడేమీ మీద విగ్రహానికి పూజ చెయ్యడం లేదే? చందన తాంబూలాలు – నైవేద్యాలు అవీ ఏవీ ఉండవు.

భక్తుడు: సరే అయితే. ఇక్కడ గంట కొడతారా అని అడిగాను. కొట్టరని తెలిసింది. ఇహ తెలిసింది. తెలియని దాన్ని గురించి తెలుసుకోడం తప్పుకాదుగా! మొహం ఎటుపెట్టి కూర్చోవాలి కబీర్. తూర్పువైపా? (కబీరు పలకడు) కబీర్ నిన్నే అడుగుతున్నాను ముఖం ఎటుగా పెట్టుక్కూర్చోవాలి?

కబీరు: ఏ వైపు నీకు భగవంతుడు కనిపిస్తే అటు.

భక్తుడు: (అమోమయంతో) నీకెటు కనిపిస్తున్నాడు?

కబీరు: నాకు నాలుగు వైపులా కనిపిస్తున్నాడు.

భక్తుడు: బాగానే ఉంది. కాని నాలుగువైపులా ముఖం పెట్టుకునే దెట్లా?

కబీరు: నీకెటు నచ్చితే అటు. అక్కడే కనిపిస్తాడు భగవంతుడు.

భక్తుడు: నువ్వేటు కూర్చుంటావు?

కబీరు: నేను నీ వైపు తిరిగి కూర్చుంటాను.

భక్తుడు: (నవ్వి) సరే! నేను నీ వైపు తిరిగి కూర్చుంటాను.

(ఒక మంగలి వస్తాడు)

బషీరా: నీ పొదితోపాటు వచ్చావా?

మంగలి: (తన సంచీ ఒక పక్కగా పెట్టి) ఇక్కడ కూర్చుంటాను. నిన్న దక్షిణ దేశం నుంచి ఒకాయన, పెద్దమనిషి వచ్చాడు. తల మీద కత్తేశానో లేదో ఆవలింత వచ్చింది. "హాయ్ అల్లా!" అన్నాను. అంతే నన్ను ఒదలించుకుని తిట్లు–శాపనార్థాలు పెడుతూ పంచె సవరించుకుంటూ అమాంతం గంగలో దూకాడాయన.

కబీరు: (పట్టించుకోనట్లుగా) చెప్పండి రైదాస్‌జీ. ఏమయినా కొత్తపదమా?

రైదాస్: (పాడతాడు)

మంచిది జాతి
మంచిది పని
మంచిది మతి
కిందినుంచి మేము
పైకెత్తిన వాడు
భగవంతుడని
చెప్పెను మాదిగ రైదాసు.

సీనా: కబీర్‌వా ఇప్పుడు మీరు చెప్పండి.

కబీరు: నీలోనే ఉన్న నన్ను వెతికేవే మనసా.
గుడిలోనో మసీదులోనో కైలాసంలోనో లేనే మనసా.
క్రియాకర్మలలోగాని – యోగుల బైరాగులలో గాని
వెతికిన నేనుంటాను. మరు నిముషములో దొరకేనా.
ఊపిరిలో ఊపిరివై ఉండేదే భగవంతుడని – కబీరు చెప్పేమాట వినవే మనసా.

(చిడతలు, డప్పు ఢోలక్ వాయిస్తూ భక్తిరసంలో మునిగిపోతారు అందరూ. వచ్చేపోయే వాళ్లందరూ ఆగిచూస్తారు. చూడడానికి అందంగానూ, వినడానికి వీనులవిందుగాను ఉన్న ఆ దృశ్యాన్ని జనం చూస్తుండగా ఇద్దరు సిపాయిలు ప్రవేశిస్తారు. ఒక ప్రక్కనుంచి వచ్చి నెమ్మదిగా చూసుకుంటూ రెండో పక్కగా వెళ్లిపోతారు. భక్తులు మేనులు మరిచి పాటలో లీనమై పోతారు. వెనకనుంచి మొదలైన అలజడి గోలగా మరి ముందున్న జనానికి పాకుతుంది. వెనకనుంచి కబీరా! కబీరా! అంటూ ఓ చిన్న పిల్లగాడు పరుగెత్తుకొస్తాడు)

పిల్ల: కబీరా ఎక్కడ – ఎక్కడున్నావు నువ్వు కబీరా! నిప్పంటుకుంది. నీ ఇంటికి నిప్పంటుకుంది.

సీనా: ఎక్కడ – ఎక్కడానిప్పుంటుకుంది. (ఇద్దరు ముగ్గురు లేచి నుంచుంటారు)

పిల్ల: గుడిసెంతా కాలిపోయింది. నిప్పు బస్తీలోకి పాకుతుంది.

కబీరు: (నెమ్మదిగా ఏక్‌తారా కిందిపెట్టి వస్తాడు) అమ్మా - నాన్నా - కులాసాయే కదా?

పిల్ల: మీ నాన్నకి రవ్వంత నిప్పంటుకుంది. చేతులు కమిలిపోయాయి. లోపలికెళ్లి బట్టలు అవీ తేబోయాడు.

(అంతా లేచి నుంచుంటారు. రాను రాను కలకలం ఎక్కువవుతుంది. గాబరాగా మాట్లాడుకుంటారు)

కబీరు: ఇవాళ కాకపోతే రేపు. ఎప్పుడో అప్పుడు ఇట్లా జరుగుతుందని అనుకున్నా! (పిల్లవాడితో) అమ్మెక్కడుంది? నాన్న చేతులు కాలాయా?

పిల్లవాడు: నీ మగ్గాలు రెండూ కాలిపోయాయి. అక్కడంతా ఒకటే పొగ కమ్ముకుంది.

సీనా: నీ గుడిసె కాలిపోతేనేం. కబీర్ నా యింటికిరా!

కబీరు: నీకే ఓ దోవంటూ లేనప్పుడు మమ్మల్ని ముగ్గుర్ని ఎలా భరిస్తావు? బస్తీలో చాలా మంది ఉన్నారుగా! వాళ్ళ సాయం ఉందిలే మాకు. నే వస్తా! (అనుచరులతో) ఈ సత్సంగ్ ఇలాగే నడుస్తుంది. రైదాస్ దీన్ని ఇలాగే నడుపుతూ ఉండండి. ఇప్పుడు గనక జరపకపోతే మరి సమావేశం కానివ్వరు మనల్ని.

బషీరా: (ముందుగు సాగి) కబీర్‌భాయి. అన్ని రకాలా నీకు మేం అండగా ఉంటాం. కాని నీకు మాత్రం హాని కలుగకూడదు. ఈ మతోన్మాదులు, ప్రభువు వీళ్ళంతా బతుకు మీద ఆశ వదలుకునే నీ వెనక పడ్డారనుకుంటాను. ఏ నిమిషానికి ఏం జరుగుతుందో ఏం చేస్తారో చెప్పలేక పోతున్నాము.

కబీరు: (కొంచెంసేపు వెళ్లనా, వద్దా అన్నట్లుగా ఉండి, తనలో తానే నవ్వుకుని బషీరా బుజం మీద చేయి వేసి)

నవ్వుతుండే వాడికి దొరకడు భగవంతుడు.
పొందిన వాడేమో ఏడ్చె.
నవ్వినవాడికి హరి దొరికిన
ఉండడంతకంటె దైర్భాగ్యుడు

(కబీరు, పిల్లవాడు వెళ్లిపోతారు)

రైదాస్: సోదరులారా? మనం ఇంకొంచెంసేపు కూర్చుని వెడదాం. సత్సంగ్ మాత్రం వదలం. రేపు కూడా ఇక్కడికే రండి. సత్సంగ్‌ని గురించి మాట్లాడుకుందాం.

(అంతా కాసేపు అక్కడే ఉండి పాడతారు)

నన్నెక్కడ వెతికేవే మనసా. నేను నీలో ఉన్నానే మనసా.
గుడిలో లేను మసీదులో లేను. లేను లేను కైలాసంలో.

(నేపథ్యంలో కాశీలోని గుళ్ళల్లో గంటలు బాగా కొడుతున్న చప్పుడు వినిపిస్తోంది. మసీదులో ముల్లా ప్రార్థన చేస్తుండటం కూడా)

**(తెర)**

# రెండవ అంకం

## మొదటి దృశ్యం

(తెర లేస్తూనే పీపా, సీనా, బషీరా రోడ్డు వారగా ఉన్న ఓ అరుగుమీద కూర్చుని ఉంటారు)

పీపా: ఒక్క రాత్రిలోనే మహంతు మనుషులు గోరఖ్‌నాధ్ అనుయాయుల్ని 5గుర్ని చంపించారు.

బషీరా: ఎందుకు?

పీపా: ఎందుకేమిటి? అక్కడే ఉంది అసలు చిక్కంతా. రెండు మఠాలు. పక్క పక్కగా ఉండడం మహంతుకఉ ఇష్టం లేదు.

సీనా: రెండు మఠాలకి దగ్గరగా ఉండే సందులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. నేను అక్కడనుంచే వచ్చాను. సాధువులు బలాల్లలతో గోడల వెనక, దేవిడీల్లోను, సందు మొదలలోను నుంచున్నారు. ఏ క్షణాల ఏం జరుగుతుందోనిపిస్తున్నది.

బషీరా: కబీరు అట్లాంటి వాళ్ళతో పెట్టుకోకుండా ఉండాల్సింది.

పీపా: అలా అని ఊరుకుండలేం కదా! సీనా కబీరు స్థానంలో నువ్వు ఉండి ఉంటే కబీరు చేసిందే నువ్వు చేసేవాడివి.

బషీరా: లేదు. కబీరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతాడు. సీనా అలాకాదు.

(నవ్వి, సీనాను అనుకరిస్తూ)

సాధువుగారూ! మీరు నా వీపు మీద కొరడా దెబ్బలు కొట్టండి కాని ఈ అమాయకుల్ని ఏమీ అనకండి. ఏం? సీనా ఇలాగేనా నువ్వు అడిగేది. (మళ్లీ నవ్వి) కబీరయితే ఇట్లా మాట్లాడడు. మనసులోకి ఏది వస్తే అది నిర్భయంగా నిర్మొహమాటంగా పరుషంగా మాట్లాడతాడు.

సీనా: శోభాయాత్రలో అందరూ భంగు తాగి బయలుదేరుతారు. అటువంటప్పుడు వాళ్ళతో పెట్టుకోడం భావ్యం కాదనుకుంటాను.

పీపా: కురుక్షేత్రంలో మహంతు పోట్లాట కేవలం గోరఖ్ అనుయాయులతోనే కాదు. మఠం ఎదురుగా అలగాజనం ఉండే బస్తీ ఉంది. వాల్ళతో కూడా మహంతుకు పేచీయే! వాళ్ళని అక్కడనుంచి వెళ్లగొడదామని చూస్తున్నాడు.

సీనా: నిన్న కబీరు ఆ బస్తీలో తిరుగాడాడు కూడా.

బషీరా: నిజమా?

సీనా: లేకపోతే.

బషీరా: నాకు తెలిస్తే నేనూ వెళ్ళేవాణ్ణే! కబీరు ఒక్కడఏ వెళ్ళాడా యేం?

సీనా: లేదులే! రైదాసుకూడా వెంట వున్నాడు. ఇద్దరూ ఆ బస్తీలో చాలాసేపు కూర్చుని పదాలు పాడి వచ్చారట.

పీపా: కబీరు గురించి నీకేమో చింతకాని నిన్న నువు మాత్రం రంప ఘాట్‌లో ఆ సాధువుతో ఏం

మాట్లాడావు?

సీనా: (నవ్వి) నేను ఆయనతో శాస్త్రాన్ని గురించి వాదిస్తున్నాను.

బషీరా: మరి సందేహాలకి సమాధానం దొరికిందా?

సీనా: సమాధానమా? ఆయన చేతి కర్ర తీసాడు. ఈలోగా చాలామంది సాధువులు కూడా పోగయ్యారులే!

బషీరా: అసలీ పోట్లాటలన్నీ కబీరు పదాల మూలంగానే! వాడికి కవిత్వం పుట్టుకు వచ్చిందంటే దాన్ని జనానికిచ్చి తనిన్ని పుచ్చుకుంటాడు. (నిందలు, దెబ్బలు కావచ్చు) (నేపథ్యంలో కబీరు పాడుతూ వస్తాడు. హృదయాన్ని కదిలించే స్వరం. కబీరు వస్తాడు. తొణక్కుండా, నిర్భయంగా పాడుకుంటూ. నవ్వుముఖం. ఎప్పుడూ ఛలోక్తులతో నవ్విస్తూ ఉండే మనిషి.బుజం మీద తానుబట్ట, చేతిలో ఏక్‌తారా)

కబీరు: (నవ్వి) ఓహో! సమావేశం ఏర్పాటయిందన్నమా.

పీపా: అదేమిటి. ఏదో తీసుకొచ్చినట్టున్నావు?

కబీరు: తానుబట్ట. ఇంకేముంటుంది సోదరా! నిన్న అమ్ముడుపోలేదు. ఇవాళనయినా అమ్మాలి.

బషీరా: నెలరోజులుగా ఈ తాను బుజం మీద ఉంటోంది.

కబీరు: (నవ్వి) అమ్మినప్పుడు చూద్దాం.

బషీరా: అరె! అమ్మడానికే బయలుదేరింది. అమ్మినప్పుడు చూద్దాం అంటావు. అమ్మవా ఏం?

పీపా: నేను తానును గురించి అడగడం లేదు. ఆ చేతిలోది ఏమిటి అని?

కబీరు: (కబీరు ఉత్సాహంగా) (ఏక్‌తారా చూపిస్తూ) ఇది! ఇదే నేను మీకు చూపిద్దామని తెచ్చాను. ఏక్‌తారా. (చెవి దగ్గర పెట్టుకుని వాయిస్తాడు) దీన్ని వాయిస్తూ పదం పాడుతుంటే కలిగే ఆనందం ఓహ్!

పీపా: ఎక్కడనించి తెచ్చావుదీన్ని.

కబీరు: నేను స్వయంగా చేశాను. బాగుంది కదా! నీక్కూడా చేసివ్వనా? అందరం కలిసి కూర్చుని పాడదాం. మనం భగవంతుడొకడే! మన ఏక్‌తారాలో తీగె ఒకటే!

(కబీరు ఏక్‌తారా వాయించి రెండు పంక్తులు పాడతాడు)

పీపా: నిన్న నేను మీ యింటికి వెళ్ళాను కబీరా! కాని మీ నాన్న బయటనించే పంపేశాడు. ఏమన్నాడో తెలుసా. కబీరనేవాడు ఎవడూ లేడిక్కడ అన్నాడు. ఇంక ఇక్కడికి రాకు అన్నాడు. ఇంతలో మీ అమ్మ వచ్చింది. నాయనా కబీరుకు కొంచెం నచ్చచెప్పు. ఈ వాగుడంతా కట్టిపెట్టి మగ్గం నేసుకోమను అని చెప్పింది.

కబీరు: (నవ్వి) నేను మీ ఇంటికి వెళ్లినా జరిగేది అంతే! (ఇద్దరూ నవ్వుతారు) నువ్వు మాయింటికెళ్లావా? అమ్మయినా చెప్పలేదే?

పీపా: ఏం చెపుతుంది. వాళ్ళు నీ పెళ్లి చెయ్యాలనుకుంటున్నారల్లే వుంది.

కబీరు: అమ్మకి ఎప్పటినుంచి సలహాలు చెప్పడం మొదలుపెట్టావ్? చూడు పీపా ఆ బంధాల్లో పడద ల్చుకోలేదు. నిన్ను మా అమ్మ ఎలా బోల్తా కొట్టించి మాట్లాడుతుందంటే నువ్వే నా కోసం సందు సందునా ఇంటింటా పిల్ల ఉందేమో కనుక్కుంటావు. మా అమ్మ సంగతి నీకు తెలియదు.

(ఉన్నట్టుండి భావావేశంతో మునిగిపోతాడు. బాహ్యప్రపంచాన్ని మరిచిపోతాడు)

సీనా: ఏమిటి ఆలోచిస్తున్నావు?

కబీరు: ఏమనా? ఆ బ్రహ్మ మా అమ్మని ఎలా సృష్టించాడా అని. నిజానికి ఆమె నా తల్లి కాదు. నేను ఆమె కొడుకును కాదు. అయినా ప్రతిక్షణం నన్ను కమ్ముకొస్తుంది. (తనలో తాను మాట్లాడు కుంటున్నట్లుగా) తుఫాను వస్తుందా? అప్పుడు తన బక్కచిక్కిన శరీరానికి దగ్గరగా నన్ను తీసుకుంటుంది. అదెలా ఉంటుందంటే పిడుగులు పడితే తనమీదే పడని కబీరు మాత్రం బతికి ఉండాలి అన్నట్లుగా చేస్తుంది. (నవ్వి) తను అణుమాత్రం అయినా అన్ని ఆపదలనుంచి నన్ను రక్షించాలనుకునే నా పిచ్చితల్లి. మా అమ్మ మనసులో వెలిగే దీపం – కొడుకంటే ఉన్న ప్రేమ జ్యోతి. ఆ వెలుగులో ఆమె జీవితమంతా జీవిస్తుంది.

పీపా: ఎక్కడికి పోయావురా ఓ కబీర్! ఏమాలోచిస్తున్నావు నాయనా?

కబీరు: ఏం లేదు ప్రేమ ఉన్న చోట భగవంతుడుంటాడని అనిపిస్తోంది. (ప్రేమ పదం వినిపిస్తాడు)

మదిలోని వికారాన్ని విడు
మంచి గుణాన్ని గ్రహించు
గురువు చెప్పిన మాటవిని
చరణములే శరణ్యమని
అంతరాంతరాలలో ఉన్న
ఓంకారనాదాన్ని
మనసులోకొ జొప్పించిన
ప్రేమ వారికి దక్కునన్న
మాట కబీరు పాడిన పాట.

(రైదాసు ప్రవేశిస్తాడు. చేతిలో చిన్న పెట్టె.)

రా. రా. రైదాస్ ఏమిటో తెచ్చావే! అంత కళాహీనంగా ఉందే మొహం. ఏదో పోగొట్టుకున్నవాడిలా!

(రైదాసు అరుగు మీద పెట్టె పెడతాడు)

రైదాస్: ఇంటినుంచి సెలవు తీసుకున్నాం.

పీపా: ఏం? ఎందుకని? ఏమయింది?

రైదాస్: ఏముంది? బైటకు పోయే దోవ ఇదిరా బాబూ అన్నాడు మా బాబు.

కబీరు: నువ్వు చేసే పన్లకి ఇంతకంటే ఏం చెపుతార్లే వాళ్ళు. (అంతా నవ్వుతారు) ఏమన్నాడు మీ నాన్న?

రైదాస్: అలగా వాళ్ళ బస్తీకి ఎందుకెళ్ళావు నిన్న అనడిగాడు. నిన్న మనమిద్దరం అక్కడ పాటలు పాడాంగా అది ఎవరో ఊది వుంటారు.

కబీరు: బాగానే ఉంది. ఇంక అడ్డేం ఉంది. ఇంకా బాగా తిరుగుదాం. తిరిగొచ్చి ఇక్కడే ఈ అరుగుమీదే పడుకుందాం. నా తలకింద తాను పెట్టుకుంటాను. నువ్వు నీ పెట్టె పెట్టుకో.

సీసా: కురుక్షేత్రపు మహంతు కొత్వాల్‌ని కలవడానికి వెళ్ళాడని విన్నాను.

రైదాస్: ఎందుకంట?

సీసా: ఈ అలగా వాళ్ళ బస్తీని తీయించేయాలని. ఇది మహందు కట్టించిన కొత్త మఠం ఎదురుగా ఉంది కదా! కాని చాలామందికి నిలువ నీడ లేకుండా పోతుంది.

పీపా: ఈ కొత్త కొత్వాలు కానరాని వాడల్లే ఉన్నాడే!

బషీరా: కబీరా! మీ బస్తీలో శోభాయాత్ర రోజున కొరడా దెబ్బలు తిన్నవాడు ఎలా ఉన్నాడు.

కబీరు: ఎట్లా వుంటాడు? మంచం మీద పడి కొట్టుకుంటున్నాడు.

(హరహర శివ శంభు – బమ్ బమ్ బోలానాథ్ అంటూ దమరుక ధ్వనితోపాటు ఒక సాధువు ప్రవేశిస్తాడు. చేతిలో పెద్ద త్రిశూలం ఒక రోజున కొరడా ఝళిపిస్తూ తిరిగిన సాధువే)

కబీరు: ఇదిగో నేను చెప్పిన సాధువు ఈయనే! అనుకున్నామో లేదో ప్రత్యక్షమయ్యాడు. (సాధువుతో) ఇవాళ ఎవరిని వేటాడానికి బయలుదేరారు మహాత్మా! ఆ అమాయకుడి చర్మం వలిచేశారు కదా!

సాధువు: ఏమంటున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? అన్ని కొరడా దెబ్బలు తిన్నా ఇంకా బుద్ధి రాలేదా?

కబీరు: సాధువు వైపు చూసి –

హిందువుల దయ తురకల మెహర్బానీ –
రెండూ పారిపోయిన వేళ...

చెప్పండి మహాశయా. కాశీకి వచ్చారన్నమాట. ఎన్ని రోజులు మకాం. సమయానికి నేను రాకపోతే వాణ్ణి యమలోకం పంపివుందురు. అంత పెద్ద కొరడా ఎక్కడ దొరికింది మీకు. భగవంతుడి పేరు చెప్పి ఇన్ని దురాగతాలా?

చేతిన మాల
నెత్తిన జటాజూటం ఉన్నా
మనసున కత్తి ఉంటే
దొరకడు దొరకడు భగవంతుడు.

సాధువు: (కొంచెం ఆగి) వాడేనా? ఆ నీచజాతి వెధవేనా? ఛండాలుడి కొడుకేనా? ఏం వాడికి మహారాజుగారి వాహనం వస్తోందని తెలియదా?

కబీరు: మాకెలా తెలుస్తుంది ఎవరు ఛండాలురో ఎవరు బ్రాహ్మణులో?

సాధువు: తెలియదేం. మేము గౌడ బ్రాహ్మణులం. 108 రకాలున్న బ్రాహ్మణజాతికంతకి ముఖ్యులం.

కబీరు: నిజమా? (నవ్వి) అయితే. మీ నరాల్లో ప్రవహించేది అమృతమన్నమాట. అవునా? పుడుతూనే నుదుట తిలకంతో పుట్టివుంటారు?

సీనా: పదండి. పదండి. సాధువుగారు. మా వాడితో మీకేమిటి గాని పదండి. మీ పని మీరు చూసుకోండి. (సాధువు వెళ్ళబోగా)

కబీరు: ఇటు విను బ్రాహ్మణుడా!

ఒకే బిందువు – ఒకే మలమూత్రం, ఒకటే చర్మం, ఒకే మర్మాంగం.
అంతా ఒకే జాతి అని చెప్పేవి. బ్రాహ్మణుడెవరు రుద్రుడెవరు.

సాధువు: (వెడుతూ) చాలా వాగుతున్నావు. ఊ....అధిక ప్రసంగం. ఇప్పుడు నిన్ను ముంచేసినా దిక్కులేదు. (వెళ్లిపోతాడు)

సీనా: వీళ్ళతో పెట్టుకోవడం అంతమంచిది కాదు కబీరా!

కబీరు: నిజం చెప్పావు. మా అమ్మకూడా ఇదే చెపుతుంది. కాని నావల్ల కావడం లేదే! నేనేమనకుండా ఉండలేను.

పీపా: ఆ జ్ఞాని నిన్నటినుంచీ నీతో ఏమంటున్నాడు కబీరా?

కబీరు: ఎవరు? రోజుకెంతమందినో కలుస్తుంటాం.

పీపా: 80వ ఘాట్ దగ్గర.

కబీరు: (గుర్తువచ్చినట్లుగా) ఓ ఆయనా! ఆయనతో చాలా సేపు చర్చ జరిగిందిలే! ఆయన్ని – గృహస్థులు, సాధువులు, హిందువులు–ముసల్మానులు అందరికీ కలిపి భగవంతుణ్ణి పొందే మార్గం యేమిటో చెప్పమని అడిగాను. తపస్సు గురించి చెబుతాడు కాని నేనడిగిన దానికి సమధానం లేదు. తపస్సు చేసుకునే అధికారం బ్రాహ్మణ, క్షత్రియులకే కదా ఉంది అన్నాను. అప్పుడాయన జ్ఞానాన్ని గురించి చెప్పడం మొదలు పెట్టాడు. వేద శాస్త్రాలు చదివిన వాడే జ్ఞాని అన్నాడు. నేను వెంటనే నిరక్షరాస్యులు వేదాలు ఎలా చదువుతారు అని అడిగాను. చెయ్యేసి ముట్టుకోకూడదంటారే పంచమ జాతివారిని. తాకినంత మాత్రాన వేదపురాణాలన్నీ అపవిత్రమైపోతాయి అంటారే....అన్నాను.

సీసా: ఊ...తర్వాత.

కబీరు: ఆ మాటతో ఆయనకి బలే కోపం వచ్చింది. వేదపురాణాలు చదివినంత మాత్రాన భగవంతుడు సాక్షాత్కరిస్తాడనే నమ్మకం ఉందా అని అడిగాను. (నవ్వి) నేను నామదేవుడి కథ వినిపించాను. కాశీకి వచ్చినన నామదేవుడు ఓ పండితుడితో కలిసి వేదాలు వల్లె వేస్తున్నాడు. కొన్నాళ్ల తర్వాత మీకు భగవంతుడు దర్శనం అయిందా అని పండితుణ్ణి నామదేవుడు అడిగాడుట. జ్ఞానం ద్వారానే భగవంతుణ్ణి పొందగలమని ఆయన అన్నాట్ట. అందుకు నామదేవ్ “మీరు వృధ్ధాప్యంలో కూడా పరమార్ధనికి బదులు అర్ధాలకి పెడర్ధాలు తీస్తూ కాలాతీతం చేసుకుంటున్నారు. ఇంక భగవంతుడి దర్శనం ఎప్పుడవుతుంది” అని అడిగాట్ట. అందుకాయన కోపగించాట్ట. హిందువులకు–ముసల్మానులకు వేరు వేరుగా ధర్మగ్రంథాలు ఉన్నాయి అన్నాను నేను. అందుకాయన చదవలేని వాడు పూజచేస్తాడు అన్నాడు.

రైదాస్: అయితే!

కబీరు: అప్పుడు నేను మీ కథ చెప్పాను రైదాస్‌జీ. రైదాసు పాటవిన్న ఓ పూజారి మందిరంలోకి వచ్చి నువ్వు హారతి ఇయ్యి అని అడిగాట్ట. రైదాసు మాదిగ అని తెలియగానే కఱ్ఱతో కొట్టి వెళ్ళగొట్టాడు. అందుకని మహాశయా పూజల వల్ల ఇలాంటి సన్మానం తప్ప మరేదో దొరకుతుందనుకోటం కల్ల అని చెప్పాను. (చాలా గంభీరంగా) ఈ ప్రపంచంలో మనిషిని మనిషిగా చూసే ధర్మపరాయణుడే లేడు. అందరూ ఎవరికి వారు విడి విడిగా ఉంటారే తప్ప మైత్రీభావం లేదు. పైగా ఒకళ్లని చూస్తే ఒకళ్లకి పడదు – శత్రుత్వం పెంచుకుంటారు. (ఉత్సాహంగా) నేనో పదం చెబుతావినండి.

అందరూ: చెప్పు. చెప్పు.

కబీరు: (పాట పాడతాడు)

జపతపాల వల్ల – శరీరాన్ని కృశింపచేయడం వల్ల

పంచేంద్రియాలను చంపడం వల్ల భగవంతుడు దొరకడం కల్ల.

ధర్మాన్ని దయతో అక్కున చేర్చుకో. జగుత్తుని పక్కకు నెట్టు.

తన మనుసున్న భగవంతుడిని అందరికి ఎరుక పరచు.

(దూరంగా మసీదులో నుంచి శబ్దాలు వినిపిస్తాయి.)

(కబీరు నవ్వి) అదిగో! ముల్లా వచ్చినట్టున్నాడు అల్లాని మేల్కొలపడానికి!

సీనా: చాల్చాలు. చెప్పింది చాలుగాని ఇహ మాట్లాడకు.

కబీరు: ఓ ముల్లాజీ, ఇంకొంచెం బిగ్గరగా! మీ యీ కంఠం ఏడోలోకానికి వినిపించవద్దూ! (నవ్వుతాడు)

సీనా: చాలు కబీరా. ఎవరైనా వింటే లేనిపోని పోట్లాట.

కబీరు: (బిగ్గరగా) అల్లాకి కూడా బిగ్గరగా వినడం ఇష్టం అల్లే వుంది. భేష్ భేష్ ముల్లాజీ ఇంకొంచెం బిగ్గరగా –

ఇటుకతో కంకరతో కలిపి కట్టిన ఈ మసీదునుంచి

అల్లాని పిలుస్తున్నాడు ముల్లాజీ

ఏం అంత చెమిటి వాడా ఆ అల్లా!

సీనా: (గభాల్న) ఎవరో వస్తున్నారు కబీర్. నే చెప్పానా లేదా!

(మౌల్వీ వస్తాడు. సీనా వచ్చి కబీరు ముందుగా నిలుస్తాడు)

మౌల్వీ: ఎవడా కాఫిల్. ఇక్కడ ఏమేమో వాగుతున్నాడు.

కబీరు: (ఎదురుగా వస్తూ) ఇంకెవడున్నాడు మౌల్వీ సాబ్!

మౌల్వీ: సాలె కబీరా! అల్లానే వెక్కిరిస్తున్నావురా?

కబీరు: పైన అల్లా, కింద మీరు మౌల్వీ సాబ్. నేను మాత్రం ఏమన్నాను. కొంచెం బిగ్గరగా అరవండి ఏడులోకాలకు అవతల ఉన్న అల్లాకి విన్పించాలి కదా అన్నాను. (ఎదురుగా వచ్చి) అల్లా అన్నీ వింటాడు మౌల్వీ సాబ్. ఆయన్ని బిగ్గరగా పిలవాల్సిన అవసరం లేదు. చీమ కాలు కదిపినా వింటాడు అల్లా.

మౌల్వీ: (కోపంతో మండిపడుతూ) నిన్ను ఇహ ఆ అల్లాకూడా రక్షించలేడు. ఇంతకాలం మీ నాన్న నూర్ మొహం చూసి ఊరుకుంటున్నాం. లేకపోతే నిన్ను ప్రాణాలతో పాతిపెట్టేవాడిని. వాడే చేతులు జోడించి ఏడ్చుకుంటూ కాపాడమని వెంటబడతాడు. అందుకే సరే పొమ్మని ఊరుకుంటుంటే – కాని ఇవాళ....ఇప్పుడు...నువ్వు ఇంక తప్పించుకోలేవు.

సీనా: విన్నావా నా మాట!

కబీరు: (నవ్వుతూ) ఇదిలా జరుగుతూనే ఉంటుంది సోదరా!

సీనా: మేమేం చెయ్యగలం కబీరా! నలుగురైదుగురం కంటె ఎక్కువలేము.

కబీరు: సీనా! ఆ అమాయకపు వాడి వీపున ఉన్న కొరడా దెబ్బలు చూసి వుంటే వీళ్ళకిలా భయపడవు. వీపు తూట్లు పడేలా కొట్టారు. వీళ్ళ మూలంగానే వాళ్ళు బతుకులు నరకమైపోతున్నాయి. (లెక్కలేని తనంగా) చింతించకు. జరిగేవి జరుగుతూనే వుంటాయి.

విశ్వాసం ఉన్న మనసునెవరూ చెదరగొట్టలేరు.

కోటి కోటియములైనా ఇసుమంతైనా చెదరగొట్టలేరు.

రండి అందరూ పాడండి:-

నీలో ఉన్న నన్నెక్కడ వెతికేవే మనసా.
గుడిలోనో - మసీదులోనో - లేను లేను
కైలాసంలోలోనో -
క్రియా కర్మలలోనో - యోగి బైరాగులలోను
లేను లేను నే లేను.
నీ శ్వాసలో శ్వాసనై ఉన్న నన్ను తెలుసుకో.

(కబీరు - అనుచరులు పాడుతూ ఉండగా తెర)

**(తెర)**

# రెండవ దృశ్యం

(కాలగా మిగిలిన గుడిసెలను బాగుచేసుకుని ఉంటున్నట్లుగా ఉన్న గుడిసెలు. తెరలేచేసరికి కబీరు భార్య లోఈ, కబీరు ప్రవేశం)

కబీరు: నిన్ను పెళ్లిచేసుకుని ఏం సుఖ పెట్టాను. కనీసం ఉండడానికి మంచి ఇల్లు కూడా లేదు. తగలడగా మిగిలిన ఇల్లు. వసారాలో మగ్గం ఉంది. నాన్న మగ్గం ఇంటి వెనక ఉంది. రెండూ కాలిపోయాయి. ఒక్క వెదురు బద్ద కూడా మిగలకుండా పోయింది. కాని ......నువ్వీ ఇంటికి రాగానే ఏమీ పోలేదని పిస్తోంది. ఇల్లు కళకళ లాడుతున్నట్టున్నది.

(కబీరు నవ్వుతాడు. లోఈ కళ్ళు పైకెత్తి అతన్ని చూస్తుంది. కాని ఏమీ మాట్టాడదు)

నిన్ను తీసుకువద్దామని నేను బైలు దేరుతుంటే, కోడలొస్తోంది. ఇంటి బయట దీపాలు పెట్టాలి. నూనె తెమ్మంది. "ఇల్లూ-వాకిలీ తిన్నగా లేనే లేవు దీపాలెక్కడ పెడతావని" అడిగాను అమ్మని. అంతేకాదు ఈ ఇంట్లో నీకు తెలియనిదేముంటుందని అడిగాను - చూడు - రేపు బషీరా వాళ్ళు వస్తారు. వీలైతే కాస్త గడ్డీ-గాదం వేసి ఇల్లు కప్పుదామన్నారు. (లోఈ మళ్లీ అతనివైపు చూసి తల దించుకుంటుంది) నేను ఇన్ని మాటలు మాట్లాడాను. నువ్వు అసలు నోరే మెదపలేదు. నువ్వు వాడుతావు. కాస్తా వాగుడు కట్టిపెట్టు అంటారు మా వాళ్ళు.

లోఈ: గంగలో స్నానానికి వచ్చినప్పుడు నేను మిమ్మల్ని చూశాను.

కబీరు: అరె! నీకు మాటలు వచ్చుల్లే ఉందే? ఇంకానేను లోఈ మూగది అనుకుంటున్నాను. నన్ను చూశావా? (నవ్వి) నన్ను మాత్రం మూడుసార్లు ముంచేశావు.

లోఈ: నేనప్పుడు గుంపులో ఉన్నాను. మీరు మునిగిపోతారేమోననుకున్నా.

కబీరు: నిన్ను చూడాలని నా మొహాన రాసి పెట్టి ఉంటే ఎలా మునిగిపోతాను?

లోఈ: కబీరునెప్పుడో ఎవరో ఒకరు చంపేస్తారని మా నాన్న అన్నాడు.

కబీరు: పాపం! మీ నాన్న చాలా జాలి గుండ కలవాడల్లే ఉన్నాడే?

లోఈ: మీరు ఇంటినుండి పారిపోయారు కదా!

కబీరు: అయితే నీకిది కూడా తెలుసన్నమాట. నేను అడివిలోకి పారిపోయిన మాట నిజమే!

లోఈ: ఇప్పుడు మళ్ళీ వెళ్ళిపోతారా?

కబీరు: ఉహూ! ఇప్పుడు ఎక్కడికీ పారిపోను.

లోఈ: ఏమో? ఎవరు నమ్మొచ్చారు. అమ్మా-నాన్ననే వదిలి పారపోయిన మీరు నన్ను మాత్రం వదిలి వెళ్లిపోరని నమ్మకం ఏమిటి?

కబీరు: అప్పుడు.....అప్పుడు నాకు మనశ్శాంతి లేదు. అందుకని. నా కళ్లముందు అంతా చీకటే! నాకిప్పుడే తెలుస్తోంది. ఇంట్లో ఉండి - సంసారం చేసుకుంటూ కూడా భగవంతుణ్ణి ఆరాధించవచ్చునని. యోగం - జపతపాలు - అన్నీ ఇంట్లోనే సాధన చేసుకోవచ్చుననిపిస్తోంది.

(లోఈ చాలా ఆదుర్దాగా కబీరు మొహంలోకి చూస్తుంది. నీమా ప్రవేశం)

నీమా: అరె అప్పుడే మొగుణ్ణి కొంగున కట్టేసుకున్నావా?

లోఈ: మనిషి కొరుకుడే పడడం లేదు కొంగునేం ముడేసుకుంటాను.

నీమా: ఏమో అదంతా నాకు తెలియదు. వీణ్ణి మాత్రం ఇంట్లోనే కట్టిపడేసుకో. గారడీనే చేస్తావో – మరేం చేస్తావో.

లోఈ: నాలుగు కాళ్ళ జంతువా – పశువా? ఇంట్లో కట్టి పడెయ్యడానికి? తిని తిరిగే మనిషి కాదా!

నీమా: ఓసి జడ్డి మొహం దానా కట్టెయి అంటే నిజంగా కట్టెయ్యడమా? వాడి బాగోగులు నువ్వే చూసుకో – వేళకింత తిని ఇంటిపట్టున ఉండేట్టు చూసుకోవాలి.

లోఈ: సరే! ఆయన నన్ను చూడాలా ఆయన్ను నేను చూడాలా? ఇంటిని పోషించేది ఆడదా–మగాడా?

నీమా: (నవ్వి, కబీరుతో) ఇది నిన్ను బాగా గుప్పెట్లో పెట్టుకుంటుంది కబీరా. నన్నాడించినట్టుకాదు. ఇహ నీ పప్పులుడకవులే! మంచి గట్టి పెళ్ళామే దొరికిందిలే నీకు. (లోఈతో) కోడలు పిల్లా మా వాడినో ఇంటివాడిని చేశాను – ఇప్పుడు నాకు మనశ్శాంతిగా ఉంది. ఎట్లాంటి ఇంట్లో పడ్డావో చూశావా? (నాలుగుపక్కలా చూస్తుంది)

లోఈ: ఏం ఈ ఇంటికేమయింది?

నీమా: ఓ గోడా – పాడా – ఏమీ లేవు. అన్నీ ధ్వంసం అయిపోయాయి.

లోఈ: ఇల్లు తగలబడిపోతే అవన్నీ ఎక్కడనుంచి వస్తాయి. (కబీరుతో) మీరు సాధువులా ఏం?

(నీమా వెళ్ళిపోతుంది)

కబీరు: (చిరునవ్వు నవ్వి) ఏం అలా కనిపిస్తున్నానా నీకు.

లోఈ: కనిపించడానికి సాలెవాడిలాగే ఉన్నావు కాని మనసులో ఉన్న ఊసు నాకేం తెలుసు. సాధువైతే నన్నెందుకు పెళ్ళాడతావులే!

కబీరు: నేను సాలెవాడ్ని.

లోఈ: అయితే అట్లామాట్లాడతావేం – పుస్తకాలనీ – రాళ్ళనీ...

కబీరు: లేకపోతే ఏం చెయ్యాలి?

లోఈ: భూతవైద్యం తెలుసా? మంత్రాలు – తంత్రాలు తెలుసా?

కబీరు: అయ్య బాబోయ్....నీకివేమీ తెలియవే (నవ్వుతాడు)

లోఈ: అయితే జ్యోతిష్యం చెబుతావా? జన్మ రాశి అవీ చూస్తావా?

కబీరు: లేదే – అవేం చెప్పను.

లోఈ: మరి అందరూ నువ్వు ఆసనాలు అవీ వేస్తావని, ఇంక....

కబీరు: ఆసనాలు వెయ్యడం కాదు....సజ్జ సాంగత్యం – అంటే సాధువులతో కూర్చుంటాను.

లోఈ: అదెందుకు.

కబీరు: నిన్నో రోజు అక్కడికి తీసుకెడతాను. నీకే తెలుస్తుంది. అక్కడికి జనం చాలామంది వస్తారు.

లోఈ: అబ్బో! నేనెందుకు అక్కడికి. అక్కడ అంతా మొగాళ్ళే ఉంటరేమోగా! అక్కడ మీరంతా ఏం చేస్తారు?

కబీరు: భజన చేస్తాం – భగవంతుడిని గురించి మాట్లాడుకుంటాం.

లోఈ: (ఏదో కనిపెట్టినట్టుగా) అదే! అదే నేనిందాక అన్నది. నువ్వు సాధువ్వి. తెలిసిందా.

కబీరు: నేను సాధువును కాను – సాధువులు – ఫకీర్లు పెళ్లి చేసుకుంటారా ఎక్కడైనా?

లోఈ: అదేగా నేనూ అన్నది. సాధువైతే పెళ్ళి చేసుకోకూడదు అని. (ఏదో తట్టినట్లుగా) ఆ! ఇప్పుడు తెలిసింది నువ్వేమో సాధువుగా ఉంటానంటే మీ అమ్మా, నాన్నా పట్టి పెళ్ళిచేశారు అవునా?

కబీరు: నెమ్మదిగా ముందు ముందు నీకు అంతా తెలుస్తుందిలే?

లోఈ: నెమ్మది నెమ్మదిగా ఎందుకు. నాకు అంతా ఇప్పుడే తెలిసింది.

కబీరు: ఏం తెలుసుకున్నావు?

లోఈ: రెండుసార్లు ఇంట్లోంచి అడవుల్లోకి పారిపోయివా లేదా? ఇది నిజమేనా కాదా?

కబీరు: వెళ్ళాను. నీకెలా తెలుసు?

లోఈ: మా నాన్న చెప్పాడు. మా నాన్నకి నువ్వంటే బలే ఇష్టం. నిజం. ఒట్టు.

కబీరు: మీ నాన్న కూడా మాతోపాటు భజన చెయ్యడానికి వస్తాడు.

లోఈ: అయితే....నన్ను ఇంతకు ముందే చూశావా?

కబీరు: (నవ్వి) ఊహూ....చూడలా.

లోఈ: గుర్తు తెచ్చుకో....

కబీరు: చూసిన గుర్తు లేదే.....

లోఈ: గుర్తున్నా చెబుతావేమిటి? సాధువులంతా ఇంతే. నిజం చెప్పవా? నన్ను ఇంతకు ముందు చూడలేదా?

కబీరు: ఊహూ....

లోఈ: నేను ఓ లోటాలో పాలు తెచ్చి ఇచ్చాను నీకు....అది కూడా గుర్తులేదా? (కబీరు ఆలోచిస్తాడు) నిజం చెప్పాలి. అబద్ధమాడకూడదు.

కబీరు: నాకు గుర్తు రావడం లేదు.

లోఈ: పండాలు నీ చేతులు కట్టి గంగలో పడేశారు....గుర్తువచ్చిందా?

కబీరు: ఆ! అదెలా మరిచిపోతాను.

లోఈ: ఆ రోజు నేను నా స్నేహితురాళ్ళతో అక్కడే ఆడుకుంటున్నాను. అప్పుడు అక్కడ చాలా పెద్ద గుంపు ఉంది. వాళ్ళు నిన్ను పడవలో నిన్ను కట్టి పడేసి దాన్ని గంగమధ్యకి వెళ్ళేదాకా తోశారు. వాళ్ళు నిన్ను పడెయ్యడం చూడగానే నా గుండె ఝల్లుమంది. నా స్నేహితురాళ్ళు భయంతో పారిపోయారు. నేను నిన్ను ఆ స్థితిలో వదిలి వెళ్ళలేకపోయాను. నేను నుంచో లేకపోయాను. ఒడ్డున చూస్తూనుంచున్న వాళ్ళందరూ "కబీరు మునిగి చచ్చిపోతాడు" అంటున్నారు. పండాలు పడవని మధ్యదాకా తీసుకువెళ్ళి వదలి ఒడ్డుకొచ్చేశారు. ఒక్కొక్కరుగా అందరూ వెళ్ళిపోయారు. నేను ఒక్కదాన్నే ఉన్నాను.

కబీరు: తర్వాత ఏం జరిగింది?

లోఈ: సాయంకాలం అవుతూ వుండగా నువ్వ ఒడ్డుకు కొట్టుకువచ్చావు. నీ చేతులు కట్టేసి వున్నాయి. మోకాళ్ళలోతు నీళ్ళల్లో నీ చేతులు – వెనక్కి విరిచి కట్టేసిన చేతులతో నువ్వు కొట్టుకువస్తు అది నీ శవమేమో అనుకున్నాను.

కబీరు: (నవ్వి) తర్వాత...

లోఈ: తర్వాతేముంది. మా నాన్న దగ్గరకి పరుగు పరుగున వెళ్ళిచెప్పాను. అప్పుడు మా నాన్న బస్తీలో వాళ్ళందర్నీ తీసుకువచ్చాడు. వాళ్ళంతా సాయంపట్టి నిన్ను బయటికి తీశారు. చచ్చిపోయావేమో అనుకున్నాం. కాని బతికే వున్నావు.

కబీరు: ఊహూ.....

లోఈ: ఊహూ ఏంటి! నువ్వగనక చచ్చిపోయి వుంటే ఇవాళ ఇక్కడ నుంచుని మాట్లాడుకునే వాళ్ళమా? నిన్ను బోర్లబొక్కలా పడుకోబెట్టి తాగిన నీళ్ళన్నీ బయటికి వచ్చేలా చేశారు. రాత్రంతా మా యింట్లోనే ఉన్నావు. అర్ధరాత్రి మా నాన్న నన్ను లేపాడు. లేపి 'ఓ పెద్దగ్లాసు నిండా వేడిపాలు తీసుకురా' అని చెప్పాడు. అప్పుడు నేను తీసుకువచ్చి నీకు ఇచ్చాను....నువ్వేమో నన్నెప్పుడూ చూడనేలేదు అని చెబుతున్నావు.

కబీరు: (ప్రేమనిండిన నవ్వుతో) నీ చేతి పాలు తాగాను కనకనే బతికాను.

లోఈ: అట్లా ఎందుకనుకోవాలి. బతికావు గనకనే పాలుతాగగలిగావేమో? చచ్చిపోయివుంటే ఎలా తాగగలిగేవాడివి?

కబీరు: ఎలా అయితేనేం నేను చావకుండా ఉండడం కదా నీకు కావాల్సింది?

లోఈ: ఉహూ నాకదంతా ఏమీ తెలియదు. అసలు అంతకు మునుపు నువ్వసలు నాకు తెలియవుగా!

కబీరు: ఇప్పుడు తెలిసానుగా?

లోఈ: ఊ.....తెలుసుంటే ఇవన్నీ ఎందుకడుగుతాను.

కబీరు: ఏదో ఒకటి తెలుసా లేదా?

లోఈ: మా నాన్న నిన్ను గురించి ఇంట్లో చెబుతుంటే విన్నాను. అవే తెలుసు.

కబీరు: నన్ను గురించి ఏమనేవాడు మీ నాన్న?

లోఈ: సందుగొందుల్లో తిరిగి పాటలు పాడుతుంటే నిన్ను కొరడాలతో కొట్లారని....

కబీరు: అంతేనా?

లోఈ: ఇంతేనా ఏమిటి? ఎప్పుడు చూసినా విన్నా మా నాన్న నిన్ను గురించి చెప్పడమే! చాలా ధైర్యం గల వాడివని కూడా చెప్పాడు. నువ్వంటే ఆయనకి చాలా దయ.

కబీరు: (నవ్వి) ఏం నీకు లేదా?

లోఈ: నాకెందుకుంటుంది. మా నాన్నకి నువ్వు తెలిసినంతగా నాకు తెలియవుగా? సాలెవాడివి అయివుండి వృత్తి చేసుకోక అడవుల్లోకి పోవడం – పాటలు పాడడం ఇట్లాంటివి ఎందుకు చేస్తావో తెలియడంలా? పైగా అందరితో జగడాలు.

కబీరు: నేనేం పోట్లాడలేదే?

లోఈ: పోట్లాడకపోతే ఊరికే కొడతారా ఏం? మనల్ని ఎవరైనా తిడితేనే కదా మనం వాళ్ళని కొట్టేది. తోవన పొయ్యేవాళ్ళని కొట్టడానికి వాళ్ళేమైనా పిచ్చివాళ్ళా? నువ్వు పిచ్చిగా తిరుగుతుంటావని కూడా అందరూ అంటున్నారు.

కబీరు: నేను నీకు పిచ్చివాడిలా కన్పిస్తున్నానా?

లోఈ: (కబీరును చూసి) నాకేం తెలుస్తుంది? జనం అనుకుంటుంటే వినడమే! పూర్తిగా పిచ్చివాడివి కాక

పోవచ్చు. కాస్త పిచ్చి వుందేమో?

(మేఘాలు గర్జిస్తున్న చప్పుడు)

కబీరు: వాన వచ్చేట్టుంది. బయట నూలు ఉంది. తడిసి పోతుందేమో. నీవెళ్ళి పట్టుకువస్తాను.

లోఈ: (పైకి చూసి) పై కప్పుకూడా లేదు. ఇక్కడ కూడా వాన పడుతుందేమో? (కబీరు బైటకు వెడతాడు) నేను కూడా రానా?

కబీరు: వద్దు. నే తెస్తున్నాలే.

లోఈ: (పైకేసి చూస్తుంది. తల విదిలిస్తుంది. మేఘాల చప్పుడు) ఓ ఇల్లు లేదు – గోడాలేదు. మా నాన్న నన్నీ కొంపలో పడేశాడు. మరీ గుడ్డివాడై పోయాడు – కూతురు ఉండబోయే ఇంటిని గాని – కట్టుకోబోయే మొగుణ్ణి కాని – ఏమీ చూడలా. ఓ పిచ్చి సాధువుని నా మెడకు తగిలించాడు. (కబీరు నూలు తట్ట నెత్తిమీద పెట్టుకువస్తాడు)

కబీరు: ఇల్లు తగలబడిపోయిన దగ్గరనించి మేమంతా అదిగో – ఆ ఆరుబయట ఉంటున్నాం.

లోఈ: ఇంటా–బైటా అనే తేడా ఏముంది ఇక్కడ.

కబీరు: ఇక్కడ గోడవారగా నుంచో – చినుకు విసురుగా పడదు. (పైకప్పు కేసి చూసి) ఇక్కడ అడ్డంగా ఏమన్నా పెడదాం. నీళ్ళు అంతగా పడవు. బషీరా రెండు మూడు రోజుల్లో ఇల్లు కప్పుతానన్నాడులే.

లోఈ: కొంపా, గోడూ లేనప్పుడు పెళ్ళెందుకు చేసుకున్నావయ్యా? ముందు ఇల్లు కప్పించుకున్న తర్వాత నన్ను తీసుకురావల్సింది.

కబీరు: బాగానే చెప్పావుగాని....(కాస్త ఆగి) ఇక్కడికి ఎందుకు వచ్చావని కష్టంగా ఉందా?

లోఈ: లేకపోతే ఇష్టంగా ఉందనుకుంటున్నావా? ఎవరైనా కాస్త నీడపట్టున ఉంటారు. మనమో? మనకి గుడిసె ఉంటేగా వానకురవడానికి?

కబీరు: మా యింట్లోనూ కురిసేదికాదు – గుడిసె తగలబడి పోయిందిగా.....బాగుచేస్తే వాన కురవమన్నా కురవదు. (కాస్త ఆలోచించి) లోఈ–

లోఈ: ఏంటీ.

కబీరు: మీ నాన్న నీకు బలవంతంగా పెళ్ళిచేశాడు కదూ! నేనంటే నీకిష్టం లేదు కదూ!

లోఈ: మంచి ప్రశ్నే వేశావు. వేరే చెప్పాలా ఏం?

కబీరు: అదేమిటి?

లోఈ: మా నాన్న నన్నడిగి చేశాడా ఏమన్నానా?

కబీరు: నేనడిగి ఉంటే? (లోఈ ఊరుకుంటుంది) చెప్పు – మెదలకుండా అయిపోయావేం? నేనడిగి ఉంటే ఏం చేసేదానివి.

లోఈ: ఎప్పుడు? పెళ్ళి అయిన తర్వాతనా అడిగేది? అయినా అడిగావు కనుక చెబుతున్నా విను – చెప్పనా?

కబీరు: చెప్పు.

లోఈ: మా యింటి వెనక ఓ షావుకారు కొడుకు – అందంగా ఉంటాడు – వాడంటే నాకిష్టం. నన్ను పెళ్ళి కూడా చేసుకుంటానన్నాడు.

కబీరు: ఊ!

లోఈ: నాన్న అడిగిఉంటే చెప్పేదాన్ని వాడంటే నాకు ప్రేమ వాణ్ణే చేసుకుంటాను అని. మన పెళ్లి ఆ అబ్బాయికి తెలిసింది. మనిద్దరం ఎక్కడికన్నా వెళ్ళిపోదాం అన్నాడు. వెళ్ళిపోతే మాత్రం ఎవరికి తెలిసేది?

కబీరు: వాడిని పెళ్ళిచేసుకుందామనుకున్నావా?

లోఈ: లేకపోతే. నాకు వాడు బాగా తెలుసు. నన్ను కూడా వాడు బాగా ఎరిగిన వాడు. నువ్వు నాకసలు తెలియదు.

కబీరు: (ఆలోచిస్తూ ఉంటాడు) చాలా అనర్థం జరిగిందే!

లోఈ: అందుకు నిన్ను నేను తప్పుపట్టడంలేదు. మా నాన్న నీకిచ్చు చేశాడు. నేను ఇక్కడికి వచ్చాను. అంతే.

కబీరు: ఇంతకు మునుపు నా దోషం ఏమీ లేకపోయినా ఇహముందు నిన్ను ఇక్కడే ఉండమనడం తప్పే అవుతుంది.

లోఈ: (కబీరు వైపు చూస్తుంది) అయితే ఏం చేస్తానంటావ్.

కబీరు: నువ్వు అతని దగ్గరికి వెళ్ళిపో. అక్కడైతే నీకు హాయిగా ఉంటుంది. నువ్వీ విషయం ఇక్కడికి రాకమునుపు చెప్పివుంటే అసలు నిన్ను ఇక్కడికి తీసుకువచ్చే వాణ్ణేకాదు.

లోఈ: ఈవానలో – రాత్రిపూట – ఒంటరిగా అతని దగ్గరకు వెళ్ళనా? ఎలా వెళ్ళగలను.

కబీరు: పారిపోయి ఉండినా ఒక్కదానివే పారిపోయేదానివి కాదా? అయినా ఇప్పుడలా పంపుతానా? పద నేనే దింపి వస్తాను.

లోఈ: ఎక్కడ?

కబీరు: అదే! ఈ షావుకారు కొడుకు దగ్గర. వాడు "నా దగ్గరకి పారిపోయిరా" అని అననే అన్నాడుగా!

లోఈ: (కంగారుగా, నమ్మలేనట్టుగా) నువ్వు నన్ను దింపి వస్తావా?

కబీరు: ఏం చెప్పానో అదే చేస్తాను. నీ అంతట నువ్వు వెళ్ళాలనుకుంటే వెళ్ళు. లేదా నేను తీసుకువెళ్ళి దింపివస్తాను.

లోఈ: నిజంగా నువ్వు నన్ను దింపివస్తావా?

కబీరు: నిజమే చెబుతున్నా. నీకేం బెంగ అక్కర్లేదు. పద. దింపివస్తాను. (లోఈ ఆశ్చర్యంగా చూస్తూ ఉంటుంది) తీసుకో నీ సామాన్లు. ఏమేం తెచ్చావో అవన్నీ తీసుకో.

లోఈ: కాని వాన వస్తోందే?

కబీరు: (లోఈ సామన్లన్నీ ఒక దగ్గరకు చేరుస్తూ ఉంటాడు) ఈ పెట్టె.... అవీ.... ఈ పెట్టెలో నీ నగలున్నాయి. ఇవన్నీ నేను రేపు తీసుకువస్తాను.

లోఈ: ఇంక ఆ నగల నావి ఎలా అవుతాయి. అవన్నీ అత్తారు పెట్టినవే.

కబీరు: నీ పెళ్ళివే కదా! ఎక్కడున్నా సరే అవి పెట్టుకో. (ఆకాశం వైపు చూసి) తుపర కాస్త తగ్గింది. పద పోదాం.

లోఈ: మీ అమ్మతో ఏం చెబుతావు?

కబీరు: నేనచ్చచెబుతాగా.

లోఈ: నిజంగా నన్ను తీసుకెళ్ళిపోతావా?

కబీరు: అరె! నమ్మకం కుదర్లేదా? వానలో ఒక్కదాన్నే ఎలా పంపుతాను –

(కబీరు వైపు తిరిగి చూస్తుంది లోఈ)

లోఈ: నా అంతట నేను వెళ్ళగలను. నువ్విక్కడే ఉండు.

కబీరు: నేరావడం ఇష్టం లేకపోతే ఒంటరిగా వెళ్ళిపో. నీ వెనకాల వస్తా నేను. నువ్వు షావుకారు ఇంటకిఇ వెళ్లగానే నేను వెనక్కి తిరిగివచ్చేస్తాను.

లోఈ: నే వెడతాను. నువ్విక్కడే ఉండు. (వెనక్కి తిరిగి) మా నాన్నకి అంతా చెప్పు. నేను వెళ్ళమంటేనే వెళ్ళింది అని చెప్పడం మరిచేవు.

కబీరు: అలాగే చెపుతా.

లోఈ: నీకో మాట చెప్పాలని ఉంది. చెప్పనా.

కబీరు: చెప్పు.

లోఈ: ఎవ్వరితో జగడాలు పెట్టుకోకు. నువ్వు కొరడా దెబ్బలు తిన్నావని తెలిస్తే నా మనసుకి కష్టమనిపిస్తుంది. నేనెప్పుడైనా నిన్ను చూడడానికి వస్తాను. (పైకి చూసి) ఈ వసారా బాగు చేయించుకో.

కబీరు: (నవ్వి) అలాగే! బాగు చేయించుకుంటాను. మళ్ళీ మబ్బులు కమ్ముకొస్తున్నాయి. తొందరగా పద.

లోఈ: నువ్వు నాతో రామాక.

కబీరు: ఎందుకని?

లోఈ: నిన్ను నాతో చూశాడంటే షావుకారు కొడుకు ఏమనుకుంటాడు?

కబీరు: సరే అయితే వెళ్ళిరా.

(లోఈ వెళ్ళిపోతుంది. వసారాలోని స్తంభాన్ని ఆనుకుని బయట చీకటిలోకి చూస్తూ ఉంటాడు కబీరు. కొంతసేపయ్యాక లోఈ తిరిగి వస్తుంది)

కబీరు: అరె! నువ్వా! తిరగి వచ్చావేం? ఏం ఏమన్నా మర్చిపోయావా?

లోఈ: నేనెక్కడికీ వెళ్ళను.

కబీరు: కాని లోఈ నీకు అతనంటే ప్రేమ అన్నావు.

లోఈ: నేను ఇక్కడ నీతోనే వుంటాను.

కబీరు: ఇక్కడ నుంచుని తడిసిపోతున్నావు.

లోఈ: చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళు.

కబీరు: (చెయ్యి అందిస్తాడు. అతని చెయ్యి పట్టుకుని లోపలికి వస్తుంది లోఈ) తిరగివచ్చావు ఎందుకు?

లోఈ: రావాలనుకున్నాను వచ్చాను. నీ యింటికి అసలు రాకుండా ఉంటే వేరే సంగతి. ఒకసారి వచ్చాక... వచ్చేశానంతే...నిన్ను వదిలి ఎక్కడికి వెడతాను. ఈ జీవితం నీతోనే వెళ్ళమనవీ – జరిగేదేదో జరక్క మానదు.

కబీరు: నా దగ్గర నీకివ్వడానికి ఏమీ లేవు లోఈ.....

లోఈ: అరె! నేను నిన్ను ఏమైనా ఇమ్మని అడిగానా? మరి.....

కబీరు: మరి ఏమిటి?

లోఈ: ఇప్పుడు నా అంతట నేను నీ దగ్గరికి వచ్చాను. మొదట నాన్న పెళ్ళిచేసి పంపాడు. ఇప్పుడు నేను నువ్వు కావాలనుకుని వచ్చాను. నీ చెయ్యందించావు. దాన్ని ఆసరగా చేసుకుని నేను లోపలికి వచ్చాను.

కబీరు: (భావావేశంతో) నేను నిన్ను బలవంతంగా తిరిగి రప్పించినట్టనిపిస్తోంది.

లోఈ: అనిపిస్తే అనిపించింది. బలవంతం చేశాననిపించడంలో తప్పులేదులే! అయినా నా అంతట నేను వచ్చాను అని అంటే వినవేం. దోవలో నాకేమనిపించిందంటే...

కబీరు: ఏమనిపించింది?

లోఈ: నేను వెళ్ళిపోయానని తెలిస్తే జనం నిన్ను ఎగతాళి చేస్తారు. అది విని నేనెలా సహించగలను. మళ్ళీ నిన్ను జనం కట్టేసి గంగలో పడేస్తుంటే నేను షావుకారు అరుగుమీద నుంచి చూస్తూ కూర్చుంటానా?

కబీరు: ఇంత త్వరగా మనసుని ఎలా మార్చుకోగలిగావు లోఈ. ఈ క్షణాల ఒకటి మరుక్షణాల మరోటి.

లోఈ: మనసులో మార్పు ఎంతసేపట్లో రావలేం? నీతోనే ఉండాలని పించింది. ఇందులో నీ బలవంతం ఏమీ లేదులే. నువ్వు చాలా నిజాయితీ గలవాడివి. ఒకసారి నిన్ను చూశాక మళ్ళీ ఎలా వదిలి పెడతాను. (కబీరు వంక స్నేహపూరితంగా చూస్తుంది)

కబీరు: ఒక్కసారి కళ్ళు మూసుకో.

లోఈ: ఎందుకు?

కబీరు: నీకోటి చూపిస్తా.

లోఈ: నేను కళ్ళు తెరుచుకునే ఉంటాను – చూపించు – నాకు సాధువులంటే చాలా భయం.

కబీరు: నువ్వు కళ్ళు మూసుకోముందు.

లోఈ: ఊహూ. నువ్వు నన్ను ఒదిలి పారిపోతే.

కబీరు: నేనెందుకు పారపోతాను. కళ్ళు మూసుకో చెబుతాను. నేను చెప్పేదాకా కళ్ళు తెరవకూడదు తెలుసా.

లోఈ: ఊహూ కళ్ళు మూసుకోను.

కబీరు: అయితే సరే. ఆ పక్కకి తిరిగి నుంచో.

(లోఈ వెనక్కి తిరిగి నుంచుంటుంది. కబీరు నెమ్మదిగా పెట్లోంచి ఎర్ర రంగు బట్ట తీసి లోఈ మీద కప్పుతాడు)

లోఈ: ఏయ్ ఏమిటిది.

కబీరు: నేను నీకోసం కావాలని నేసినది.

లోఈ: (అది భుజంమీంచి తీసి) నిజంగానా? నీకోసమే నేశావా? (దాన్ని తమకంతో మళ్ళీ కప్పుకుంటుంది) అరె! నిజంగా నీ చేతుల్తో నువ్వు నేసిందేనా?

కబీరు: ఇది నీకు చాలా నప్పింది. మగ్గం మీద నేశాను. ఇది నేస్తూనే ఎన్నో పాటలు కూడా అల్లాను.

(లోఈ బట్టని కప్పుకుని, తీసేసి, కప్పుకుని ప్రేమగా చూస్తూ ఉంటుంది. కబీరు లోఈని స్నేహపూరితంగా కావలించుకుంటాడు. వాన బాగా కురుస్తున్న చప్పుడు. మొత్తం కప్పంతా పడిపోతుంది)

ప్రేమరసంతో తడిసింది ఓణీ
హరితి తీసుకుని ప్రియునికై పూబోణి
వెతకబోయింది ఎటకో వలపుల రాణి

**(తెర)**

# మూడవ దృశ్యం

(కాయస్థుడు దర్బారు దుస్తులు వేసుకుని వుంటాడు. శాయిరీలన్నా కవితలన్నా చెవికోసుకుంటాడు. ఇతను 1, 2 దృశ్యంలో చూశాం)

కాయి: నువ్వు నీ ప్రతిభని గుర్తించు కబీర్. నువ్వు కవివి, గాయకుడివి. భగవంతుడు నీకో విలక్షణమైన ప్రతిభనిచ్చాడు.

కబీరు: అయితే నేనేం చేయాలో ఆజ్ఞాపించండి.

కాయి: ప్రతిభని సందుగొందులకే పరిమితం చెయ్యకు. అది విలువైన వజ్రం లాంటిది. దాన్ని నువ్వు అతి జాగ్రత్తగా పదిలపరచాలి.

కబీరు: చిత్తం.

కాయి: నువ్వు చెయ్యాల్సిందల్లా కవిత్వం చెప్పడం – కవిత్వం చెప్పడమేనన్నమాట.

కబీరు: చిత్తం.

కాయి: నువ్వు ముందు కవిత్వపు లక్షణాలన్నీ తెలుసుకో. నీ భాష అంతా కలగాపులగంగా ఉంది. ఒకచోట రాజస్థానీ, మరోచోట పంజాబీ. నీకు ఛందస్సును గురించిన జ్ఞానమే లేదు.

కబీరు: మీరు చెప్పింది నిజమే!

కాయి: నువ్వేమో కాయితం వద్దు, కలం వద్దు అంటావు. ఇది కవిత్వం చెప్పేవాడి లక్షణం కాదు. కవిత్వం చెప్పాలనుకున్నప్పుడు దాని లక్షణాలని తెలుసుకోవాలని అనిపించాలి. ఛందస్సు, లయ, జ్ఞానం లేని కవిత్వమేం కవిత్వమయ్యా?

కబీరు: నేను కవిని కాను. మనస్సులో తట్టిన భావాన్ని బయటకు చెబుతాను అంతే.

కాయి: అందుకే చెబుతున్నాను. నీ కవిత్వంలో నువ్వో ప్రతిభగల కవివి కావచ్చు. శ్రమిస్తే బాగా రాయగల్గుతావు. లేదా నీ తెలివి తేటలు బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

కబీరు: అంటే –

కాయి: అదే అందరినీ విమర్శించడం. తప్పులు పట్టడం – ధర్మా ధర్మాలను గురించి చెప్పడం. ఇది కవులు చేసేపని కాదు. కవి సాధనంతా సరస్వతి చరణాలవిందాలను సేవించడమే! అంతేకాని సందుగొందుల్లో తిరిగి పదాలు పాడడం కాదు. కవి చెవుల్లో స్వర్గంలోని అప్సరసలు తమ తమ మధుర స్వరాలు వినిపిస్తారుట.

కబీరు: ఆహా – ఎంత బాగుందీ. (నవ్వుతాడు)

కాయి: నేను కవిని కాదనుకో. అయినా కవిత్వం రాయాలన్న తపన. అందుకే నిన్ను గురించి అంత యావ. నాకు ఏమీ బాదరబందీలు లేకుండా ఉంటే నేను కూడా కవినయ్యే వాడిని. అంటే పూర్తిగా కవిని కానని కాదనుకో. చిన్నప్పుడు ఏదో కవిత్వం గిలికే వాణ్ణి. ఇప్పటికి కూడా ఉన్న జంజాటాలని వదుల్చుకుని, పిల్లలు ఓ దారికొచ్చాక, ఆస్తిపాస్తుల పంపకాలు అయ్యాక తీరిగ్గా కూర్చుని కవిత్వం రాయాలని ఉంది.

కబీరు: చిత్తం.

కాయి: అందుకే సాధన చెయ్యమని నీకింతగా చెపుతున్నా. నువ్వు చెప్పే కవిత్వం బాగున్నా భాష మాత్రం పల్లె భాషలా ఉంది. ఛందో దోషం ఉదాహరణకి – వేద గ్రంథాలు చదివే ముల్లాలు మౌలానాల పండితులు – అన్నావు. మౌలానా అనే చోట ఇంకో శబ్దం వాడితే బాగుండేది. అట్లాగే బేగరి నామం చేయండి. నేనా మాట ఇంతవరకు వినలేదు. వ్యావహారిక భాష కవిత్వానికి పనికే రాదు. ఆ సంగతి తెలుసుకో. కవిత్వపు భాష వేరే. నువ్వేమో "సంస్కృతం చీకటి కూపం. భాష ప్రవహించే నీరులా ఉండాలి" అన్నావు. శుద్ధ తప్పు. నిజానికి భాష నిర్మలమైన నీళ్ళలా ఉండాలనుకో. పల్లెటూరి భాషలో కవిత్వం ఎవరూ చెప్పరు.

కబీరు: చిత్తం. (నవ్వుతాడు)

కాయి: ఇదంతా నువ్వు ఆ విమర్శించడాలు విడిచిపెట్టిన నాడు దివ్యంగా చెయ్యగలుగుతావు. ఆ రోజు మసీదు మెట్ల మీద కూర్చుని అవాకులు – చవాకులు పేల్తున్నావు. అది చాలా పొరపాటు. ఇది కవులకు శ్రేయస్కరం కాదు. అందుకే నీ ప్రతిభని గుర్తించి దానికి తగ్గట్టు హుందాగా ప్రవర్తించమంటున్నాను.

కబీరు: (నవ్వి) ఇంకేమయినా చెపుతారా.

కాయి: పెద్ద – పెద్ద వాళ్ళతో, పలుకుబడి ఉన్న వాళ్ళతో నీ స్నేహాన్ని పెంచుకో. మహారాజుగారి కొలువులో కవిత్వం బాగా చెప్పేవారున్నారు. నీ కవిత్వాల్లోని మంచిని ఎన్నుకుని వినిపించు. అప్పుడు చూసుకో – మహారుజు చెయ్యి మాత్రమే నీ వీపుని నిమురుతుంది. నీకు సన్మానం – రాజసన్మానం కలుగుతుంది. నువ్వు ఏదో ఒక రోజున ఆస్థాన కవివి అవుతావు.

కబీరు: చిత్తం.

కాయి: కలుస్తూ – వస్తూ పోతూ ఉంటేనే పనులు జరుగుతాయి. నేను నీకు తోడుగా ఉంటాను. ఎవరికైనా ఏమన్నా చెప్పాలన్నా, చెప్పించాలన్నా నన్ను మరువకు. కొత్వాలు కూడా నాకు బాగా పరిచయస్తుడే! చాలా చెప్పుకోదగ్గ మనిషి.

కబీరు: చిత్తం.

కాయి: సమయం వచ్చినప్పుడు కొత్వాలుకు నిన్ను గురించి చెపుతాను. అట్లాంటి పెద్ద వాళ్ళ అండదండలున్నాయంటే నీయింటి ముందు ఏనుగు అంబారీలు నిలబడవా?

కబీరు: ఆహా – ఆహా –

కాయి: ఒక్కసారి ప్రతిష్ఠ, మర్యాద పెరగడం మొదలైతే...ఓహ్ నువ్వప్పుడు హిందువుల్ని తిట్టినా తురకలని తిట్టిని నిన్ను అనేవారుండరు.

కబీరు: నేనెవర్నీ తిట్టడం లేదు కదా!

కాయి: ఇద్దరికీ నీమీద కోపమే! ఇది తెలుసుకోలేనంత అమాయకుడివా? తెలివిగలవాడవైతే ఒకళ్ళతో విరోధం పెట్టుకున్నా మరొకరితో సఖ్యంగా ఉండాలి. నీకు అదీ లేదు ఇదీ లేదు – అందరితోను పోట్లాటలే!

కబీరు: నాకు శత్రువులెవరూ లేరు.

కాయి: ఒకసారి ఒకర్ని మరోసారి మరోకర్ని సమర్థిస్తూ పో – పోట్లాటే ఉండదు. ఇద్దరితోను లాభం పొందవచ్చు.

కబీరు: (నవ్వుతాడు)

కాయి: గాలి ఎటు వీస్తున్నదో చూడాలి. ఉధృతమైన గాలికి తలవంచిన గడ్డిపరక మళ్ళీ తల ఎత్తుతుంది. పెద్ద చెట్టు కూకటివేళ్ళతో సహా కూలిపోతుందని గుర్తుపెట్టుకో.

కబీరు: మాకివన్నీ ఏం తెలియవు ప్రభూ. మేము పిచ్చివాళ్ళం. మమ్మల్నిలా బతకనివ్వండి. ఏదో నోటికి వచ్చినట్లు వాగుతుంటాం. మీరే పట్టించుకోకండి.

కాయి: అహ అలా అంటే ఎలా? నీ క్షేమం కోరేవాణ్ణి. అందుకే నీ సత్తానెరిగి ప్రవర్తించమంటున్నాను. ఒక్కొక్కప్పుడు వాదం నాకే బోధపడదు.

కబీరు: ఏం వాదిస్తున్నాను?

కాయి: ఇప్పుడు ప్రేమ గురించి – తర్వాత భక్తి గురించి బెబుతావు. అవి రెండే నువ్వు చెప్పదలుచు కున్నదయితే ఎవరి పద్ధతిని వాళ్లని అనుసరించనీ. దానికోసం తమ తమ ధర్మాన్ని వదులుకో అక్కర్లేదు. ధర్మాన్ని వదులుకొని భక్తి మార్గంలో నడవండి అని నువ్వు చెప్పే మాట నాకందటం లేదు.

కబీరు: అది మీరు తెలుసుకోవాలనుకున్నా తెలుసుకోలేరు ప్రభూ.

కాయి: ముస్లిమ్‌ని ముస్లిమ్‌గానే ఉండనీ – హిందువును హిందువుగానే ఉండనీ, సాలెవాడిని సాలెవాడిగానే ఉండని. ముగ్గురూ ఎవరికి నచ్చిన భగవంతుణ్ణి వాళ్ళు కొలుస్తారు. ఇది అసంభవం అంటావా?

కబీరు: ముగ్గురూ నిజమైన భక్తులైతే ఫర్వాలేదు. కాని ముగ్గురు ఒకరికొకరు శత్రువులు. ముగ్గురూ ఒకచోట కూర్చుని భగవంతుణ్ణి ధ్యానించలేరు.

కాయి: వాళ్ళని విడి విడిగా ప్రార్థించుకోనీ. బ్రాహ్మణుడు సాకారమూర్తిని పూజిస్తాడు. ముస్లిమ్ నమాజ్ చేసుకుంటాడు. నిర్గుణ నిరాకార ఉపాసకులు వారి భగవంతుణ్ణి , ప్రేమే భగవంతుడి రూపం అనుకున్న వాళ్ళని వాళ్ళ వాళ్ళ ఇష్టాను సారంగా ప్రార్థించుకోనీ.

కబీరు: బ్రాహ్మణుడికి కబీర్ భాయి అంటే గిట్టదు. ముల్లా బ్రాహ్మణణ్ణి కాఫిల్ అంటాడు. కాని ముగ్గురూ భగవంతుడి భక్తులే! వాహ్. భలే!

కాయి: అవాకులు –చవాకులు పేలకు కబీర్. భగవంతుణ్ణి ప్రేమించగలిగిన వాడు మనిషిని ప్రేమించలేడా?

కబీర్: బ్రాహ్మణుడు బ్రాహ్మణుణ్ణి, ముస్లిము ముస్లిమును మాత్రమే మనుషులుగా చూస్తారు. కాని వారిద్దరూ కలిసి నన్ను ఎందుకూ పనికిమాలిన వాణ్ణిగా చూస్తున్నారు.

కాయి: లేదు లేదు. నువ్వు పొరబడుతున్నావు.

కబీర్: నేను వాళ్ళని నా అక్కున చేర్చుకోవాలనుకుంటాను. అవి వాళ్లకి సమ్మతమా. వాళ్లు నన్ను అలాగే కావలించుకోగలరా.

కాయి: (మనసులో లేచే అలజడిని ఆపుతూ) అసలు సంగతి అదికాదు. భగవంతుడు వాళ్ళని, నిన్ను కూడా తన బిడ్డలుగానే భావిస్తాడు.

కబీర్: వాళ్ళ భగవంతుడు నన్ను తన బాహువుల్లోకి తీసుకోడు ప్రభూ. వాళ్ళనే తీసుకుంటాడు. అటువంటి

అప్పుడు సమానత్వమెక్కడ?

కాయి: అందుకని అందరూ ఒకేచోట కూర్చుని సమావేశమవడం తప్పనిసరి అని నీ ఉద్దేశ్యమా?

కబీర్: నేను చెప్పేది కూడా కొంచెం వినండి ప్రభూ! నేను నీచజాతి వాణ్ణి. చదువు రాని వాణ్ణి. అయినా ఇతరులు ఏం మాట్లాడుతున్నారో గ్రహించుకోగల శక్తి ఉంది. వాడు బ్రాహ్మణుడు వీడు ముస్లిము అన్న దృష్టి ప్రజల్లో ఉన్నంతకాలం ఒకరినొకరు మానవత్వపు దృష్టితో చూడరు. నేను మనిషిగా చూడడం కోసం గుడి-దేవుడు, వేదాలు-పురాణాలు, కర్మలు-అనుష్ఠానాలు, మసీదు-అల్లా, రోజా -నమాజ్ అన్నీ వదులుకుంటున్నాను. నేను మనిషిని కేవలం మనిషిగానే చూడదల్చుకున్నాను.

కాయి: చూడు కబీర్ ఇది కాశీపట్టణం. అట్లా మాట్లాడావంటే నిన్ను నల్లిని నలిపినట్టు నలిపేస్తారు. ఇక్కడ రాజు హిందువు. కొత్వాలు ముస్లిము. లోడీ చక్రవర్తి ప్రతినిధి అతను. మరి నువ్వో - నువ్వు ఓ మామూలు - బీద సాలెవాడివి.

కబీరు: కొత్వాలు గారు మిమ్మల్ని నాదగ్గరికి పంపినట్టు ఉందే మీ ధోరణి చూస్తుంటే.

కాయి: ఊహూ...అబ్బె...అదేం లేదు. నన్నెవరో పంపలేదు. నేనేదో నీ మంచి కోసమని చెపుతున్నాను.

కబీరు: మీ మనసులో ఉన్నమాట ఏమిటో స్పష్టంగా చెప్పండి. అసలు నా దగ్గరకు వచ్చిన కారణం ఏమిటి?

కాయి: ఆ! నేనేదో సూచన ప్రాయంగా నీకో మాట చెపుదామని.

కబీరు: దేన్ని గురించిన సూచన?

కాయి: అంతగా ప్రాధేయపడుతున్నావు కనుక చెపుతున్నాను విను కబీర్. ఢిల్లీ పాదుషా సికిందర్‌లోడీ ఇక్కడికి రాబోతున్నారు. బీహార్‌ను జయించిన తర్వాత వారు ఢిల్లీ వేంచేస్తున్నారు. మధ్యలో ఇక్కడ విడిది చేస్తారు. ఇక్కడి ప్రభువులు ఆయన వచ్చేసరికి నువ్వు ఇక్కడ ఉంటే గొడవలు జరుగుతయ్యేమో అని శంకిస్తున్నారు.

కబీరు: (నవ్వి) మహంతుల వారి దగ్గర ఫిరంగి గుళ్ళు - మందుగుండు సామను ఉంది. మసీదు వాళ్ళ దగ్గర కత్తులు, ఏనుగులు, గుర్రాలు, బల్లేలు ఉన్నాయి. నా దగ్గర నా ఏక్‌తారా తప్ప ఏమీలేదు. అటువంటి ప్రభువులు నా బోటివాణ్ణి గురించి పోట్లాటలు లేవదీస్తారేమోనని భయపడడం ఏమిటి ప్రభూ!

కాయి: సమ్రాట్ సికిందర్‌లోడీ ఉన్నంతకాలం నీ సత్సంగాలు, సమావేశాలు అన్నీ వదిలెయి.

కబీరు: బలే బాగుంది. వారు వేంచేస్తుంటే నేనెందుకు అవన్నీ మానుకోవాలి!

కాయి: ప్రభువులవారు ఇక్కడ ఉండగా నువ్వు పదాలు పాడుతూ సందులు గొందులు వెంట తిరగరాదు. చర్చలు - వాదోపవాదాలు జరుపరాదు.

కబీరు: సత్సంగం మాత్రం ఉంటుంది. దానిలో మేమంతా కలిసి భజన చేస్తాం. కవిత్వమూ వినిపిస్తాను. వీధుల వెంట తిరిగి పదాలు పాడుతాను.

కాయి: ఆలోచించుకో. నేను నీ మంచికోరే అంతా చెబుతున్నాను. ముల్లాలకి, పండితులకి కోపం తెప్పించడం వేరు. కాని ఇది ప్రభువుల వారితో పని. వారికి ఆగ్రహం తెప్పిస్తే ఏమయిపోతావో ఊహించుకో.

కబీరు: సత్సంగం ఉంటుంది. భజన చేస్తాం ప్రభూ!

కాయి: సత్సంగం ఏర్పాటు చేసేముందు నీ గుడిసె తగలడింది గుర్తుందా!

కబీరు: తెలుసు.

కాయి: (కంపితుడై) ఇంత హఠం చెయ్యడానికి సాహసిస్తున్నావు. నువ్వేం గొప్పవాడివనా ఆ మిడిసిపాటు. నీ అంతస్థు ఏమిటో గుర్తుతెచ్చుకో. నిన్ను రక్షిద్దామనే నేను వచ్చాను. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వేమిటో తెలుసుకుని మాట్లాడు.

కబీరు: (నవ్వి) సత్సంగం జరుగుతుంది ప్రభూ!

కాయి: సరే! నేను చెప్పాల్సింది ఏదో నేను చెప్పాను. ఆపైన నీ ఇష్టం.

కబీరు: (నవ్వి)

కబిరా చేతిలో కర్రతో నిలబడ్డాడు వీధిలో
తగలబడిన ఇళ్ళ వాళ్ళందరూ రావచ్చు నావెంట

కాయి: నీవెంట ఎవ్వరూ రారు. అది గుర్తుపెట్టుకో. (వెళ్ళడానికి ఉద్యుక్తుడౌతాడు)

కబీరు: (భావావేశంతో)

నేనొక ఉన్మత్తి ప్రేమికుణ్ణి
తెలివితో పని యేమి?
ఈ ప్రపంచంలో స్వేచ్ఛాజీవిని
నాకెవరితోను అక్కర్లేదు స్నేహం
ప్రేమే ఈ జగమంతా నిండె
ప్రపంచమంతా
చుట్టి చుట్టి చెపుతాను
ప్రేమలోనే నాకున్నది స్నేహమని.
ఒకరి కోసం చూసేది లేదు
ఒకరి కోసం ఆగేది లేదు
నేనొక్క క్షణం కూడా వదలను
నా ప్రియుణ్ణి. ప్రేమను వదలను.
ఆయనను ప్రేమించే నాకు
ఎక్కడ అశాంతి. అంతా శాంతే.
వేరే బంధాలను తెంచుకో
ప్రేమతో ప్రేమను పెంచుకో
చక్కని కోమల ప్రేమమార్గం
ఉండగా కాదీ బ్రతుకు భారం
వినండి జనులరాఆ – కాదీ దేహం తిత్తి
ప్రేమ దీపపు వత్తి
వంచు నీ తల – చాచు నీ చేయి

కురియదా కనక వర్షం.

కాని ఈ ప్రేమైకమూర్తిని కానలేము సులభంగా

బాట అగమ్య మాట తెలియనిది (కాయిస్థుదు వెళ్ళిపోతాడు)

ప్రేమపొలంలో పండేది కాదు. బజారున అమ్మేదికాదు

ఒకరంటే ఒకరికి ఉన్న నమ్మకమే ప్రేమా, త్యాగమే ప్రేమ.

రాముని పొందాలంటే భక్తి ఉండాలండీ. పిరికివాడు

చేయలేనిదీ పని – చావుకు వెరవనివాడే చేయగలడీ రామనామం.

(పీపా, సీనా, రైదాసు, బషీరా వస్తారు)

కబీరు: (వాళ్ళని చూసి) నా అజ్ఞానాన్ని నశింపచేసి పట్టాను చేతిలో జ్ఞానజ్యోతిని

(నవ్వి) ఎవరైతే అజ్ఞానానికి దూరంగా ఉన్నారో వారికిదే నా ఆహ్వానం.

రైదాస్: అరె! బాబూ మాకు కాదురా నాయనా చెప్పేది. వేరే వాళ్ళకి.

పీపా: ఇప్పుడు ఇక్కడికి ఎవరు వచ్చి వెళ్ళారుట. ఆయనతో నువ్వు చాలాసేపు వాదించావుట. కొత్వాలు చంచాగాడు కాదుకదా! ఏమంటాడు.

కబీరు: ఏమంటాడు. భజనలు – సత్సంగం మానెయ్యాలట.

పీపా: నువ్వేమన్నావు.

కబీరు: నాతో వచ్చిన చిక్కే అది. అక్కడ ఏం చెప్పాలో అప్పుడు బుర్రలో తట్టి ఏడవలా! ఆయన ఎదురుగా 'చిత్తం, చిత్తం' అంటూ చేతులు కట్టుకు నుంచున్నాను. (నవ్వి) పాదుషా వస్తున్నాడు. ఆయన ఎదురుగా నీ సత్సంగాలు, వాదోపవాదాలు కట్టిపెట్టు అన్నాడు.

రైదాస్: ఆ! తర్వాత.

కబీరు: ఆ! సత్సంగ్ నడుస్తుందని చెప్పాను.

(కొత్వాలు ప్రవేశం. సిపాయిలతో పాటు)

కొత్వా: బంధించండి తన్ని. నగరమంతా అశాంతికి నిలయం చేస్తున్నాడు. ఊ. పట్టి బంధించండి.

(కబీరుని అతని అనుచరులు బంధిస్తారు)

కాయి: (కొత్వాలు వెనక వెనకగా వచ్చి) కబీరు ఇంకో విప్లవాత్మకమైన మార్పు కూడా తెస్తున్నాడని విన్నాను.

కొత్వా: ఏమిటది?

కాయి: బంతి భోజనం!

కొత్వా: అంటే?

కాయి: మాలలు – మాదిగలు – మంగాలులు – హిందువులు ముస్లిములు అంతా ఒకే పంక్తిని కూర్చుని సహభోజనం చెయ్యడం.

కొత్వా: దాంతో అతనికేమిటి లాభం?

కాయి: దీనితో ధర్మం నశించదుటండీ. జాతి–కుల–మత భేదాలు లేకుండా చెయ్యాలనుకోవడం పాపం కాదా? ఈ పాపం ఈ కాశీలోనే కాదు, దేశం నలుమూలలా పాకిందట. నానా జాతులవారు

కుమికూడుతున్నారట.

కొత్వా: అయితే ఇక్కడేకాదు – ఇంకా అన్ని చోట్లకు వ్యాపిస్తోందన్నమాట.

కాయి: భగవంతుడి పేరు చెప్పి పాదుషా వారిని భయపెట్టాలని చూస్తున్నారు. ఈ అధములంతా....

కొత్వా: వీళ్ళ మొహం. వీళ్ళేం చేస్తారు? అసలు వీళ్ళని ఏనుగులతో ఒక్కసారి తొక్కించామంటే సత్సంగాలు, బంతి భోజనాలు ఉష్ కాకి!

(కొత్వాలు దగ్గర ఉండే అధికారుల్లో ఒకడు వస్తాడు)

కొత్వా: వచ్చావా? పాదుషా వారిని కలిశావా? కాశీకి ఎప్పుడు వస్తారట?

అధికారి: సేన అక్కడనుంచి బయలుదేరిందట. పాదుషా వారు కాశీ రావలనే అనుకుంటున్నారు. ఆ కబురు మీకు చెబుతామని నేను మీ దగ్గరకు వచ్చాను.

కొత్వా: ఎన్నాళ్ళు పడుతుంది ఇక్కడికి వచ్చేసరికి?

అధికారి: రెండు రోజులలో పాదుషావారు తన సైన్యంతో విచ్చేస్తారు.

కొత్వా: వారు వచ్చిన రెండో రోజుకి రాజదర్బారు ఏర్పాటు చెయ్యాలి!

అధికారి: ప్రభువుల ఆజ్ఞ. (అధికారి వెళ్ళిపోతాడు) (రెండవ అధికారి వస్తాడు)

కొత్వా: ఏమిటి సమాచారం?

అధికారి: పాదుషా వారు ఇక్కడికి వేంచేయగానే కబీరు అనే సాధువును కలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

కొత్వా: (చాలా హైరానా పడతాడు) అయ్యో! అయ్యయ్యో! మేము అతన్ని, అతని అనుచరులను బందీలుగా చేశామే!

అధికారి: పాదుషావారి మతగురువు షేఖ్‌తకీ కబీరుదాసుని కలవాలనుకుంటున్నారు. అందుకే పాదుషా వారు కూడా కబీరుదాసుని చూడాలనుకుంటున్నారు.

కొత్వా: అంచనాలు తారుమారు అయ్యాయే! మేమేమో కబీరుదాసుని పాదుషావారికి చికాకు కలిగిస్తాడేమో అని జైలులో ఖైదు చేశాము.

అధికారి: పాదుషా అంటే ఎవరు? మనిషిని మనిషిగా గుర్తించగలిగేవారు అని. కబీరులో ఉన్న సుగుణాలను ఆయన కనిపెట్టగలిగారు. మనం మామూలు మనుషులం కదనుక కనిపెట్టలేకపోయాం. అదీ తేడా!

కాయి: నాయనా! ఎవరిలోనన్నా సరే ఉండే మంచి గుణాలను మెచ్చుకునే వాళ్ళని బ్రహ్మరథం పడతారు. అందుకే తండోపతండాలుగా ప్రజలు కబీరు సత్సంగ సమావేశాలకి వెడుతున్నారు. ఆయన సత్సంగంలో ఏమహత్తు లేకపోతే అంత మంది ఎందుకు వెడతారు?

అధికారి: అతన్ని గంగలో ముంచారు. చర్మం వలిపించారు. మదపుటేనుగుల ముందు పడేయించారు. అయినా కాని ఆయనికి ఇసుమంత హాని జరగలేదు అంటేనే ఆయన మహత్తు అర్థం కావడంలా?

కొత్వా: ఆయనలో భగవద్దత్తమైన శక్తి ఏదో ఉంది. లేకపోతే జనమంతా ఆయనంటే ఎందుకు ఆకర్షింప బడుతున్నారు?

కాయి: నిజం, నిజం. మొట్టమొదటసారి నేను కబీరును చూడడానికి వెళ్ళినవాణ్ణి వెళ్ళినట్టే ఉండిపోయాను. రెప్పెయ్యి లేదంటే నమ్మండి. కళ్ళు చెదిరిపోయే వెలుగేదో ఆయన మొహంలో కన్పించింది.

అంతే అక్కడే ఉండి అతన్ని తనివితీరా చూడాలనిపించింది.

కొత్వా: అందుకే మేం ఏం చేశామంటే కబీరు దాసుని అతని అనుచరులనీ బంధించినట్లయితే మన కళ్ళముందే - కాశీలోనే ఉంటారని ఆశ. అందుకే వారిని బంధించాం.

అధికారి: వాళ్ళు కూర్చునే ప్రదేశాన్ని శుభ్రం చేసే బాధ్యత నాది. నీళ్ళు జల్లించి, ముగ్గులు పెట్టించి రాజోచితమైన మర్యాదలు జరపడానికి నేను పూనుకుంటాను.

కొత్వా: గులాబీ - అత్తరు - పన్నీర్లు జల్లించండి. పాదుషావారు వారిని (కబీరు) అక్కడే కలుసుకోవా లనుకుంటారో ఏమో! కబీరు ఇల్లు తగలబడిపోయిందని పాదుషా వారికి తెలియనివ్వకండి. వారితో మనం తిన్నగా వ్యవహరించ లేదని కూడా తెలియనియ్యొద్దు. తెలియ చేసినట్లు తెలిస్తే - ఆ తర్వాత మీరు తినాల్సి వస్తుంది.

అధికారి: అయ్యా! ఆయన ఎక్కడుంటే అక్కడ పట్టుకు తన్నాం. సమావేశాలు భగ్నం చేశాం. కొరడా దెబ్బలు కొట్టాం. మరి పాదుషా వారేమో కబీరుని కలవడానికి స్వయంగా వస్తున్నారంటే....ఏమో ఏలినవారి మనసు మనకేం తెలుసు (దూరంగా నగారాలు బాజా, భజంత్రీలు చప్పుడు)

కొత్వా: ఏమిటా కోలాహలం (1వ అధికారి ప్రవేశం)

1 అధి: సేన, పరివారం వచ్చేసింది.

కొత్వా: కొలువులో ఉన్నవారందరూ పాదుషావారి స్వాగతం కోసం కోట దగ్గరకు రావాలని చెప్పండి. మేము మస్తున్నాం.

1 అధి: ప్రభూ! కాశీరాజు కొలువులో ఉన్నవారందరూ కూడ ఇంతముందే పయనమయ్యారు.

కొత్వా: సేననంతా పాదుషావారి సేవకై నియోగించండి.

1 అధి: సైన్యం తిండి-తిప్పలు జూడడానికి వ్యాపారులంతా సరుకు - సామాను తెచ్చివ్వాలని దండోరా వేయించాం. అంతేకాదు కబీరుదాసుతో అందరూ మర్యాదగా వ్యవహరించాలని కూడా చెప్పించాం. పదండి కొత్వాల్. మనం కూడా పాదుషావారి కోసం వెడదాం.

కాయి: కబీరుదాసు భాగ్యం కొనియాడేట్లుందా? ఆయన చాలా జ్ఞాని-వేదాంతి. (అందరూ వెడతారు)

కొత్వా: పాదుషావారి కోర్కె వారి రాకకుముందు తెలిసింది కనుక సరిపోయింది. లేకపోతే కబీరును ఏం చేసేవాళ్ళమో. దానివల్ల మాకెంత శిక్ష పడేదో?

**(తెర)**

# మూడవ అంకం

## మొదటి దృశ్యం

(రోడ్డు వారగా కబీరు– రైదాసు ఊడుస్తున్నారు. బంతిభోజనాలు ఇంటివెనక వసారాలో ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అంతా తలో సామాను (భోజనాలకి) పట్టుకొస్తున్నారు. వసారా వైపుగా వెడుతున్నారు)

కబీరు: ఇంతమంది వస్తారని నేను అనుకోలేదు.

(కబీరు భార్య లోఈ ఎర్ర వోణీ కప్పుకుని నవ్వుకుంటూ వస్తుంది)

రైదాసు: వచ్చేశా వదినా!

లోఈ: లేకపోతే! ఇంటిదగ్గర కూర్చుందామనుకున్నావా? (కబీరుతో) ఇవాళ బంతి భోజనాలు జరుగుతున్నాయి కదా! ఈ ఎర్రవోణీ కప్పుకొద్దామని – (కబీరు వంక చూసి) ఏంటట్టా చూస్తావు. నేనేసుకుంటే బాగుందా?

రైదాసు: ఓహో – చాలా బాగుంది.

లోఈ: మీ అన్నయ్య నాకోసం స్వయంగా నేసాడు. ఈ వోణీ నేస్తూ కవిత్వాలు, పదాలు కూడా చెప్పాడంట. (కబీరుతో) పదాలల్లావా లేదా?

రైదాసు: ఏం కవిత్వం అది?

కబీరు: గుర్తులేదు.

లోఈ: సరే! నీకు గుర్తుకులేకపోతే నాకు లేదా ఎట్టా.

ప్రేమరసంతో తడిసిన వోణీ.....

.......................

ఇదేనా? అవును కదూ!

కబీరు: (నవ్వి) ఇదే! అమ్మ రాలేదా?

లోఈ: గోధుమపిండి కలుపుతోంది. బషీరా భయ్యి ఓ గోనెసంచుడు పిండి అమ్మముందు పడేసి వచ్చాడు. ఇంటిదగ్గరే పిండి కలుపు వస్తానని చెప్పింది అమ్మ. (వెనక్కి చూసి) అబ్బో, 5,6 పొయ్యిలు వెలుగుతున్నాయే బలే బావుంది. (అటు వెడుతుంది)

బషీరా: (వెనక వసారాలోనుంచి వస్తూ) అల్లా దయవల్ల చాలామంది వచ్చేటట్టున్నారు.

సీనా: వాళ్ళు వీళ్ళు అని తేడా లేకుండా హిందువులు – ముస్లిములు. తక్కిన జాతులు వారు – అంతా వస్తామన్నారు.

బషీరా: (చేతిలో తమలపాకుల సామానువేసి నలుపుతూ) నాక్కూడా కవిత్వం చెప్పడం పాడడం ఏక్‌తారా మీటడం నేర్పవయ్యా అని అడిగాను కబీరుని – ఊహూ నేర్పితేగా?

సీనా: రైదాసుని అడుగు. చెప్పుతాడు.

బషీరా: అరె చెప్పకపోతే చెప్పకపోనీ. వీళ్ళంతా ఒకేతాను బట్టలాంటి వాళ్లు. కబీరు పాడే పదం పాడితే

అది నా పదమల్లేనే అనిపిస్తోంది. (కబీరుతో) కబీరు బాయి. ఇంక సత్సంగ ఏర్పాటు చెయ్యి ఆలస్యమయిపోతోంది.

కబీరు: నేను అదే అనుకుంటున్నాను.

నూరా: (నోరు వెడల్పాటి కళాయిని మోసుకోస్తూ) ఒక్క నిముషం విశ్రాంతిగా కూర్చోనియ్యవు కబిరా! (కబీరు ముందుకెళ్ళి కళాయి తీసుకోబోతాడు) కడుపునిండింది నాయనా ఇవాళ నిన్ను చూస్తుంటే.

కబీరు: అది ఇటుఇయ్యి నాన్నా.

నూరా: ప్రపంచంలోని మాటలన్నీ ఓ ఎత్తు. నీ మాటలన్నీ మరో ఎత్తు. ఇవాళ సాధువులందరికీ అన్నం పెడతావటగా?

కబీరు: వాళ్ళకే కాదు. ఎవరొస్తే వాళ్ళకి!

నూరా: ఇట్లా బంతి భోజనాలని కూర్చుంటే మగ్గం నేసేదెవరురా?

కబీరు: అదే నడుస్తుంది. చూస్తుండు. నువ్వు ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకో.

నూరా: నువ్వేమో ఒళ్ళు విరుచుకు పనిచేస్తుంటే నేనుఇంటి దగ్గర విశ్రాంతి ఎలా తీసుకుంటాను. ఊ.... చెప్పు ఇంకేమన్నా చేయాలంటే చేస్తాను!

కబీరు: వెనక వసారాలోకి వెళ్ళు. పీపా నీకేమయినా పని చెబుతాడేమో చూడు.

నూరా: (విసుక్కుంటూ) ఇప్పుడా పీపా ఎక్కడున్నాడో వెతుక్కుంటూ పోవాలి. (వెళ్ళిపోతాడు)

బషీర్: (సీనాతో) ఊళ్ళోకి పాదుషా వారి సేన దిగింది. వాళ్ళకి ఆడింది ఆట – పాడింది పాటగా ఉంది. ఇటు వెనకగా జంగిడీ వాడున్నాడు తెలుసా..

సీనా: ఆ......

బషీరా: వాడి దగ్గర మనం పూరీలు తీసుకోవాడానికి వెడితే దగ్గరకి కూడా రానిచ్చేవాడు కాదు. మనల్ని కింద నేలమీద కూర్చోమనేవాడా – పైనుంచి బిచ్చమేసినట్టు పూరీలు చేతిలో వేసేవాడు. ఇవాళ చూశావా ముస్లిమ్ సైనికులు ఒకళ్ళు నొకళ్ళుతోసుకుంటూ వాడిదగ్గర పూరీలు తింటున్నారు. సాలే......ఆ జంగిడీ వాడు లపక్ లపక్ మని పూరీలు ఇస్తున్నాడు వాళ్ళకి.

సీనా: దుకాణదారుడు దృష్టిలో వస్తువు కొనేవాడు ప్రతివాడు భగవంతుడే!

బషీరా: నిజం చెప్పావు. భగవంతుడు తను తిన్నదానికి పైసలు ఇవ్వనట్టే ఈ సైన్యం కూడా ఒక్క చిల్లిగవ్వ ఇవ్వదు.

కబీరు: బషీరా భయ్యా – వాళ్లని కూడా పిలు. సత్సంగం మొదలు పెడదాం. (కబీరు ఏక్‌తారా తీసుకుంటాడు)

(చాలమంది జనం వెనక వసారా వైపు నుంచి వస్తారు. అందరూ కలిసి మైమరచి తన్మయత్వంతో పాటలు పాడతారు. అందరూ కలిసి)

మన రామ్, రహీమ్, అల్లా అంతా ఒకటే
బిస్మిల్లా అయినా విశ్వంభరుడైనా ఒకటే

(పాడుతూ ఉండగా సికిందర్‌లోడీ చేతిలో బల్లాలు ఉన్న సైనికులతో స్టేజి మీదకు వస్తాడు పల్లకీలో. అక్కడి కబీరుని మిగతా జనాన్ని చూసి చేత్తో సేనని ఆగమన్నట్లు చెయ్యి ఊపుతాడు సికిందర్)

లోడి: ఏమిటి? ఇక్కడ జరిగే ఈ సమావేశం దేన్ని గురించి?

కొత్వా: ప్రభూ! ఇది కబీరుదాసు ఏర్పాటు చేసిన సత్సంగము. (కబీరు వైపు చూపిస్తూ) అడుగో అతడే కబీరు!

లోడి: పిలు అతన్ని – మేము అతన్ని కలవాలనుకుంటున్నాం.

(కబీరు ముందుకు వస్తాడు)

ఊ. నువ్వేనా ఆ కబీరు. నీ పేరు మేము చాలా చాలా విన్నాం. మేము నిన్ను కలవాలనుకుంటున్నాం. మాట్లాడాలనుకుంటున్నాం.

(సికిందర్ పల్లకిదిగి బైటకు వస్తాడు. ఒక పక్కగా పెద్దకుర్చీ వేస్తారు. కొత్వాలు కాక ఇంకా ఇద్దరు ముగ్గురు పెద్ద ఉద్యోగులు అతనితో ఉంటారు. బల్లాలు పట్టుకున్న వాళ్ళు రాజుగారి వెనకగా నుంచుంటారు. సత్సంగీయులు తమ తమ శిధిలమైన దుస్తులతో లేచి నుంచుంటారు)

ఈ రోడ్డు పక్కగా నువ్వేం చేస్తున్నావు ఫకీర్?

కబీరు: భగవంతుడి నామస్మరణ ప్రభూ!

లోడి: భగవంతుడి ఆరాధనకి నీకు ఇంతకంటె మంచి స్థలం లేదా? (కొత్వాతుతో) రోడ్డు పక్కన ఉండేది బిచ్చగాళ్ళు అవునా? మా దగ్గర శేఖ్‌తికీ ఏ ఉద్యానవనంలోనో, ఏ మసీదు అరుగు మీదనో కూర్చుని అల్లాని ప్రార్థిస్తారు. (కబీరుతో) మేము నీ పేరు చాలా విన్నాం. మా మత గురువులు తరుచు నీ ప్రస్తావన తెస్తుంటారు.

కబీరు: వారి దయ.

లోడి: ఇక్కడకూడా సాధువులు, ఫకీర్లు – వారి వారి ప్రభావం ఎక్కువగానే ఉన్నట్టుంది. (కబీరు ఎదురుగా నుంచుని చిరునవ్వు నవ్వుతుంటాడు) (కబీరు వైపు చూసినువ్వు మా వెంట ఢిల్లీ రావాలి. అక్కడ మా మత గురువులతో నీ పరిచయం చేస్తాం. (ప్రక్కనున్న ఉద్యోగితో) ఈ ధార్మికుల వాదోపవాదాలు వింటుంటే బలే మజాగా ఉంటుంది. మామూలుగా నేను ఇద్దరు మౌల్వీల మధ్య ఒక వివాదం లేవనెత్తుతాను. ఇహ వాళ్ళ మధ్య జరిగే చర్చలు – ఓహ్ – వినసొంపుగా ఉంటాయి. (మంత్రితో) హిందువులు రాతితో దేవుడున్నాడని పూజించరట. ఛట్! అదీ ఒక పూజేనా? ఒక రాతిముక్క దేముడెలా అవుతుంది. అయితే దానివెనుక ఏమైనా తర్కముండి ఉంటుందా?

మంత్రి: ప్రభూ!

లోడి: ఒక చిత్రకారుడున్నాడనుకో. వాడి మనస్సులో ఓ ఊహ ఉందనుకో. ఆ ఊహకో రూపంలేదు వర్ణం లేదు. ఆకారం లేదు. కాని చిత్రకారుడు గీతలు గీసి రంగులు వేసి ఊహకు రూపం ఇస్తాడు. ఆ చిత్రకారుడు దాని ద్వారా చెప్పదలుచుకున్నదేమిటి? వింటున్నావా? తెలిసిందా? అలాగే రాతిలో దేవుడు లేదు. కాని దాని ద్వారా భగవంతుడి రూపాన్ని నిలుపుకోటానికి ప్రయత్నిస్తాము అనేది హిందువుల వాదం. నిజం చెప్పాలంటే ఇవన్నీ ఆలోచించి ఆలోచించి తల బద్దలు కొట్టుకోవడం అనవసరం. (కబీరుతో) కేవలం సాధువువేనా లేకపోతే ఎద్దైనా పనీ – పాటా చేస్తూంటావా? అంటే భిక్షాటన చేసి కడుపు నింపుకుంటావా? లేక.....

కబీరు: నేను సాలెవాణ్ణి ప్రభూ. బట్టలు నేస్తాను. ఇదుగో వీరు ఈయన రైదాసు, నా గురువు, సోదరుడు.

మాదిగ కులానికి చెందినవాడు. ఎదురుగా ఉన్నవాడు సీనా – మంగలివాడు. ఇదిగో ఇతను బషీరా తోలు సంచులతో నీళ్లు మోసేవాడు.

లోడి: అచ్ఛా! అయితే నువ్వు ఫకీరువి కాదన్నమాట. నువ్వు ఫక్తు అల్లాని ఆరాధించే ఫకీరువనుకున్నాను. అన్ని జాతుల–మతాల ప్రతినిధివన్న మాట. (కబీరును కిందినుంచి పైదాకా పరిశీలగా చూసి) చూస్తే బట్టలు నేసేవాడివిగా లేవే? అడుక్కు తినే బిచ్చగాడిలాగా ఉన్నావు. (అధికారి మంత్రివైపు చూసి నవ్వుతాడు)

కబీరు: అక్కడే ఉంది తమాషా ప్రభూ! బట్టనేసే వాడికే బట్ట కరువు. ఉన్న చిరుగుల బట్టలతోనే వాళ్ళు తృప్తి పడుతూ వుంటారు.

లోడి: ఎవరి అదృష్టం వారిది. అదృష్టముంటే స్వర్గానికి లేకపోతే నరకానికి వెడతారు. చిరిగిన బట్టలు – ముత్యాల హారాలు ఎవరి అదృష్టాన్ని బట్టి వారికి...(మెళ్లోంచి ముత్యాల హారం తీసి ఆడుతూ వుంటాడు. కబీరు నవ్వుతాడు) ఏం ఫకీర్. ఎందుకు నవ్వుతున్నావు

కబీరు: ప్రభూ మీరు ముత్యాల మాల తియ్యగానే నాకోమాట గుర్తొచ్చింది.

లోడి: మేము ఆ మాట వినొచ్చునా? ఏదీ చెప్పు?

కబీరు: కొన్ని సంవత్సరాలకు పూర్వం మా దగ్గర అమీరు ఖుస్రో అని పెద్ద దాత ఉండేవాడు. మీరు వినే వుంటారు.

లోడి: అందుకు సందేహమా!

కబీరు: ఆయన తన ప్రభువు మెడలోని ముత్యాల హారాన్ని చూసి పక్కనే ఉన్న నౌకర్లని "బీదవారి కన్నీళ్లన్నీ ఏరుకొచ్చి ముత్యాల దండగా చేసి ప్రభువారి మెడ నలంకరించండి" అని ఆజ్ఞాపించాడంట.

లోడి: నీ ఉద్దేశ్యం.....ఏమిటి దానర్థం.

కబీరు: మీరు ఎవరి అదృష్టం వారిది అని అంటుంటే నాకామాట గుర్తుకొచ్చింది. ఒకరి కన్నీళ్ళు మరొకరి కంఠ హారం కావచ్చు. ఆ ఒకరు చిరిగిన బట్టల్లో ఉండొచ్చు.

లోడి: చాలా సమయోచితంగా చెప్పావు. ఫకీర్లు ఫక్తు భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. ఇతరుల కోసం – వారి బాగుకోసం వరాలడుగుతారు. అయితే నువ్వు వృత్తి రీత్యా ఫకీరువి కాదనుకో. (కొత్వాలు వైపు చూసి) ఫకీరుగా ఉండడం ఈ రోజుల్లో ఒక వృత్తిగా అయిపోయిందనుకో. (కబీరుతో) మా శేఖతికీ నిన్ను గురించి చెపుతుండడం వల్ల నిన్ను మేము చూడాలనుకున్నాం. నువ్వు ఒట్టి ఫకీరువి – ఖుదా సేవకుడిని అనుకున్నాం కాని వృత్తి చేస్తూ ఫకీరులా ఉంటావనుకోలేదు.

కబీరు: మీరు చెప్పే ఆ ఫకీరుతనం నిజంగా ఈ రోజుల్లో ఒక వృత్తిగా మారిపోయింది ప్రభూ!

లోడి: నీవు చేఏ ఫకీరు వృత్తి దీనికంటే భిన్నమైందా ఏం?

కబీరు: ముమ్మాటికీ నా వృత్తి గాని ఇల్లు వాకిలిగాని దానికోసం వదులుకోనక్కరలేదు. ప్రభూ! నా దృష్టిలో ప్రతి పనీ భగవంతుడి సేవయేనని నా నమ్మకం.

లోడి: చాలా ఉన్నదున్నట్టుగా చెప్పావే! చాలా తెలివిగలవాడిలా కనిపిస్తున్నావు. ఇంకా వివరంగా చెప్పు. ప్రతి పనీ భగవంతుడి ఆరాధన ఎలా అవుతుంది. ముందు "బట్టలు నేయడం భగవంతుడి సేవ" ఎలా అవుతుందో చెప్పు చూద్దాం. (కొత్వాలుతో) ఈ ఫకీర్లందరూ పిచ్చవాళ్లనుకుంటా! (కబీరుతో)

మేము ఇప్పుడు యుద్ధం చేస్తాం. అది కూడా అల్లా సేవ అంటావా?

కబీరు: కాదు అది అల్లా సేవ కాదు. మనిషికి సేవ చెయ్యడం అతన్ని సుఖపెట్టడానికి ప్రయత్నించడం,ఇదీ అల్లా సేవ అంటే.

లోడి: మేము బీహారులో విజయఢంకా మోగించి మా జండానెగురువేసి వచ్చాం అంటే అదేమన్నా సామాన్యమైన విషయమా? ఏం ఇది మేము జాతికి చేసిన సేవకాదా? దీనుల సేవకాదా?

కబీరు: (నవ్వుతాడు) లేదు ఇది దీనుల సేవ కానే కాదు. పైగా వారి యెడ భగవంతుడి యెడ అపచారమే జరగింది.

లోడి: (ఉలిక్కిపడి) మమ్మల్ని ధిక్కరించి మాట్లాడిన వారిలో నువ్వే మొదటివాడివి ఎంత సాహసం అయినా మేము నీతో వైరం పెట్టుకోదు్చకున్నాం. సాధు–ఫకీర్ల మీద మేం చేయెత్తం (చాలా తీవ్రమైన దృష్టితో కబీరును చూస్తూ) నీ మతమేమిటి?

కబీరు: నేను అల్లా సేవకుణ్ణి. నా మతం మనుషులను ప్రేమించడం. నేను భగవంతుడికి మాత్రమే నమస్కరిస్తాను. ఆయననే ఆరాధిస్తాను.

లోడి: కాని నీకంటె దీనులుండి ఉంటారు. నువ్వు వారి సేవ కూడా చేస్తావు కదా!

కబీరు: ప్రతి మనషి హృదయాలలోను ఉండే భగవంతుడికి నేను తప్పక సేవ చేస్తాను.

లోడి: ఎవరా భగవంతుడు – ఎవరా అల్లా?

కబీరు: నా భగవంతుడు, నా అల్లా, నాఆకు నాలుగు పక్కలా ఉన్నాడు. నా మనసులో ఉన్నాడు. ఆయన దృష్టిలో హిందువులు – ముస్లిములు అని వేరు వేరు జాతులు లేవు. వేరు వేరు ధర్మాలు లేవు కులాలు లేవు. అల్లా వెలుగు ప్రతి మనిషిలోను చూస్తాను నేను. ప్రతి మనిషి మనసులో భగవంతుడున్నాడు.

లోడి: నువ్వు చెప్పే మాటలు అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తున్నాయి.

కబీరు: స్వర్గ సుఖాలను మించె లౌకిక సుఖాన్నిచ్చే భగవంతుడు నా మనస్సులో ఉన్నాడు.

ఈ మనస్సులో తోటలు తోపులు చాలా ఉన్నాయి.
చూడ చూడగా ఆట కనులకు తోచని అల్లా ఉన్నాడు.
ఇందులోనే సప్తసముద్రాలు, ఉన్నాయి తమ్మి లక్షల తారలు
ముత్యాలున్నాయి. రతనాలున్నాయి. పరీక్షించే భగవంతుడు
ఈ మనిషి మనసులోనే అనంతమైన భగవంతుడు గర్జిస్తాడు.
ఉన్నవి ఇక్కడ............
భగవంతున్నాడని కబీరు చెప్పేమాట వినుమో మనసా!

లోడి: కాని నా ప్రశ్నకు సమాధానం ఇదికాదు. మా దగ్గర కూడా సూఫీలున్నారు. కాని వాళ్ళు ముసల్మానులు వాళ్ళు దీనులకు సేవ చేస్తారు. ఆదరిస్తారు. ఇతను దీనులను లెక్క చెయ్యడల్లే ఉందే! మళ్ళీ నిన్ను అదే ప్రశ్న వెయ్యవలసి వస్తోంది ఫకీర్. నీ మతమేమిటి?

కబీరు: నేను మతం జోలికి పోను ప్రభూ. వాటిని ఏనాడో వదలిపెట్టాను

లోడి: మతాన్ని ఒదిలిపెట్టడమా. అదెలా సంభవం! ఇప్పుడేగా ఖుదా జాతి ఏమిటో చెపుతున్నావు!

కబీరు: ఖుదాకి మతమంటూ ఏమీ లేదు ప్రభూ! రోజా–నమాజ్ మతం వ్రత–ఉపవాసాలు మతం.

లోడి: అయితే?

కబీరు: రోజా–నమాజ్ చెయ్యని వాడు ముస్లిమ్ కాడు– వ్రత– ఉపవాసాలు ఆచరించనివాడు హిందువుకాదు.

లోడి: బాగానే వుంది. మరి.....

కబీరు: నేను ప్రతి మనిషినీ భగవంతుడిగానే చూస్తానుకాని హిందుముసల్మాను అని చూడను –

లోడి: అదెలా? హిందువు హిందువే, ముసల్మాను ముసల్మానే! హిందూ పుత్రుడు హిందువు కాడా?

కబీరు: జన్మతః అందరూ మనుషులే! అలా కాకపోతే బ్రాహ్మణుడి కొడుకు తల్లి గర్భంనుంచి వస్తూ బొట్టు పెట్టుకు వస్తాడు. ముసల్మాన్ ఖతనీ చేయించుకుని పుడతాడు.

(కొత్వాలు, సికిందర్ లోడీ ఒకరినొకరు చూసుకుంటారు)

లోడి: ఏమిటి వీడు వాగుతున్నాడు? (కబీరుతో) ఇదుగో ఫకీరూ! నీ సిద్ధాంతాలు నిన్ను గొప్పవాణ్ణి చేస్తయ్యనుకుంటున్నావేమో!

కబీరు: గొప్పతనం నాకెందుకు, నా భగవంతుణ్ణి నేను చేరగలిగితే చాలు. మనిషి మనిషిగా చూస్తే.....

కొత్వాలు: వీడు దీనులని అవమానిస్తున్నాడు. రోజా–నమాజ్ అంటే వీడికి లెక్కలేదు. అంతెందుకు మసీదు మెట్లమీద నుంచుని ఇష్టమొచ్చినట్లు కూస్తున్నాడు.

లోడి: ఏయ్ ఫకీర్ నిన్ను మాతో ఢిల్లీలోని షేక్‌తకీసాహెబ్ దగ్గరకి తీసుకెడతాం. అక్కడ తేలుతుంది. నీ ఉన్మాదపు చేష్టలు–మాటలు ఇక్కడ ఎంతటి కలుషిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయో...చెప్పు నీ మతం ఏమిటి? (అరిచినట్లుగా)

కబీరు: (ఒక్క క్షణం నిశ్చలంగా నుంచున్నవాడు వెంటనే పైకి చెయ్యి చూపించి)

హిందూ–ముసలమాన్ తేడాలేదు
పూజాలేదు నమాజ్ లేదు
నిర్గుణ నిరాకార భగవంతుడికి
ప్రణమిల్లే ఈ కబీరు హజ్ యాత్ర
తీర్థయాత్ర దేనికీ పోదు. భ్రమలన్నీ
తొలిగే మనసున నిరంజనుడి వెలుగు వెలిగె

లోడి: ఇదా నీ సమాధానం......(కొత్వాల్‌తో) వీడ్ని కనిపెట్టి చూస్తుండు. ఏమైనా వెధవ్వేషాలు వేస్తే నాతో చెప్పు. (లేస్తాడు) చూడు ఫకీర్! ఇకముందు దీనుల్ని కష్టపెట్టినట్లుగాని, అవమాన పరిచినట్టు గాని తెలిసిందంటే నీ ముంగాళ్ళు విరక్కొడ్తాను ఖబడ్దార్! (చాల కోపంగా) వీణ్ణి ఈ పట్టణంనుంచఇ బహిష్కరించండి...వీళ్ళందర్ని ఇక్కడి నుంచి పొమ్మనండి.

(సికిందర్ వెళ్ళిపోతాడు. సుల్తాను సిపాయిలు బల్లేలు చూపిస్తూ కబీరును అక్కడినుంచి తీసుకెడతారు. మిగతా సిపాయిలు వాళ్ళతో పాటు వెడతారు)

కబీరు: (వెడుతూ వెడుతూ)

నిర్గుణనీ నుతియించెద

నిర్భయంగా ప్రార్థించెద.

(కొంచెం సేపు స్టేజ్ అంతా మౌనంగా ఉంటుంది. భక్తులందరూ ఒకరినొకరు చూసుకుంటూ ముడుచుకుంటారు. వెంటనే నాలుగు పక్కలనుంచి కబీరు పదాలు పాడుతూ బోలెడు మంది జనం వస్తారు.)

నీలో ఉన్న నన్ను ఎక్కడో వెతుకుతావెందుకు మనసా.
గుడిలో లేను మసీదు కాదు నా నివాసం
కాబాలో (మసీదులాంటి కట్టడం) కాదు
కైలాసం అంతకంటె కాదు
నీలో ఉన్న నన్నే తెలుసుకోని నీవు
ఎక్కడని వెతుకుతావు నాకోసం ఓ మనసా.

**(తెర)**